పారిశ్రామిక వెలుగులు

- జిల్లాలో రెండు అల్ట్రా మెగా సోలార్ ప్లాంట్లు
- దొనకొండ, సీఎస్‌పురం మండలాల్లో ఒక్కొక్కటి



జిల్లాకు శుభవార్త.. ప్రధానంగా పశ్చిమ ప్రాంత వాసుల ఆశలు నెరవేరే సమయం వచ్చింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు సిద్ధమైంది. అందులో భాగంగా జిల్లాలో రెండు అల్ట్రా మెగా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రతిపాదనను తీసుకొచ్చింది. ఒకటి కనిగిరి నియోజకవర్గంలోనూ, మరొకటి దొనకొండ ప్రాంతంలోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. అల్ట్రా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా రూ.10లక్షల కోట్లు పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆయా ప్లాంట్ల ఏర్పాటుతో ఆ ప్రాంత అభివృద్ధితోపాటు జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

25వేల ఎకరాలు గుర్తింపు

విభజన అనంతరం ఏపీలో అధిక ప్రభుత్వ భూములున్న ప్రాంతంగా దొనకొండను అప్పటి టీడీపీ ప్రభుత్వం గుర్తించి ఇక్కడ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. భూములకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో అధికారులు రెండు విడతలుగా అప్పట్లో ఈ ప్రాంతంలోని భూములను పూర్తిస్థాయిలో సర్వే చేశారు. అందులో పట్టాభూమి 4,407.62 ఎకరాలు, ప్రభుత్వభూమి 12,367.95 ఎకరాలు, అసైన్‌మెంట్ భూమి 8,287.28 ఎకరాలు మొత్తం 25,061.85 ఎకరాలని సర్వే ద్వారా నిర్ధారించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పరిశ్రమల కారిడార్ ఏర్పాటులో ఎటువంటి అడుగులు ముందుకు వేయకపోవటంతో ప్రజలు అనేక రకాలుగా చర్చించుకున్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగం, పేదలకు ఉపాధి అవకాశాలు అడియాశలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా, ఈ ప్రాంతం అభివృద్ధి జరిగేలా దొనకొండ ప్రాంతంలో మెగా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మంత్రి ప్రకటన నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వం చొరవకు అభినందనలు తెలుపుతున్నారు.

పరిశ్రమల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం



దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధితోపాటు, పేదలకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దొనకొండలో కారిడార్ ఏర్పాటు గూర్చి ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం దృష్టిసారించక ప్రజల్లో తీవ్ర నిరాశను మిగిల్చింది. కారిడార్ ఏర్పాటు జరిగితే ఈ ప్రాంత పేదలు జీవనోపాధి, నిరుద్యోగ యువత ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నాం.

-నాగులపాటి శివకోటేశ్వరరావు,
టీడీపీ మండల అధ్యక్షుడు, దొనకొండ



దొనకొండ మండలం రుద్రసముద్రం ప్రాంతంలో పరిశ్రమల నిమిత్తం ఎంపిక చేసిన ప్రభుత్వభూమి

- ప్రతి ప్లాంట్‌కు వెయ్యివాట్ల సామర్థ్యం
- అసెంబ్లీలో మంత్రి గొట్టిపాటి వెల్లడి
- రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు
- లక్షల్లో ఉద్యోగావకాశాలు
- ప్లాంటుకు 5,500 ఎకరాల చొప్పున అవసరం
- ఇప్పటికే కనిగిరి ప్రాంతంలో రిలయెన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌పై ముమ్మర కసరత్తు
- పశ్చిమప్రాంతంలో హర్షాతిరేకాలు

ఒంగోలు/దొనకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండు అల్ట్రా మెగా సోలార్ విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కొక్క ప్లాంట్ ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తుల లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఆ మేరకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శాసనసభా సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సందర్భంగా ప్రకటించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ(ఐసీఐ) 2024 పాలసీని తీసుకొచ్చి పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపే ప్రయత్నం చేపట్టిందన్నారు. సుమారు 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ పాలసీ ద్వారా సుమారు రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు, 7.50లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ప్లాంట్ల ఏర్పాటుకు రాయలసీమ ప్రాంతం తర్వాత ప్రకాశం జిల్లా బాగా అనువుగా ఉంటుందని ప్రభుత్వం గుర్తించినట్లు మంత్రి సభలో తెలిపారు.

భారీగా ఉపాధి అవకాశాలు

జిల్లాలో ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. ఒక్కొక్క ప్లాంట్ ఏర్పాటుకు 5,500 ఎకరాల భూములు అవసరమన్నారు. దొనకొండ మండలం రుద్రసముద్రం దగ్గర ఒకటి, కనిగిరి నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలో మరొకటి ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన భూములను కేటాయించాలని కలెక్టర్‌ను కోరామన్న మంత్రి రవికుమార్ ఆ ప్రతిపాదనలు అందిన అనంతరం ప్లాంట్ల ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కొక్క మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సగటున రూ.5కోట్ల వరకు పెట్టుబడి అవసరం. ఆ ప్రకారం జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న రెండు ప్లాంట్ల రూపంలో కనీసం రూ.వెయ్యి కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా. తద్వారా ఆ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు రానున్నాయి.



రిలయన్స్ బయోగ్యాస్ రాక

జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలో ఇప్పటికే రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో రూ.65వేల కోట్ల వ్యయంతో 500 ఇంటిగ్రేటెడ్ కంప్రెస్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా తొలుత జిల్లాలోని కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు, కనిగిరి తదితర మండలాల్లో ఈ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన భూమిపై ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు దృష్టిసారించారు. తొలిగా అక్కడ మూడు ప్లాంట్ల ఏర్పాటు చేయాలని భావిస్తుండగా 4,900 ఎకరాల భూమిని అధికారులు ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం. వాటిలో ప్రభుత్వ భూములకు ఏడాదికి రూ.15వేలు, ప్రైవేటు భూములకు రూ.30వేల వంతున రిలయన్స్ లీజు చెల్లించనుంది. ఆ భూములలో ఒక రకమైన గడ్డిని పెంచి దాని ద్వారా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నారు.

మెరుగైన పాలనే లక్ష్యం



- ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లు
- జిల్లా, జోనల్‌స్థాయిలో నియామకం
- మన జిల్లాకు సురేష్‌కుమార్...
- జోనల్‌కు ఎంటి.కృష్ణబాబు
- ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల అమలు..
- సమర్థ పాలనపై దృష్టి

ఒంగోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన పాలనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు, పరిపాలన బలోపేతం, వివిధశాఖల మధ్య సమన్వయం పెంపు, సమస్యల పరిష్కారానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. గతంలో ప్రకృతి విపత్తులు, ఇతరత్రా సందర్భాలలో ఆయా జిల్లాల్లో యంత్రాంగాన్ని క్రియాశీలకంగా పనిచేయించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా పంపేవారు. గతంలో ఆ జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసిన వారిని అలా నియమించేవారు. అయితే ప్రస్తుతం మొత్తం జిల్లాలో పాలన వ్యవస్థ, పనితీరు మెరుగు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ లక్ష్యంతో ప్రత్యేక అధికారులను నియమిస్తున్నారు. జిల్లాకో సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా రాష్ట్రంలోని 26 జిల్లాలకు నియమించడంతోపాటు రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా చేసి ఐదుగురు జోనల్ ప్రత్యేక అధికారులుగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారులను నియమించారు. ఆ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

కలెక్టర్‌గా పనిచేసిన కృష్ణబాబు

అందులో భాగంగా జిల్లాకు ప్రస్తుతం మునిసిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌ను స్పెషలాఫీసర్‌గా నియమించారు. గతంలో ఆయన కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో జేసీగా, గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం పాఠశాల విద్య, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల్లో ఉన్నతాధికారిగా పనిచేసి ప్రస్తుతం మునిసిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అలాగే జిల్లాతో పాటు నెల్లూరు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు ఒక జోన్‌గా చేసి జోనల్ ప్రత్యేక అధికారిగా ఎంటి.కృష్ణబాబును ప్రభుత్వం నియమించింది. గతంలో 2004 ఎన్నికలకు ముందు కృష్ణబాబు మన కలెక్టర్‌గా ఏడాదికాలం పనిచేశారు. అనంతరం కడప కలెక్టర్‌గా పనిచేసిన ఆయన విశాఖ పోర్టు ఎండీగా, ఆర్టీసీ ఎండీతో పాటు పలు కీలక శాఖల్లో పనిచేసి ప్రస్తుతం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరిగా పనిచేస్తున్నారు.

సమీక్షలు.. రాత్రిపూట బస

ప్రభుత్వ మార్గదర్శకాల జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన అధికారి జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కలెక్టర్, ఇతర అధికారులకు సహాయకారిగా

మిగతా 6లో...

డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీ బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) విజిలెన్స్ జిల్లా అధికారిగా పనిచేస్తున్న పాకల ఝాన్సీరాణిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ కరుణ వాకాటి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఝాన్సీని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సంచలన కేసులో కదలిక

- చీమకుర్తి జంట హత్య కేసులో తిరిగి విచారణ ప్రారంభించిన పోలీసులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ
- హోంమంత్రి ఆదేశాలతో విచారణ

ఒంగోలుక్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం సృష్టించిన చీమకుర్తి జంట హత్య కేసులో కదలిక వచ్చింది. పోలీసులు తిరిగి విచారణ చేపట్టారు. మంగళవారం అదనపు ఎస్పీ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ హత్యలు జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. 2018 సెప్టెంబరు 18న డి.వెంకటసుబ్బారావు ఆయన భార్య రాజ్యలక్ష్మీ దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఓ ప్రముఖ గ్రానైట్ వ్యాపారి హస్తం ఉన్నట్లు మృతుల కుమార్తె ఆదిలక్ష్మీ అనుమానం వ్యక్తం చేశారు. ఆస్తి విషయంలో కిరాయిహత్య జరిగిందని, నిందితులను అరెస్టు చేయాలని అప్పట్లో ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అయితే సుమారు ఐదేళ్ల తర్వాత టంగుటూరులో ఓ దొంగ చోరీకి వెళ్లి తల్లీకూతుళ్లను హత్యచేసిన కేసులో దొరికాడు. అతనిని విచారిస్తుండగా చీమకుర్తిలో జరిగిన జంట హత్యలు కూడా తానే చేశానని విచారణలో చెప్పాడని, పోలీసులు ఆ కేసులో నిందితుడిగా చేర్చారు. అయితే అప్పటికీ ఆదిలక్ష్మి పోలీసులపై అనుమానాలు వ్యక్తం చేసింది. తన తల్లిదండ్రులను కిరాయి హంతకుల ద్వారా చంపించారని ఆరోపిస్తు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హోంమంత్రి ఆదేశాల మేరకు పోలీసులు తిరిగి విచారణ ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం పోలీసులు చీమకుర్తిలో హత్యలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

57 కొత్త హైస్కూళ్లు

- విద్యాశాఖ ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం
- జిల్లాలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

ఒంగోలు విద్య, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 57 హైస్కూళ్ల ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి వాటిని ప్రారంభించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అందుకు పాఠశాల యాజమాన్య కమిటీలతోపాటు మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు అంగీకారం తెలిపారు. ఈ ప్రతిపాదనలను కలెక్టర్ తమీమ్ అన్సారియా కూడా ఆమోద ముద్ర వేశారు. ఈ ప్రతిపాదనలకు పాఠశాల విద్యా కమిషనర్, ముఖ్య కార్యదర్శి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే వచ్చే విద్యాసంవత్సరం నుంచి 57 హైస్కూళ్ల ప్రారంభవుతాయి. ఈ ప్రక్రియ మొత్తం మరో నెల రోజుల్లో పూర్తికానుంది. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన వివాదాస్పద 117 జీవోను ఉపసంహరణ అనంతరం పాఠశాల పునఃవ్యవస్థీకరణకు కూటమి ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. మొత్తం 38వేల పాఠశాలలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల్లో భాగంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయడం, ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రకారం వాటిని హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

అప్‌గ్రేడ్.. డౌన్‌గ్రేడ్

యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో 60కిపైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయడం, 30మందిలోపు 6, 7, 8 తరగతుల విద్యార్థులు ఉన్న పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయడం, 59మందిలోపు 6, 7, 8 తరగతుల విద్యార్థులు ఉన్న యూపీ స్కూళ్ల విషయాన్ని ప్రత్యేకంగా సమీక్షించి నిర్ణయం తీసుకుంటారు. ఆ ప్రకారం జిల్లాలో 46 యూపీ హైస్కూళ్లలో 60మందికిపైగా 6, 7, 8 తరగతుల విద్యార్థులు ఉన్న పాఠశాలలు ఉండగా వాటిని హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దగ్గర దగ్గరగా ఉన్న యూపీ స్కూళ్లలోని 6, 7, 8 తరగతుల విద్యార్థులను విలీనం చేయడం ద్వారా మరో 11 పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదముద్ర పడింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న

మిగతా 6లో...



హెచ్‌ఎంలకు విధుల సంకటం

- ఒకేరోజు రెండు డ్యూటీలపై అయోమయం

ఒంగోలు విద్య, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. ఎవరికి వారు ఆదేశాలు జారీ చేస్తుండటంతో ఎవరి ఆదేశాలు పాటించాలో పాలుబోక అయోమయానికి గురవుతున్నారు. బుధవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సెట్-1 ప్రశ్నపత్రాలు వస్తున్నాయి. ఈమేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ముందుగానే ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోలుగా నియమితులైన హెచ్‌ఎంలు ప్రశ్నపత్రాలను ట్రంకుపెట్టెల్లో పెట్టి పోలీస్ స్టేషన్లలోని స్ట్రాంగురూముల్లో భద్రపర్చేందుకు సిద్ధమయ్యారు. అయితే ఊహించని పిడుగుతో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బుధవారమే ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఆకస్మికంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతినెలా 15వతేదీన స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని గతంలో ఆయన ఆదేశాలు ఉన్నాయి. అయితే మూడు రోజుల ముందుగా 12వతేదీనే స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని వాట్సాప్‌లో హెచ్‌ఎంలను ఆదేశించారు. పరీక్షల విధులు.. అదే విధంగా స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు ముఖ్యమైనవే. దీంతో వారు సంకటస్థితిని ఎదుర్కొంటున్నారు.

నేడు స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు

జిల్లాలోని 150 క్లస్టర్లలో బుధవారం స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు రెగ్యులర్‌గా ఉదయం 9నుంచి 12 గంటల వరకు నిర్వహించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలి. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలి. కాంప్లెక్స్ పరిధిలోని టీచర్లు వంద శాతం మంది మధ్యాహ్నం ఒంటి గంటకు స్కూలు కాంప్లెక్స్‌కు హాజరు కావాలి. బుధవారం పాఠశాలలు నిర్వహించే విషయాన్ని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలి. ఎస్సీఈఆర్టీ జారీ చేసే అజెండా ప్రకారం సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌జేడీ, డీఈవో, హైస్కూలు హెచ్‌ఎంలను ఆదేశించారు.

భక్తులకు అండ.. శింగరకొండ.. | 12 నుంచి 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం | నేడు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గొట్టిపాటి 7

గ్రానైట్ సంపులో పడి వలస కార్మికుడు మృతి

చీమకుర్తి, మార్చి11(ఆంధ్రజ్యోతి) : మర్రిచెట్లపాలెం సమీపంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద సంపులో పడి వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. రాజస్థాన్‌కు చెందిన చున్నారామ్(19) గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. తోటి కార్మికులతో కలిసి పక్కనే ఉన్న మూతపడిన ఫ్యాక్టరీ ఆవరణలో నిండుగా నీటితో ఉన్న సంపు వద్ద స్నానం చేయటానికి వెళ్లాడు. ఈక్రమంలో ఆయన ప్రమాదవశాత్తు సంపులో జారిపడ్డాడు. ఈత రాకపోవటంతో ఊపిరి ఆడక మృతిచెందినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

మెరుగైన పాలనే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)
ఉండాలి. ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనాలి. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. గ్రామాల్లో పర్యటించడంతోపాటు నెలకు కనీసం రెండు గ్రామాల్లో రాత్రిపూట బస చేయాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పరిష్కారంపై సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలి. నెలవారీ పురోగతి నివేదికను జోనల్ ఇన్‌చార్జీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు అందజేయాలి.

యంత్రాంగానికి మార్గదర్శనం

జోనల్ ఇన్‌చార్జీగా ఉండే అధికారి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు జిల్లాలో సమర్థవంతంగా అమలు జరిగేలా అధికార యంత్రాంగానికి మార్గదర్శనం చేయాలి. నెలవారీ సమీక్షలు చేయడంతోపాటు ప్రాధాన్యత కార్యక్రమాల్లో తన పరిధిలోని జిల్లాల్లో పాల్గొనాలి. నెలకు ఒకసారి గ్రామాలను సందర్శించి రాత్రిపూట బసచేయాలి. ఆయా జిల్లాల్లోని పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో చర్చలు నిర్వహించాలి. ప్రజా ఫిర్యాదుల స్థితిని సమీక్షించి పరిష్కారానికి చొరవచూపాలి. కలెక్టర్, ఇతర అధికారులకు పాలనా సంబంధ శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అవాంతరాలను, జాప్యాన్ని గుర్తించి విశ్లేషించాలి. జిల్లాలో కీలక ప్రాజెక్టుల నిధుల కేటాయింపుపై దృష్టిపెట్టాలి. అన్ని అంశాలపై ముఖ్యకార్యదర్శికి నివేదిక ఇవ్వాలి.

57 కొత్త హైస్కూళ్లు

(5వ పేజీ తరువాయి)
పాఠశాలలను కూడా హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయమని గ్రామస్థుల నుంచి వినతులు అందుతుండగా తగినంత మంది పిల్లలు లేకపోవడం హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కొన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ప్రైవేటు పాఠశాలల పిల్లలను తమ వారిగా నమోదు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి అందిన సమాచారం మేరకు కొత్తగా హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ కానున్న స్కూళ్ల వివరాలు ఇవే.

అప్‌గ్రేడ్ కానున్న పాఠశాలలు

యర్రజర్ల, వెంగముక్కలపాలెం, కొత్తమల్లాపురం, మోక్షగుండం, సింగరపల్లి, కందులాపురం, బండివెలిగండ్ల, తూర్పువీరాయపాలెం, శేషంవారిపల్లి, అరవవార్డు యాదవబజారు, అంబవరం, బురుజుపల్లి, బడుగులేరు, చాకిరాల, మాచవరం, తుమ్మగుంట, యడవల్లి, బోడ్డువానిపల్లి, నాగంపల్లి, జార్లపాలెం, రాజుపాలెం, అగ్రహారం(ఎస్ఎస్‌సీ), పడమర వీరాయపాలెం, చింతగుంట గోగులదిన్నె, జిమ్మకపల్లి, కెల్లంపల్లి, సింగనపాలెం, సుంకరవారిపల్లి, చినదోర్నాల, మోపాడు, నర్రమారెళ్ల, పడమరకట్టకిందపల్లి, తంగిరాలపల్లి, బట్టువారిపల్లి, ఓబులక్కపల్లి, పార్వతీపురం, శతకోడు, శానంపూడి, రాజానగరం, వెలుగువారిపల్లె, కందులూరు, గానుగపెంట, వెల్లంపల్లి, కొత్తనారసింహపురం, వైపాలెం (ఉర్దూ), కొత్తగోళ్లవిడిపి, మరో పది గ్రామాల్లోని స్కూళ్లు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ అవుతున్నాయి.

నిందితుడికి రెండేళ్ల జైలు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోను నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి, మరొకరు గాయపడడానికి కారకుడైన నిందితునికి చీరాల ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్షను విధించారు. 2018 సంవత్సరంలో నిందితుడు ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ మరో ఆటోను ఢీకొట్టాడు. ఈక్రమంలో ఎదురు ఆటోలో ప్రయాణిస్తున్న వెల్లినేని వెంకట వినోద్ మృతి చెందగా, మరో ప్రయాణికుడు జోగేశ్వరరావు గాయపడ్డారు. ఈమేరకు అప్పటి రూరల్ సీఐ భక్త వత్సలరెడ్డి కేసు నమోదు చేసి అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఒకరి మృతికి కారకుడైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువడించింది.

ఇసుక తవ్వకాలపై దాడులు

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న స్థావరంపై ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడున్న ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

గిరిజన గూడేలకు బోర్లు మంజూరు చేయాలి

రోడ్డు, కరెంటు, తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సబ్ కలెక్టర్‌ను కోరిన చెంచుగిరిజనులు

పుల్లలచెరువు మండలంలో విస్తృత పర్యటన


చెన్నపాలెం గిరిజన గూడేంలో పర్యటించిన సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్

పుల్లలచెరువు,మార్చి 11(ఆంధ్రజ్యోతి): చెన్నపాలెం గిరిజన చెంచుగూడేలలో సాగునీటి బోర్లకు అనుమతి ఇవ్వాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాగ్‌ను గిరిజనులు కోరారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని చెన్నపాలెం గిరిజన, చెంచుగూడేలలో రెండవసారి ఆయన పర్యటించారు. ముందుగా గిరిజన గూడేంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, చెప్పులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెన్నపాలెం గిరిజన గూడేంలో వసతులతో సాగుకు అవసరమైన బోర్లను ఆర్‌డీటీ ద్వారా వేయించాలని సబ్‌కలెక్టరును కోరారు. గూడేంలో సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే వుందని త్రీఫేజ్ కరెంటు ఇప్పించాలని కోరారు. గూడేంలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని బోర్లు వేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గూడేనికి పుల్లలచెరువు మండలం కేంద్రం 16 కిలోమీటర్లు ఉందని, గారపెంట నుంచి 8 కిలోమీటర్లు రోడ్డు లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గిరిజనుల సమస్యలను తెలుసుకున్న సబ్‌కలెక్టరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావు నాయక్,వీఆర్వో కోటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


చిననందిపాడు ప్రధాన రోడ్డులో నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న కరెంట్ వైర్లు

- **చిననందిపాడులో ప్రధాన రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం**
- **పట్టించుకోని విద్యుత్ అధికారులు**

చిననందిపాడు (పర్చూరు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం చిననందిపాడులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎన్నిమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో చేస్తాం కాలయాపన చేస్తున్నా రే తప్ప చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు అంటున్నారు. నేలవాలి స్తంభాలు, జారిపోయిన వైర్ల ద్వారానే కరెంట్ సరఫరా అవుతుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్తంభాలతో పశువులకు ప్రమాదం పొంచిఉందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరుస విద్యుత్ ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమన్వయంతో పనిచేయండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు


మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్, వేదికపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శింగరకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం శింగరకొండలో అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడు తూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి అ సౌకర్యం జరగకుండా స్వామి వార్ల దర్శనం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి చిన్న సంఘటన జరిగినా వెంటనే స్పందించి మిగిలిన శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు. డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ విద్యుత్ ప్రభలపై అశ్లీల, అర్ధనగ్న ప్రదర్శనలను అనుమతించేది లేదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కువగా విద్యుత్ వెలుతురు ఉండే విధంగా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహన చోదకులు పార్కింగ్ స్థలాలలో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు. ఆలయ ఈవో తిమ్మానాయుడు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, సీఐ సుబ్బరాజు, ఈవోఆర్డీ ప్రసాదరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాబేళ్ల మనుగడకు భంగం కల్గిస్తే చర్యలు


తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదులుతున్న అటవీశాఖాధికారి భీమయ్య

చినగంజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య హెచ్చరించారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడుచెట్లపాలెం తీర ప్రాంతంలో రాష్ట్ర అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ వారు నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి మంగళవారం ఆయన తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదిలారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో మొట్టమొదటి సారిగా 107 తాబేళ్ల పిల్లలను సముద్రం లోనికి వదలినట్లు తెలిపారు. కుంకుడుచెట్లపాలెం సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో 14 తల్లి తాబేళ్ల నుంచి 1400 గుడ్లను సేకరించినట్లు తెలిపారు. వాటిలో 115 గుడ్ల నుంచి 107 పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి వదలినట్లు తెలిపారు. సముద్రపు తాబేళ్ల జాతి అంతరించి పోయే జాబితాలో ఉందని, వాటిని కాపాడే ప్రయత్నం అటవీశాఖ చేస్తుందని తెలిపారు. సముద్ర తాబేళ్ల సమాచారం ఏదైనా తెలిస్తే మా సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల రక్షణ దళసభ్యులు కారాని శ్రీను, వాయల జాలయ్య, కే.వెంకటేష్, గ్రామస్తులు నగయ్య, గోపిరాజు పాల్గొన్నారు.

జోరుగా బర్లీ పొగాకు కొనుగోళ్లు

సంతృప్తిగానే ధరలు


మేదరమెట్లలో బారులుదీరిన పొగాకు చెక్కులతో ఉన్న వాహనాలు

మేదరమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు బర్లీ పొగాకు పండిస్తున్నారు. ముఖ్యంగా వినుకొండ, గిద్దలూరు, కొరిశపాడు. జే.పంగులూరు, మార్టూరు, దర్శి ప్రాంతాల్లో పండించిన బర్లీ (తెల్ల) పొగాకు మేదరమెట్ల చుట్టుపక్కల ఉన్న కొనుగోలు కేంద్రాలకు వ స్తుంది. కొరిశపాడులో జీపీఐ, మేదరమెట్లలో మద్ది లక్ష్మయ్య, మహలక్ష్మీ (పోలిశెట్టి సోమసుందరం) గుండ్లపల్లిలో ఐటీసీ తదితర కంపెనీలు బర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 25 మిలియన్ల పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. గడిచిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో రైతులు ధరలు తగ్గుతాయని మొదట్లో కొంత అం దోళన చెందారు. గత సంవత్సరం బర్లీ పొగాకు గ్రేడ్ 1 ధర కేజీ 150 రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం జీపీఐ, ఐటీసీ కంపెనీలు బర్లీ పొగాకు గ్రేడ్ 1 రకాన్ని 155 రూపాయలకు కొనుగోలు చేస్తున్నాయి. తక్కువ రకం (అడుగాకులు) 110 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరాసరిన 147, 148 చెందుతుందని వ్యాపార ప్రతినిధులు తెలిపారు. మేదరమెట్ల, కొరిశపాడు, గుండ్లాపల్లిలోని కొనుగోలు కేంద్రాల వద్ద పొగాకు చెక్కులు ఉన్న ట్రాక్టర్లు, నాలుగు చక్రాల ఆటోలు బారులు తీరుతున్నాయి. రైతులు కూడా ధరల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు ఇబ్బందికరంగా లేవంటున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయని బర్లీ సాగుదార్లు అంటున్నారు.

ఒకప్పుడు పొగాకు వ్యాపారానికి కేం ద్రగా బాసిల్లిన మేదరమెట్లకు నేడు పూర్వ వైభవం వచ్చినట్లుగా కొందరు వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 70వ దశకంలో మేదరమెట్లలో పెద్ద పెద్ద పొగాకు కంపెనీలు, పొగాకు కొనుగోళ్ల గ్రేడింగ్‌లు నిర్వహించేవి. 80వ దశకం చివర్లో పొగాకు గూడెంలలో ఎక్కువ భాగం జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులుగా రూపాంతరం చెందాయి. అప్పట్లో చు ట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు పొగాకు కంపెనీలల్లో గ్రేడింగ్‌కు వచ్చేవారంటూ గ్రామస్థులు పాత స్మృతులను నెమరవేసుకుంటున్నారు.

అవీఇవీ

మార్కాపురం, పొదిలిలో సిబ్బంది కొరతను తీర్చాలి

అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కందుల


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మున్సిపాలిటీ, పొదిలి నగర పంచాయితీల్లో సిబ్బంది కొరతను తీర్చాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మంగళవారం అసెంబ్లీలో వాణి వినిపించారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. దీంతో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని అన్నారు. అధికారులు, సిబ్బంది కొరతతో ప్రధానంగా శానిటేషన్ పనులు సక్రమంగా సాగడంలేదన్నారు. శానిటేషన్ కార్యక్రమాలు సక్రమంగా చేపట్టకుంటే ప్రజారోగ్యానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్‌శాఖ మంత్రి దృష్టిసారించి రెండు చోట్ల సిబ్బంది కొరతను తీర్చాలని కోరారు.

కోచింగ్ సెంటర్‌పై జీఎస్‌టీ అధికారుల దాడి

ఒంగోలు క్రైం,మార్చి11(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో సీఎస్‌పురంనకు చెందిన శ్రీకాంత్ డీఎస్సీ కోచింగ్ సెంటర్‌పై మంగళవారం జీఎస్‌టీ అధికారులు తనిఖీలు నిర్వహిచారు. కోచింగ్ సెంటర్ నిర్వహణకు జీఎస్‌టీ లైసెన్స్ ఉండాలి. దీనికి లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ వర్షిణీ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు, వారు చెల్లించే ఫీజు వివరాలను విచారించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న అభ్యర్థులను అధికారులను నిలదీయడంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులు వచ్చి వారితో మాట్లాడారు. జీఎస్‌టీ అధికారులు తనిఖీలు చేస్తున్నారని, ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోకూడదని చెప్పడంతో అభ్యర్థులు శాంతించారు. తనిఖీలు బుధవారం కూడా కొనసాగే అవకాశం ఉంది.

సాగర్ నీరు వృథా కాకుండా వినియోగించుకోవాలి

- **ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి**

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాలువకు కేటాయించిన నీరు ఈనెలాఖరు వరకు వస్తుందని, అందువల్ల ఆ నీటిని వృథా కాకుండా మంచినీటి చెరువులు, పంటలకు వినియోగించుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం ఇస్తున్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాగార్జున సాగర్ కుడికాలువకు మే నెలలో తాగునీటి చెరువులను నింపుకునేందుకు నీరు విడుదల చేసేంత వరకు కాలువలు మూసివేస్తారని పేర్కొన్నారు. అందువల్ల పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు తాగునీటి చెరువుల్లో నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో జిల్లా పోలీసుల ప్రతిభ

ఒంగోలు క్రైం, మార్చి11(ఆంధ్రజ్యోతి): జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చాటిన జిల్లా పోలీసులను మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీసుల కార్యాలయలో ఎస్పీ ఏఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందిచారు. బెంగళూరులో 45వ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 4నుంచి 9వ తేదీ వరకు జరిగాయి. ఈక్రమంలో జిల్లాలో ఆర్ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్స్, 400 మీటర్ల రిలేలో బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు 400 మీటర్ల రిలేలో రెండు బ్రాంజ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందిచారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఒంగోలుకు పడమర వైపు రెండో బైపాస్ ఏర్పాటు చేయాలి


కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పడమర వైపు రెండో బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న మాగుంట తొలిసారిగా పార్లమెంట్ సమావేశాలకు వెళ్లారు. ఈక్రమంలో కేంద్రమంత్రి గడ్కరిని కలిసి రెండో బైపాస్ రోడ్డు ఏర్పాటుపై చర్చించారు. ఒంగోలులో జనాభా, రవాణా పెరుగుదల ఎక్కువైనందన ఒంగోలు నగరం నుంచి టి.నాయుడుపాలెం వయా మైనంపాడు, ఎండ్లూరు, కందులూరు గ్రామాల మీదుగా వెల్లంపల్లి వరకు రెండో బైపాస్ అవసరమని మాగుంట కోరారు.

కందులు కొనుగోలుకు మోక్షం ఎప్పుడో..?




తర్లుపాడులోని రైతు సేవా కేంద్రం

తర్లుపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ద్వారా రైతుసేవా కేంద్రాల్లో కందులు, శనగలు ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. 15 రోజుల క్రితం ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా కందులు, శనగలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారుల నిర్లక్ష్యంతో ఇంతవరకు కొనుగోలు మొదలు పెట్టలేదు. రైతుసేవా కేంద్రాల్లో కందుల క్వింటా రూ.7550లకు కొనుగోలు చేస్తామని ఏవో టి.వెంకటేశ్వర్లు వారం రోజుల క్రితం ప్రకటించారు. రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు మొదలు పెట్టకపోవడంతో రైతులు ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకోవాల్సి వస్తోంది. వాటిని నిల్వ చేయడానికి రైతులు వ్యయప్రయాసలు పడాల్సి వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వ్యాపారులకు రూ.6850కే విక్రయిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు నష్టపోతు న్నారు. అధికారులు వెంటనే కందులు, శనగలు ఆర్ఎస్‌కేల్లో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

భగవద్గీతపై పట్టుసాధించిన యామిని

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం


యామినిని సన్మానిస్తున్న మహిళా ప్రతినిధులు

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో భగవద్గీతపై ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల్లో ప్రతిభ సాధించిన వారికి గోల్డ్‌మెడల్‌ను అందజేస్తారు. అందులో భాగంగా ఈఏడాది నిర్వహించిన అన్‌లైన్ పోటీలో పర్చూరుకు చెందిన పోలిశెట్టి యామిని సత్తాచాటి గోల్డ్‌మెడల్‌ను కౌవసం చేసుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక అష్టలక్ష్మి ఆలయంలో దత్తపీఠం మహిళా ప్రతినిధులు యామినిని ఘనంగా సన్మానించి అభినందించారు.

భక్తులకు అండ.. శింగరకొండ..



శింగరకొండ వ్యూ



- 12 నుంచి 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం
- నేడు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గొట్టిపాటి
- 14న ప్రధాన తిరునాళ్ల
- అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోయిన క్షేత్రం

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ క్షేత్రం భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతుండటంతో రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయ స్వాములను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటుంటారు. శింగరకొండ రాన్రాను గ్రామంగా ఏర్పడి పలు సామాజిక సత్రాల నిర్మాణం, ఇళ్లు కూడా ఏర్పడ్డాయి.

ఈ ఏడాది నుంచి మరో విశిష్టత

ఈ ఏడాది నుంచి ఉత్సవాలు ప్రారంభ రోజు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమానికి నాంది పలికారు. 12వ తేదీ సాయంత్రం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రసన్నాంజనేయస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి, జ్యోతి ప్రజల్వన చేసి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభిస్తారు.

అంజన్న ఆలయానికి ఓ ప్రత్యేకత...

- శింగరకొండలోని ఆంజనేయ స్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలలో దక్షిణ ముఖంగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం ఇదొక్కటి మాత్రమే ఉంది.
- 1916లో భవనాసి చెరువు నిర్మాణం పనులు ప్రారంభించి రెండేళ్లలో పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో కాంట్రాక్టర్ ఆంజనేయస్వామి దేవాలయం కొద్ది మేర నిర్మించారు.
- తొలుత మంగళ, శనివారాలలో మాత్రమే భక్తులు శింగరకొండకు వచ్చేవారు.
- 1960 నుంచి దేవదాయశాఖ పరిధిలోకి చేరింది. అప్పటి నుంచి ప్రతిరోజూ భక్తుల రాక ప్రారంభమైంది.
- ప్రస్తుతం నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి.
- అన్నప్రాసన, వాహనపూజ, ఆకుపూజ, లక్ష తమలపాకుల పూజ, అరటిపండ్లతో పూజలు కూడా జరుగుతున్నాయి.
- నిత్య అన్నదాన కార్యక్రమానికి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.
- అద్దంకి రెడ్డిరాజులు, చోళరాజులు, శ్రీకృష్ణదేవరాయలు తదితరులు మాన్యాలు ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

మూడురోజులపాటు తిరునాళ్ల ఉత్సవాలు

ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధత్రయోదశి నుంచి పౌర్ణమి వరకు మూడు రోజులపాటు తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఏడాది మార్చి 12 నుంచి 14వ తేదీ వరకు 70వ వార్షిక తిరునాళ్లు నిర్వహించనున్నారు. ప్రధాన తిరునాళ్ల 14వ తేదీ జరగనుందని దేవస్థానం ఏసీ తిమ్మానాయుడు తెలిపారు.



స్వర్ణ ఆభరణాల అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

దాతల సహకారంతో రూపురేఖలు మారిన శింగరకొండ

శింగరకొండలో ఇటీవల కాలంలో దేవాలయం నిధులు, దాతల సహకారంతో ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల వద్ద పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. మరికొన్ని జరుగుతున్నాయి.దీంతో క్షేత్రం రూపురేఖలు మారిపోయాయి. సుమారు 7 కోట్ల రూపాయలతో చేపట్టిన ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండపం నిర్మాణ పనులు అత్యధిక శాతం పూర్తయ్యాయి. లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద కూడా దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

సర్వదేవతల ఆరాధ్య క్షేత్రంగా...

గతంలో శింగరకొండపైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, కొండ కింద భవనాసి చెరువు ఒడ్డున శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మాత్రమే ఉండేవి. క్షేత్రాధిపతిగా లక్ష్మీనరసింహస్వామి, క్షేత్రపాలకుడుగా ప్రసన్నాంజనేయస్వామి నిత్యపూజలు అందుకుంటున్నారు. ప్రస్తుతం రెండు దేవాలయాలతో పాటు భక్తాంజనేయ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సాయిబాబా, అయ్యప్పస్వామి, శ్రీకృష్ణుని దేవాలయం, 99 అడుగుల అభయాంజనేయస్వామి, రామస్థూపం తదితర ఆలయాలు ఉన్నాయి.



99 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

శింగరకొండ ప్రాశస్త్యం దినదిన ప్రవర్థమానమిలా...

పూర్వకాలంలో అగస్త్యముని గుండ్లకమ్మ నదిలో స్నానమాచరించి నది ఒడ్డున పాత గోపాలపురంలో ఉన్న శివాలయంలో ఈశ్వరున్ని దర్శించుకొని గుహ మార్గంలో కొండ మీద ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చేరుకున్నారు. అక్కడ తపస్సు చేసుకొని స్వామి అనుగ్రహం పొందినట్లు చెబుతుంటారు. 1896లో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠించే సమయంలో కొండ దిగువన చిట్టడవిని తలపించే చెట్ల మధ్యలో వెలుగు కనిపించగా.. భక్తులు వెళ్లి చూడగా ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం ఉంది. అక్కడే ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి రెండు దేవాలయాల క్షేత్రంగా శింగరకొండ ఖ్యాతికెక్కింది.




1960 ప్రాంతంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం

సమస్యలపై సీఎంకు ఎమ్మెల్యే ఉగ్ర వినతి

ఫ్లోరోసిస్, డయాలసిస్‌ను శాశ్వత పరిష్కారం చూపాలని కోరిన ఎమ్మెల్యే

సంక్షేమ హాస్టళ్ల నిర్మాణాలకు, అభివృద్ధికి నిధులివ్వాలని అభ్యర్థన

కనిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి వివరించి నిధులు కేటాయించాలని వినతులు అందించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సీఎం చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సమయంలో కనిగిరి ప్రాంతంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరోసిస్, కిడ్నీ వ్యాధులకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని కోరారు. ప్రభుత్వాసుపత్రి డయాలసిస్ బాధితులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. అదేవిధంగా ప్రభుత్వాసుపత్రిలో తప్పనిసరిగా శాశ్వతంగా విధులు నిర్వర్తించే విధంగా డాక్టర్‌ను నియమించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం చేతకాని నితతర్వాకం వలన హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించలేదని సీఎంకు వివరించారు. దీంతో హాస్టళ్లన్నీ మరమ్మతులకు గురయ్యాయని, కనీస వసతులు కూడా లేకుండా పోయయాని తెలిపారు. బీసీ వెల్ఫేర్ హాస్టల్ శాశ్వత భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి కనిగిరి అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయింపుకు అంగీకారం వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు.



సీఎం చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

మాజీ సైనికుడి భూమి కబ్జా

బాధితుల ఫిర్యాదు మేరకు భూమిని పరిశీలించిన తహసీల్దార్

కనిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుడు భూమిని కబ్జాకు వైసీపీ నేతలు తెగబడుతున్నారు. పాలన పోయినా వాసన పోలేదన్నట్లుగా పేదల భూములపైనే కాకుండా మాజీ సైనికులు భూములను కూడా కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఇందుకు మంగళవారం జరిగిన సంఘటన అద్దం పడుతుంది. వివరాల్లోకి వెళితే..

1943 నుంచి 1947 వరకు జరిగిన రెండవ ప్రపంచయుద్ధంలో లాన్స్ నాయక్‌గా విధులు నిర్వహించి యుద్ధంలో పాల్గొన్నందుకు భారత ప్రభుత్వం మాజీ సైనికుల కోటా కింద కనిగిరి గ్రామం పరిధిలోని పొదిలి రోడ్డులో 843/ఏ1 సర్వే నెంబరులో 2.5 ఎకరాల భూమిని 2001లో కోండ్రు జాన్‌కు మంజూరు చేసింది. అందుకు భారత ప్రభుత్వం డీ ఫారం డీకే పట్టా, రిజిస్టరుతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయించింది. అప్పటినుంచి ఆ భూమి వారి ఆధీనంలో ఉంది. 2005లో మాజీ సైనికుడు కొండ్రు జాన్ మరణించారు. అయితే, మాజీ సైనికుడు భూమిపై కన్నేసిన వైసీపీ మద్దతుదారులు ఆదివారం రాత్రికి రాత్రి ఆ భూమిలో ఫెన్సింగ్ రాళ్లు తోలించి అక్రమ కట్టడాలకు పూనుకున్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి ఆయా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కట్టడాలు నిర్మిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. మాజీ సైనికుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో సంబంధిత భూమిని తహసీల్దార్ రవిశంకర్ మంగళవారం పరిశీలించారు. అక్రమంగా కట్టడాలను నిర్మిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



న్యాయం చేయాలని కోరుతున్న మాజీ సైనికుడి కుమారుడు కోండ్రు భాస్కర్‌రావు



భూమిని పరిశీలించి ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న తహసీల్దార్

రుణం పేరుతో వృద్ధురాలికి టోకరా

ఒంగోలు క్రైం, మార్చి11(ఆంధ్రజ్యోతి): రుణం పేరుతో వృద్ధురాలికి టోకరా వేసిన ఘటన ఒంగోలు నగరం గొడుగుపాలెంలో జరిగింది. వివరాలలోకి వెళితే.. ఇరువురు వ్యక్తులు వృద్ధురాలు అయినా బత్తిన అంకమ్మ ఇంటికి వెళ్లారు. తాము ఓ పార్టీ తరపున రూ.20 వేలు రుణం ఇస్తున్నామని, మొన్న వస్తే ఇంటిలో లేరు అని చెప్పారు. అందుకు సంబంధించిన రేషన్‌కార్డు, ఆధార్‌జిరాక్స్ కాపీలు ఇవ్వడంతో పాటు పసుపు రంగు చీర కట్టుకొని రూ.10వేలు చేతులలో పట్టుకొని ఫొటో దిగాలని సూచించారు. ఈ ఫొటో పైకి పంపించగానే కొద్ది సేపటికి మీ ఇంటికి ఓ మేడం వచ్చి రూ.20వేలు ఇస్తారని నమ్మించారు. అదే సమయంలో అక్కడ ఉన్న అంకమ్మ సోదరుడిని జిరాక్స్ కాపీలు తెమ్మని పంపించారు. ఈలోపు ఇంట్లో ఉన్న రూ.14వేలు తీసి అంకమ్మ టేబుల్‌పై పెట్టి ఇంటిలోకి వెళ్లింది. దీంతో ఆ నగదును ఇరువురు వ్యక్తులు తీసుకొని పరారీ అయ్యారని మంగళవారం వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

చిట్టీల పేరుతో కానిస్టేబుల్ మోసం.. కేసు

ఒంగోలు క్రైం, మార్చి11(ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో మహిళలను మోసం చేసిన కానిస్టేబుల్‌పై ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రమేష్, ఆయనకు పరిచయస్తురాలైన ఓ మహిళకు ఓ ప్రైవేటు వైద్యశాలలో నర్సులుగా పనిచేస్తున్న ఇరువురు మహిళలకు పరిచయమయ్యారు. రమేష్‌కు తెలిసిన ఆ మహిళ తాను చిట్టీలు వేస్తానని చెప్పి ఇరువురు నర్సుల నుంచి డబ్బులు తీసుకుంది. రెండేళ్ల గడిచినా వారికి రావాల్సిన రూ.6లక్షలు నగదు ఇవ్వలేదు. ఇరువురు బాధితులు కలిసి కానిస్టేబుల్ రమేష్, సదరు మహిళపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు తాలుకా పోలీసులు కానిస్టేబుల్ రమేష్, చిట్టీలు వేసే మహిళను పిలిపించి విచారించగా గత డిసెంబరులోపు నగదు ఇస్తామని చెప్పారు. అయితే ఇప్పటికీ నగదు చెల్లించకపోవడంతో తాలుకా పోలీసులకు ఇరువురు నర్సులు ఫిర్యాదు చేశారు. దీంతో కానిస్టేబుల్ రమేష్, మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

డాక్టర్ కేశవ్‌కు జాతీయ సేవా పురస్కారం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రముఖ గుండె వైద్య నిపుణులు, అమృత్ హార్ట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వి. కేశవ్‌కు 'సేవా భగవాన్ ఉత్తమ జాతీయ పురస్కారం లభించింది. చిలకలూరిపేటకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థ జయజయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈపురస్కారాన్ని అందజేశారు. మంగళవారం ఒంగోలులోని 60 అడుగుల రోడ్‌లో గల అమృత హార్ట్ హాస్పిటల్‌లో సాయి సేవా భగవాన్ పురస్కారాన్ని ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా ఒంగోలులో పేదల డాక్టర్‌గా, డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా వేలాదిమంది ప్రాణాలు కాపాడిన గొప్ప వైద్యుడు అని కొనియాడారు. డాక్టర్ కేశవ్ మాట్లాడుతూ తన సేవల పట్ల నమ్మకంతో, గుర్తించి పురస్కారం అందించిన ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు వైద్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ కేశవ్

కనిగిరిలో జోరుగా కాపీయింగ్

డీఈవోకు ఫిర్యాదు

ఒంగోలు విద్య, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో కనిగిరిలోని పరీక్షా కేంద్రాల్లో జోరుగా కాపీయింగ్ జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరుగుతున్నట్లు డీఈవోకు సైతం ఫిర్యాదులు అందాయి. ఓపెన్ స్కూలు పరీక్షల్లో కాపీయింగ్ సర్వసాధారణమైంది. పాస్‌గ్యారంటీ పేరుతో విద్యార్థుల నుంచి భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేసి తమకు అనుకూలురైన వారిని పరీక్ష నిర్వాహకులుగా నియమించుకోవడం కూడా పరిపాటిగా మారింది. పరీక్షల్లో కాపీయింగ్‌కు కో ఆర్డినేటర్లు, కొందరు దళారులు కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. ఈ విషయమై కాపీయింగ్‌కు కలెక్షన్ల శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం కూడా ప్రచురితమైంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి ప్రతి పరీక్షా కేంద్రానికి అదనంగా ఒక మండల విద్యాధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. మొదట నియమించిన చీఫ్‌లతో పాటు ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్, ప్రతిరోజూ అన్ని పరీక్షా కేంద్రాలు సందర్శించేలా ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసినా ఇంకా కాపీయింగ్ ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయంటే ఓపెన్ స్కూలు పరీక్షల్లో కాపీయింగ్ ఎంతగా వ్యవస్థీకృతమైపోయిందో తెలుస్తోంది.

పబ్లిక్‌హెల్త్ యూనియన్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ సంఘం)ను కొనసాస్తూ వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వీవీ.కృష్ణారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకుని సమస్యల పరిష్కారం కోసం వారితోనే చర్చలు జరపాలని వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అబేయన్స్‌లో పెట్టారన్నారు. తాజాగా ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ, యూనియన్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని కృష్ణారావు తెలిపారు.

బాబోయ్..ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్..!

ఆర్టీసీ అభివృద్ధికి ప్రయాణికులే ఆదాయం.. ఆధారం. అయితే వారికి మెరుగైన సేవలు అందించడంతో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపు తోంది. బస్టాండు ఆవరణంలో అడుగుపెడితే బాదుడే బాదుడుగా మారుతోంది. ఇదంతా అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడం ప్రయాణికులకు మరింత భారంగా ఉంటోంది. జిల్లా కేంద్రం.. ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు స్టాండ్‌గా మారింది. గత కొన్నేళ్లుగా ఇక్కడ సమస్యలను పట్టించుకోకపోడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ప్రయాణికులకు 'నో' పార్కింగ్..
షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ధరల బాదుడు
ఆర్టీసీ రోడ్ ఆక్రమణ.. వాహనం నిలపితే పెనాల్టీ



ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలు

పార్కింగ్ సౌకర్యం కరువు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కనీస సౌకర్యాలు ఉండటం లేదు. ముఖ్యంగా ప్రయాణికుల వాహనాలు పార్కింగ్ చేసుకునే అవకాశం లేకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్ళుగా డిపో మేనేజరు కార్యాలయం సమీపంలో ప్రయాణికుల వాహన పార్కింగ్ చేసుకుంటుండగా, ఆంక్షల పేరుతో ఆర్టీసీ పోలీసులు పెనాల్టీలు విధించడంతో బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగుల వాహనాలు తప్ప, ఇతర వాహనాలు నిలపకూడదని హెచ్చరించడంతోపాటు, వాహనదారుల పట్ల దురుసుగా వ్యవహరించడం మరింత దారుణంగా మారింది. ఇదిలా ఉంచితే ఆవరణంలోనే ఏర్పాటు చేసిన కార్గో కొరియర్ సేవల కోసం వచ్చే వివిధ వ్యాపారులు, ప్రజలకు వాహన గండం ఎదురవుతుంది. నిత్యం వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు, మరోవైపు వాహన పార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అడుగుపెడితే ధరల బాదుడు..

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏ వస్తువు కొనాలన్నా ప్రయాణికులు బెంబెలెత్తిపోతున్నారు. 24గంటలు తెరిచి ఉండే దుకాణంలో ప్రతి వస్తువుపైనా రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే బస్టాండ్ వెలుపల వైపు సాధారణ ధరలకు లభించే వస్తువులు ఇక్కడ కొనుగోలు చేయాలంటే అదనపు బాదుడుతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతుంది. అదేమని ప్రశ్నిస్తే కొనుగోలుదారుడుపై ఎదురుదాడి ఇక్కడ నిత్యకృత్యం అయ్యాయి. వాస్తవానికి బస్టాండ్ ఆవరణంలో అధిక ధరలకు విక్రయించకూడదు. ముఖ్యంగా మార్కెట్‌లో లభించే ధరలను మాత్రమే ఇక్కడ తీసుకోవాలి. కానీ దుకాణదారులు మాత్రం బెదిరింపులతో వ్యాపారాలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు వాహనాలకు పార్కింగ్ లేకపోవడంతో బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు వాహన పార్కింగ్‌లోనూ గంటల కొద్ది డబ్బులు వసూలు చేయడంతో బస్టాండ్ ఆవరణంలో అడుగు పెట్టాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. ఆదాయ వనరుల పెంపు కోసం ఆర్టీసీ ఆస్తులను లీజుకు ఇస్తుండగా, లీజుదారుల మాత్రం ఇష్టారాజ్యంగా దోచేయడంతో ప్రయాణం భారమవుతుందని ప్రజలు వాపోతున్నారు.

ఔట్‌గేట్ రోడ్డు ఆక్రమణ..

బస్టాండ్‌కు ఉత్తరం వైపున ఉన్న ఔట్ గేట్ రోడ్డు ఆక్రమణకు గురవుతోందని ఆర్టీసీ ఉద్యోగులే వెల్లడిస్తున్నారు. ఆ వైపున ఉన్న ఓ పెద్ద హోటల్, లాడ్జికి లీజుకు ఇవ్వగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే రోడ్‌కు బారికేడ్‌లు ఏర్పాటు చేసిన హోటల్ నిర్వాహకులు ఇతర వాహనాలు పెడితే రూ.500 అపరాధ రుసుము బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు కూడా ఆగే పరిస్థితి లేదు. మరోవైపు ఆ వైపు వెళ్ళే బస్సులు రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో ఆర్టీసీ సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఇప్పటికైనా ఆర్టీసీ రోడ్‌ను ఆక్రమణ నుంచి విడిపించి వాహన రాకపోకలకు, పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి : కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు త్వరితగతిన చెల్లించి, నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నుల చెల్లింపునకు ఈనెల 31తో గడువు ముగుస్తుందని, అందువల్ల బకాయిదారులు కార్పొరేషన్ కార్యాలయంలో లేదా సచివాలయాల్లో నగదు చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. నెలాఖరుకు వడ్డీ మినహాయింపు ఉంటుందని కొందరు భావిస్తున్నారని, అలాంటి విధానం ఏమీ లేదని స్పష్టం చేశారు. అలాగే పన్నుల వసూళ్ళకు రెవెన్యూ సిబ్బంది ప్రతి రోజు డ్రైవ్ నిర్వహిస్తున్నారని, అందువల్ల పన్నులు చెల్లిం నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే సెలవు రోజుల్లో, కార్యాలయ పని వేళలలో పన్నులు చెల్లింపుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

అలెగ్జాండర్ ఫ్లెమింగ్‌కు నివాళి


అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెన్సిలిన్ యాంటీబయాటిక్ ఇన్‌జెక్షన్ కనిపెట్టి లక్షలాది మందిప్రాణాలు కాపాడిన నోబెల్ ప్రైజ్ అవార్డు గ్రహిత అలెగ్జాండర్ ఫ్లెమింగ్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాస్త్రంలో యాంటిబయాటిక్ మందుగా పేరుపొందిన పెన్సిలిన్ పేరు చెప్పగానే అలెగ్జాండర్ ఫ్లెమింగ్ గుర్తుకు వస్తారన్నారు. 1945లో వైద్యశాస్త్రానికి నోబెల్ బహుమతి పెన్సిలిన్ కనుగొన్నందుకు ఫ్లెమింగ్‌తో పాటు హోవార్డ్ ఫ్లోరె, ఎర్నస్ట చెయిన్ అనే మరో ఇద్దరు శాస్త్రవేత్తలకు కూడా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగిరథి, డీపీఎంవో వాణిశ్రీ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, పరిపాలనాధికారి గీతాంజలి, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


కలెక్టర్ అన్సారియాను సత్కరించి మెమోంటోను అందజేస్తున్న ఎన్‌జీవో మహిళా విభాగం ప్రతినిధులు

కలెక్టర్‌కు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా మహిళావిభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు తోడ్పాటును అందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియాను అభినందించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మహిళా విభాగం జిల్లా చైర్మన్ కుంచాల కోటేశ్వరమ్మ, కన్వీనర్ సీహెచ్.శిరీష, రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు కలెక్టర్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి మెమోంటో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో ప్రతినిధులు అంజనాదేవి, రత్నరాణి, నారాయణమ్మ, షమ్మి, మల్లిక, కిరణ్మయి, గాలెమ్మ, సునీల కుమారి, స్వర్ణలత, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శరత్‌కుమార్, ఆర్‌సీహెచ్.కృష్ణారెడ్డి, శివకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు


ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్ధతు ధర అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంతిబాబు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా వారు కనపర్తి ప్రాంతంలో మంగళవారం పర్యటించారు. కనపర్తి ఎత్తిపోతల పథకం కింద సాగు చేసిన వరి పంట చేతికి రాగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 20 రోజుల నుంచి పంట నూర్పిళ్ల ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం రైతులను ఆదుకోవాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పాపయ్యచౌదరికి కన్నీటి వీడ్కోలు


అంత్యక్రియల్లో పాల్గొన్న బంధువులు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): ఒంగోలు రూరల్ తొలి సర్పంచ్ చిరుకూరి పాపయ్య చౌదరి అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. ఆదివారం రాత్రి ఒంగోలు నగరం ఎన్జీవోకాలనీలోని తన నివాసంలో కన్నుమూయగా, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మంగళవారం నగర ప్రముఖులు, రాజకీయశ్రేణులు, విద్యాసంస్థల ప్రతినిధులు విచ్చేసి ఆయన భౌతికకాయానికి పుష్పగుచ్ఛాలు అందించి నివాళులు అర్పించారు. ఒంగోలు తొలి సర్పంచ్‌గా ఒంగోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతోపాటు, ఒంగోలు మునిసిపాలిటీగా ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర కీలకమైనదని కొనియాడారు. అనంతరం ఆత్మీయుల మధ్య పాపయ్యచౌదరికి అంతిమ వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేయగా, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వసతుల పరిశీలన

కొండపి, మార్చి11 (ఆంధ్రజ్యోతి): కొండపి బస్టాండ్ ఆవరణలో వసతులను ఆర్టీసీ ఆర్ఎం వెంకటరావు మంగళవారం పరిశీలించారు. టాయిలెట్లు, బస్టాండ్ ఆవరణలోని దుకాణాలు, ఆర్టీసీ కార్గో కొరియర్ పార్సిల్ సెంటర్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా కొరియర్ నిర్వాహకుడు శ్రీనివాసరావుతో ఆర్ఎం మాట్లాడారు. బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రత, ఇతర వసతులపై బస్టాండ్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రతిపాదిత స్థలం పరిశీలన


భూమి వివరాలను ఆర్డీవోకు వివరిస్తున్న డీటీ, సర్వేయర్లు

పీసీపల్లి, మార్చి 11(ఆంధ్ర జ్యోతి): పీసీపల్లి మండలంలో త్వరలో శంకు స్థాపన జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన భూమిని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వెంగళాయపల్లి సమీ పంలోని సర్వేనెంబరు 652లో ఉన్న 475.57 ఎక రాల్లో బయోగ్యాస్ ప్లాం ట్‌ను ఏర్పాటుచేసేందుకు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల పరిశీలించారు. త్వరలో ఆప్రాంతంలో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీవో మంగళవారం రెవెన్యూ అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు. డీటీ ధర్మతేజ, సర్వేయర్లు భూమికి సంబంధించిన మ్యాప్‌లను ఆర్డీవోకు చూపించి వివరించారు. అనాధీనంగా ఉన్న భూమిని ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు త్వరితగతిన ఫైల్స్‌ను సిద్ధం చేసి ఉంచాలని ఆయన ఆదేశించారు.

చంద్రబాబు హయాంలోనే అంగన్‌వాడీల సంక్షేమం

- తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా యూనియన్ అధ్యక్షురాలు అనంతలక్ష్మి


మాట్లాడుతున్న అనంతలక్ష్మి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలుగునాడు అంగన్‌వాడీ డ్వాక్రా యూనియన్ అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో అంగన్‌వాడీల సంక్షేమాన్ని విస్మరించి, కేవలం రూ.1000 పెంచి చేతులు దులుపుకున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ళు అంగన్‌వాడీలను పట్టించుకోని జగన్‌రెడ్డి నేడు కూటమి ప్రభుత్వంపై ధర్నా చేసేందుకు రెచ్చగొట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ అసమర్థ పాలనలో అంగన్‌వాడీలు సమస్యల వలయంలో చిక్కుకుని అవస్థలు పడ్డారని విమర్శించారు. అంగన్‌వాడీలపై కర్కశత్వం చూపిన జగన్ ఇప్పుడు ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. నెల వారీ జీతాలు ఇవ్వకుండా తక్కువ బడ్జెట్ కేటాయించిన జగన్ ప్రభుత్వం ఇప్పుడు నీతులు చెప్పడం మానుకోవాలన్నారు. సమావేశంలో యూనియన్ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షురాలు ఉప్పలపాటి నాగేంద్రం, జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ మోహరీన్‌సా బేగం పాల్గొన్నారు.

నిషేధిత భూముల పరిశీలన పటిష్టంగా చేయాలి

- సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల పునఃపరిశీలన పటిష్టంగా చేపట్టాలని సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. అమరావతి నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నిషేధిత జాబితాలో నుంచి తొలగించి భూములు చట్టబద్ధం గా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదో పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని, ఈ విషయంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను గడువులోపు చేయాలని, రెవెన్యూ సదస్సుల్లో నమోదైన అర్జీలన్నింటిని పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలి

- ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపు


యూనియన్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24,25వ తేదీల్లో జరిగే సమ్మెను విజయవంతం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక భాగ్యనగర్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు రీజినల్ ఆఫీసు ఎదుట బ్యాంకు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కన్వీనర్ రాజీవ్ రతన్‌దేవ్, రాజేష్ కన్నా, సుబ్బారావు, ఉమాశంకర్, షేక్ హసన్, బ్రహ్మయ్య, బ్రహ్మనాయుడు, రామయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వేను పక్కాగా నిర్వహించాలి

- డీపీవో వెంకటనాయుడు



మాట్లాడుతున్న డీపీవో వెంకటనాయుడు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వామిత్ర సర్వేను పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో మంగళవారం ఒంగోలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు స్వామిత్ర సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. రోవర్ల వినియోగంతో పాటు ప్రభుత్వ యాప్‌ల వినియోగంపై దిశా నిర్దేశం చేశారు. సర్వే విషయంలో నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.పద్మ, స్వామిత్ర నోడల్ అధికారి పి.కల్పన, డీఐవోఎస్ ఎన్.శ్రీనివాసరావు, పరిశుద్ధరావు, విలేజ్ సర్వేయర్లు సుశాంత్, రవీంద్రలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి

ఒంగోలు(రూరల్), మార్చి11(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ కోరారు. మంగళవారం ఒంగోలులోని మల్లయ్య లింగభవనంలో వామపక్షాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నేత జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న ఒంగోలులోని సాగర్ సెంటర్ వద్ద నిర సన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాలం సుబ్బారావు, గుంటెనపల్లి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్.మోహన్, ఎంఎస్.సాయి, లలితకు మారి తదితరులు పాల్గొన్నారు

ఆదరణ పథకంపై అవగాహన

సంతనూతలపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆదరణ-3 పథకంపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు అవగా హన కల్పించారు. బీసీ వర్గాల్లోని ఆయా కులాలకు సంబంధించి పరికరాలను లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్ది నేని హరిబాబు, జడ్పీటీసీ డి.రమణమ్మ, టి.శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

- ఎఫ్‌సీఐ జిల్లా మేనేజర్ వరలక్ష్మి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగులుప్పలపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలంలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని జిల్లా సివిల్ సప్లయాస్ మేనేజర్ వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురించిన చివరికి నష్టాలే.. కథనానికి ఆమె స్పందించారు. ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు జరుగుతుందన్నారు. ఈ ఏడాది వ్యవసాయశాఖ అధికారుల నివేదిక ప్రకారం మండల పరిధిలో ఆలస్య ఖరీఫ్, ముందస్తు రబీ సాగు కింద 2వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయుటకు వీసీఅండ్ఎండీ, ఏపీఎస్ఎస్ఎల్ ద్వారా అనుమతి వచ్చిందని, త్వరలోనే ధాన్యం మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామని తెలిపారు.

పృథులగిరీశునికి బ్రహ్మోత్సవ శోభ


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

మర్రిపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజైన మంగళవారం పృథులగిరి లక్ష్మీనరసింహస్వామికి సింహవాహన సేవ నిర్వహించారు. సహస్రనమార్చన, విశేష పూజలు చేశారు. యాగశాలలో నిత్యహోమంతోపాటు బ్రహ్మోత్సవ వేళ నిర్వహించే విశేషహోమాలు ఆలయ అర్చకులు నారాయణం వెంకటరమణాచార్యులు, శ్రీనివాస విఖానసాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహుల ఉత్సవమూర్తులను మేళతాళాలతో దేవాలయ మాడవీదుల్లో ఊరేగించారు.

నీట్ పరీక్షల కోసం కేంద్రాల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో మే 4వతేదీన జరగనున్న నీట్(యూజీ) పరీక్షల కోసం పరీక్షా కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేషు పరిశీలించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మంగళవారం సాయంత్రం నగరంలోని పలు కాలేజీలను సందర్శించారు. ఒంగోలులో గుర్తించిన ఆరు కేంద్రాలను పరిశీలించి అక్కడ వసతులను పరిశీలించారు. రైజ్‌కృష్ణ, రైజ్‌గాంధీ, రైజ్ పాలిటెక్నిక్ కళాశాల, క్విస్, కేంద్రీయ విద్యాలయాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల వివరాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అందజేస్తామని ఆయన చెప్పారు. సింగరాయకొండ సీఐ హరరత్తయ్య, తాలూకా సీఐ అజయ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మనీష్, ఎంఈవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ మెగా టోర్నీ విజేత తిరుపతి

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శర్మా కాలేజి క్రీడా మైదానంలో ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న సౌత్ జోన్ టీ-20 ప్రీమియర్ లీగ్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫైనల్స్‌లో తిరుపతి, చెన్నై జట్లు తలపడగా, మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు 20 ఓవర్లకు 157/7 స్కోరు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ తిరుపతి జట్టు 18.2 పరుగులకు 5 వికెట్లు నష్టపోయి 158 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ సందర్భంగా లీగ్ నిర్వాహకులుట ఇందుర్తి ప్రసాద్ (డుమ్ము), దాసరి పిచ్చయ్యలు మొదటి బహుమతిగా రూ.4లక్షల నగదు, ట్రోఫీ అందజేయగా, రన్నర్‌గా నిలిచిన చెన్నై జట్టు రూ.2 లక్షలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ ప్రతినిధులు ఉదయ్, అశోక్, శ్రీను, పుష్పా తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న తిరుపతి జట్టు

కొనసాగుతున్న ప్రజా చైతన్యయాత్రలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు మంగళవారం కూడా కొనసాగాయి. ఒంగోలు నగరంలోని పలు కాలనీల్లో నాయకులు వై.సిద్ధయ్య పర్యటించి ప్రజలను అడిగి సమస్యలను తెసుకున్నారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, రమాదేవి, బాలకోటయ్య, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, హుస్సేన్, మహేష్, బీవీ.రావు, ఆదిలక్ష్మి, రాజేశ్వరి, బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 1,516 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 67 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలకు 1,516 మంది గైర్హాజరయ్యారు. 23,288 మందికి 21,742 మంది హాజరయ్యారు. అధికారులు 47 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సుబ్బారావు


సుబ్బారావు

మద్దిపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మద్దిపాడుకు చెందిన నట్టే సుబ్బారావు మంగళవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఆదేశాలతో జాతీయ ఓబీసీ సెల్ అధ్యక్షుడు కెప్టెప్ అజయ్‌సింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, సంతనూతలపాడు సమన్వయకర్త పాలపర్తి విజయ్‌రాజు, మద్దిపాడు మండల అధ్యక్షుడు కొణిజేటి గురుబాబు తదితరులు పాల్గొని సుబ్బారావును అభినందించారు.

విద్యా సామగ్రి అందజేత


విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించిన దాతలతో ఉపాధ్యాయులు

మద్దిపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లింగంగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థిని, సాఫ్టేవేర్ ఇంజనీర్ కందుల రోజా పరీక్షలకు సంబంధించిన సామగ్రిని మంగళవారం తండ్రి ఆదినారాయణ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అదేవిధంగా రోజాను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముచ్చు సుబ్బారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

14న ఒంగోలు మండల సమావేశం

ఒంగోలు(రూరల్) మార్చి11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ సర్వ సభ్యసమావేశం ఈనెల 14వ తేదీ ఉదయం 11గంటలకు జరుగుతుందని ఎంపీడీవో రాజశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

పొగాకు కిలో రూ.280

సంతనూతలపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు-1వ పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కిలో రూ.280 ధర పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధి నుంచి 36 బేళ్లను వేలానికి అనుమతించగా మూడు బేళ్లను తిరస్కరించారు. పొగాకు కిలో కనిష్ఠ ధర రూ.270, సరాసరి రూ.277.82 ధర పలికినట్లు వేలంకేంద్రం నిర్వహణాధికారి రవికాంత్ తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

- ఎంపీడీవో రామాంజనేయులు

కొండపి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 13వ తేదీ నుంచి ఐదు రోజులపాటు కొండపిలోని మండల పరిషత్ సమావేశం హాలులో శిక్షణ నిర్వహిస్తారని ఎంపీడీవో బి.రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు యువకులు, విద్యార్థులు 13వ తేదీలోగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన, వ్యాపార ప్రారంభానికి అవసరమైన నైపుణ్యాలు, ప్రభుత్వ మద్దతు పథకాలు, రుణ సదుపాయాలు, విజయవంతమైన వ్యాపార మోడళ్ల అధ్యయనంలపై శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల గ్రామీణ వైద్యుల కమిటీ ఎన్నిక

సంతనూతలపాడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో మండల గ్రామీణ వైద్యుల నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. మండల అధ్యక్షుడుగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.వెంకట్రావు, సెక్రటరీగా ఎం.ప్రసాద్, ట్రెజరర్‌గా ఎం.మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులుగా చైతన్యలను ఎంపిక చేశారు. కమిటీ ఎన్నిక జిల్లా అధ్యక్షుడు బట్టు బాలాజీ, సెక్రటరీ నాగరాజు, గౌరవాధ్యక్షుడు మాలకొండయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఒంగోలు గాయత్రి మల్టీస్పె షాలిటీ ఆసుపత్రి వైద్యుడు ఎన్ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి హాజరై ఇటీవల పి.గుడిపాడులో అగ్నిప్రమాదంలో నష్టపోయిన గ్రామీణ వైద్యుడుకి మెడికల్ కిట్స్‌ను అందజేశారు.

అవీ..ఇవీ

సోలార్ ప్రాజెక్టుకు భూసేకరణ


ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ భాగ్యలక్ష్మి

కొమరోలు, మార్చి11 (ఆంధ్రజ్యోతి) : సోలార్ ప్రాజెక్టును నెలకొల్పేందుకు భూములను ప్రభుత్వ గుర్తించాలని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు మండల స్థాయి అధికారులు స్పందించారు. మండలంలోని రెండు వేరు వేరు రెవెన్యూ గ్రామాల్లో భూములను గుర్తించినట్లు తహసీల్దార్ భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. కొమరోలు మండలంలోని అల్లీనగరం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 523లో .6.75 ఎకరాల భూమిని, రాజుపాలెం ఇలాకాలోని సర్వే నెం. 721లో 4.50 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. వీటిలో సోలార్‌కు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక పంపుతున్నామన్నారు. వీరి వెంట మండల సర్వేయర్ పఠాన్‌సిలార్ ఖాన్, వీఆర్వో రమణ, వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయర్లు షేక్ సుభాను, మందా ప్రవీణ్ పాల్గొన్నారు.

16న వై.పాలెంలో జాబ్‌మేళా

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖ అధ్వర్యంలో ఈనెల 16న స్థానిక బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య మంగళవారం తెలిపారు. జిల్లా ఎప్పీ దమోదర్ అదేశాల మేరకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఎర్రగొండపాలెం సర్కిల్ పరిధిలోని యువతి, యువకులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 10వతరగతి నుంచి పీజీ పూర్తి చేసిన యువత పాల్గొనవచ్చునని అన్నారు. ఉయదం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్‌మేళా ఉంటుందన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు పతకాలు అందజేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం చినగానిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్ని సేవాసంస్థ ప్రతిభ పరీక్ష నిర్వహించింది. కొప్పుల ప్రణతి, నల్ల బోతుల లక్ష్మీ, పి.అవంతిక, నేరెళ్ల అజయ్, పి.తనూజ్, ఎన్.నీలవేణిలు సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో విజేతలుగా నిలిచారు. వారికి చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ బహుమతులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో బహుమతుల దాత పి.శ్రీనివాసులు, హెచ్ఎం శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

గిద్దలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆపార్టీ నాయకులు రాచర్లలో పోస్టర్లను ఆవిష్కరిం చారు. పార్టీ అభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పడుతున్న కష్టాన్ని, చేస్తున్న కృషిని పలువురు పేర్కొన్నారు. జనసేన ఆవిర్భావ సభకు రాచర్ల మండలం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, పుల్లారావు, టి.వెంకటరావు, ఖాదర్‌వలి, చిన్నకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

పెద్దారవీడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన పనులపై బుధవారం ప్రజావేదిక నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఎస్.జాన్‌సుందరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత సమయంలో జరిగిన పనులకు సంబంధించి ఏటా మార్చి 2 నుంచి 11వ తేదీ వరకు సామాజికతనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఆ తనిఖీలలో వెల్లడైన అంశాలపై ప్రజావేదికలలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

శివాపురంలో సీసీ కెమెరాల ఏర్పాటు

• టీడీపీ యువనాయకుడు చేయూత


శ్రీనివాసులరెడ్డిని అభినందిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్

పెద్దారవీడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవ రాజుగట్టు పంచాయతీ శివాపురం గ్రామంలో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలను తగ్గించాలని ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు నడుం బిగించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కోసం కృషి చేస్తున్న పోలీసులకు సహకరించేందుకు టీడీపీ యువనాయకుడు ఆనెకాళ్ల శ్రీనివాసరెడ్డి ముందుకు వచ్చారు. గ్రామంలో సీసీ కెమెరాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. ప్రజా సంక్షేమం కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డిని ఎస్సై అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు మెట్టు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరామిరెడ్డి, తదితరులు అభినందించారు.

పశుపోషకులకు రైల్వే పోలీసులు అవగాహన


అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు

గిద్దలూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు, రైతులకు రైల్వే పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని క్రిష్ణంశెట్టిపల్లె, చుట్టుపక్క గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సబ్ ఇన్స్‌పెక్టర్ కె.పిచ్చిరెడ్డి మాట్లాడుతూ రైలు పట్టాల వెంబడి పశువులను మేతకు తీసుకుని వెళ్ళవద్దని, మూగజీవాలు ప్రమాదానికి గురై చనిపోతుంటాయని, దీని వలన రైతులకు, పశుపోషకులకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. రైలు గాని, గూడ్స్ గాని వెళ్ళేటపుడు మూగజీవాలు వాటి కిందపడి రైలుకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని, దీని వలన భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరూ పశువులను మేతకు రైలు పట్టాల వెంబడి గాని, రైలు వెళ్ళే ప్రాంతానికి దగ్గర గాని తీసుకుని వెళ్ళకుండా దూరంగా పశువులను మేతకు తీసుకుని వెళ్ళాలని కోరారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ శేషయ్య, పశువుల కాపరులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. మొండి గోడలే

• దశాబ్దకాలంగా పూర్తికాని ఉపాధికార్యాలయ భవనం • నేటికీ ఇరుకు గదిలోనే కార్యాలయ నిర్వహణ


వై.పాలెంలో పై ఫ్లోర్‌లో నిలిచిన ఉపాధిహామీ పథకం భవనం

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా.. నియోజవర్గ కేంద్రం వైపాలెంలో ఉపాధి హామీ కార్యాలయం ఇరుకు గదుల్లోనే నిర్వహిం చాల్సి వస్తోంది. స్త్రీశక్తి భవనం పైఅంతస్థులో ఈ ఉపాధిహామీ కార్యాలయాన్ని నిర్వహించాలని ప్రతిపాదించి నిధులు మంజూరు చేస్తామని మాజీ మంత్రి సురేష్ అప్పట్లో హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. నేడు కూటమి ప్రభుత్వమైన దీనిపై దృష్టిసారించి నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది.


ఎంపీడీవో కార్యాలయంలోని ఉపాధి కార్యాలయం గది

2014 -15 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం మహిళకు ఉపయోగకరమైన వెలుగు కార్యాలయం కోసం ఉపాధి హామీ పథకం నిధులు రూ.25 లక్షలు వెచ్చించి స్త్రీశక్తి భవనానికి శ్రీకారం చుట్టింది. రెండు అంతస్థుల్లో నిర్మించాల్సిన ఈ కార్యాలయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో స్త్రీశక్తి భవనం, రెండవ ఫ్లోర్‌లో ఉపాధి హామీ కార్యాలయం నిర్మించాల్సి ఉంది. అయితే నేటికీ భవనం అసంపూర్తిగానే ఉంది. మొదటి ఫ్లోర్‌లో వెలుగు కార్యాలయం నిర్వహిస్తున్నప్పటికీ, రెండవ ఫ్లోర్‌లో ఉపాధిహామీ పథకం కార్యాలయం మాత్రం మొండి గోడలతోనే దర్శనమిస్తోంది. అప్పటి నాయకుల, అధికారుల సమన్వయం లోపంతో స్లాబ్ వేసి అసంపూర్తిగా వదిలేశారు.

నిందులు మంజూరు చేస్తామని ప్రకటించి...

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవన నిర్మాణ పనులు నత్తనడకనే సాగాయి. ఎట్టకేలకు 2024 జనవరిలో అప్పటి మంత్రి ఆదిమూ లపు సురేష్ ఈ భవనాన్ని ప్రారంభించారు. మొదటి ఫ్లోర్‌లో ఉన్న స్త్రీశక్తి భవనం ప్రారంభించి, రెండవ ఫ్లోర్‌లో ఉన్న ఉపాధిహామీ కార్యాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అప్పట్లో ఆయన హామీ అమలుకు నోచుకోలేదు. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైన దృష్టిసారించి ఈ భవనం పూర్తిచేయాల్సిన అవసరం ఉంది.

వివిధశాఖలకు నిధులు ఇస్తున్నా..

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఉపాధిహామీ పథకానికి కీలకమైన భూమిక ఉంది. రోడ్లు కానీ, వివిధ పంచాయతీరాజ్ భవనాలు, గోకులంషెడ్లు పలు వాటర్ ప్రాజెక్టులకు ఉపాధి పథకం ద్వారా మ్యాచింగ్‌గ్రాంట్లు మంజూరవుతుంటాయి. ఆయా శాఖలకు ఈ పథకం నిధులే వెచ్చిస్తారు. అయితే ఆ పథకం కార్యాలయానికే సొంత భవనం లేకపోవడం విశేషం. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయ భవనంలో చిన్న గదిలో సరైన వసతులు లేక ఇరుకు గదుల్లో పనులు చేసుకుంటున్నారు సిబ్బం ది. ఉపాధి హామీపథకం అంటే పదులు సంఖ్యలో సిబ్బంది ఉంటా రు. అలాగే పదులు సంఖ్యలో కూలీలు కార్యాలయానికి వస్తుం టారు. అలాంటి కార్యాయానికి సొంత భవనం లేకపోవడంతో ఇటు కూలీలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి ఉపాధి హామీ పథకం భవనం పూర్తి చేసి అన్ని వసతులు కల్పించాలని ఆ శాఖ సిబ్బంది, ఉపాధి కూలీలు కోరుతున్నారు.

నిర్మమహేశ్వరుని తెప్పోత్సవానికి భారీ ఏర్పాట్లు


తెప్పోత్సవానికి సిద్ధం చేసిన పుష్కరిణి

పొదిలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా పేరొందిన పొదిలి నిర్మమహేశ్వర స్వామి తెప్పోత్సవానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు వ్యర్థాలతో నిరుపయోగంగా ఉన్న పుష్కరిణిని(కోనేరు) ఇటీవల శుభ్రం చేయించి ఆధునీకరించారు. నిర్మమహేశ్వర స్వామి అమ్మవార్లతో తెప్పోత్సవాన్ని తొలి సారిగా నిర్వహించేందు సర్వం సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే పుష్కరిణిలో మోటార్ల ద్వారా నీటిని నింపారు. గత 50 ఏళ్లలో తెప్పోత్సవాన్ని నిర్వహించిన దాఖలు లేవని పట్టణ పెద్దలు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య ఆధ్వర్యంలో తొలిసారిగా అంగరంగ వైభవంగా తెప్పో త్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 13న సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపైన ఆదిదంపతుల ఉత్సవ మూర్తులను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించ నున్నారు. ఉభయదాతలు గునుపూడి భాస్కర్ బ్రదర్స్ వీర్ల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో పుష్కరిణి మహాసంప్రోక్షణ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు జరిగే తెప్పోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు ఒగ్గు వెంకటరామయ్య, దేవాదాయ ఈవో నర్రా నారాయణరెడ్డి కోరారు. .

లక్ష్మినరసింహునికి హనుమంత వాహనసేవ

గిద్దలూరు : మండలంలోని నరవ గ్రామం లో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామి వారు హనుమంత వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమర్థవంతంగా సర్వే నిర్వహించాలి

డీఎల్‌పీవో భాగ్యవతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో భాగ్యవతి

మార్కాపురం రూరల్, మార్చి11 (ఆంధ్ర జ్యోతి). గ్రామాలలో ఇంటిటికి తిరిగి స్వమిత్వ సర్వే సమర్దవంతంగా నిర్వహించాలని సచి వాలయ ఉద్యోగులను డీఎల్‌పీవో వై భాగ్యవతి ఆదేశించారు. స్థానిక ఎస్సీ, బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో మంగళవారం మార్కాపురం డివిజన్ పరిధిలోని 13 మండ లాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శు లకు, సాంకేతిక సహాయకులకు, అసిస్టెంట్ ఇంజనీ ర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గ్రామాలలో సచివాలయ సిబ్బంది గ్రామస్థులు ఇంటి వద్దకు వెళ్లి వారి వద్ద ఉన్న దస్త్రాలను పరిశీలించి సమాచారం సమగ్రంగా సేకరించాలని తెలిపారు. ఇంటి విస్తీర్ణం గ్రామ సర్వేయర్ల సహాయం తో కొలతలు వేయించి సేకరించిన సమాచారాన్ని క్యూజిఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపరచాలని కోరారు. గ్రామాలలో ప్రతి ఇంటి వివరాలను పూర్తిగా తెలుసు కుని సమగ్రంగా పారదర్శంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆక్షేపణలు, అభ్యంతరాలుంటే వాటిని కూడా నమోదు చేసి ప్రభుత్వ స్థలాలు, గ్రామకంఠం భూము లు, ప్రభుత్వ పథకాల ద్వారా నిర్మాణం చేసిన ఇంటి వివరాలను నమోదు చేయాలని కోరారు. సర్వేచేసే సమయంలో ఎవైనా అను మానాలను పై అధికారులను సంప్రదించా లని కోరారు. కార్యక్రమంలో అర్ధవీడు, పుల్లలచెరువు, కంభం, కొమరోలు ఈవోపీ ఆర్‌డీలు కె.వీరరాజు, వై.శ్రీనివాసులు, బి.విజ యలక్ష్మి, డి.బ్రహ్మయ్య, ఎంవోటీ ఎంపీవీ ప్రసన్నకుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో మంటలు

• టేకు, కుంకుడు, నన్నారి చెట్లు దగ్ధం • రూ.6 లక్షలు నష్టం


అగ్నికి ఆహుతైన టేకు చెట్లు

గిద్దలూరు టౌన్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పొదల కొండపల్లి గ్రామంలో రైతుకు చెందిన పంట పొలం అగ్నికి ఆహుతైంది. దీనితో సుమారు 6లక్షల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. గ్రామా నికి చెందిన ముత్యాల పుల్లయ్యకు చెందిన 3 ఎకరాల పొలంలో గత 3 సంవత్సరాల క్రితం నన్నారి, కుంకుడు, టేకు చెట్లు సాగు చేశాడు. ఈ చెట్లకు డ్రిప్ ఇరిగేషన్‌ను అమర్చాడు. సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పొలంలో ఉన్న చెట్లు అన్నీ కాలిపోయాయి. డ్రిప్ పరికరాలు కూడా కాలిపోయాయి. సుమారు 6 లక్షల వరకు నష్టం జరిగిందని రైతు పుల్లయ్య తెలిపాడు. మంటలను అదుపు చేసేందుకు గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఆప్రాంతానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

టిడ్కో ఇళ్లను తక్షణమే పూర్తి చేయాలి

• సీపీఎం నాయకుల డిమాండ్


ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

గిద్దలూరు టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లను ప్రభుత్వం తక్షణమే పూర్తిచేసి లబ్ధి దారులకు అందజేయాలని సీపీఎం నాయకులు ఆవులయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా అధ్యయన యాత్రలో భాగంగా మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని మోడంపల్లెపొరం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆ పార్టీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ, ఏడేళ్ళక్రితం 2018లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను ప్రారంభించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటివైపు కన్నెత్తి కూడ చూడలేదన్నారు. ఈ ఇళ్లను తక్షణమే పూర్తి చేయాలని, పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. 9 నెలలక్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు గృహాలు పొందకుండానే బ్యాంకులోని రుణాలకు వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.నరసింహులు, డి.శ్రీనివాసులు, సివిఎస్‌మూర్తి, శేషగిరి పాల్గొన్నారు.

ఇంటర్ కేంద్రాల తనిఖీ

గిద్దలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు గిద్దలూరులో పకడ్బందీగా నిర్వహించనున్నారు. మంగళవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ పరీక్షలు జరగనున్నాయి. జీవనజ్యోతి, వివేకానంద, సాహితి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మంగళవారం 929 మందికి 108 మంది గైర్హాజరయ్యారు. 821 మంది పరీక్షలు రాశారు. వివేకానంద, జీవనజ్యోతి జూనియర్ కళాశాలల పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సత్యరామిరెడ్డి, భూపతిరెడ్డి తనిఖీ చేసినట్లు పరీక్షల కస్టోడియన్ ఎ.అల్లూరయ్య, ఆయా కేంద్రాల చీఫ్‌లు తెలిపారు.

మీర్జపేటలో పారిశుధ్య పనులు

తర్లుపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జపేటలో పారిశుధ్య పనులపై అధికారులు దృష్టి సారించారు. గ్రామంలో పారిశుద్యం అధ్వానంగా ఉండడంతో ఈ విషయాన్ని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి కాళంగి శ్రీనివాసులు గ్రామంలోని సైడు కాలువల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

అర్హులకు ఆర్‌ఆర్ ప్యాకేజీని అందించాలి


ఎస్‌డీసీతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

మార్కాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల్లోని అర్హులైన అందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీని అందించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ.కృష్ణారావు కోరారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భం గా ప్రస్తుత, వచ్చే బడ్జెట్‌లో ఆర్‌ఆర్ ప్యాకేజీకి ఎంతమేర నిధులు కేటాయిం చారో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పెద్దారవీడు మండలంలోని చింతల ముడిపి, కాటంరాజుతాండా గ్రామాలకు చెందిన ముంపు గ్రామస్థులకు ప్రస్తు తం రూ.35 కోట్లు మంజూరయ్యాయని ఎస్‌డీసీ సత్యనారాయణ తెలిపారు. త్వరలో మరో రూ.80 కోట్లు మంజూరవుతాయన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ ప్రక టించే నాటికే చాలామందికి 18 సంవత్సరాలు నిండినా పరిహారానికి వారిని అర్హులుగా గుర్తించలేదని కృష్ణారావు అన్నారు. అక్కడ సర్వం కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌డీసీ సత్యనారాయణ తెలిపారు.

పెద్దట్యాంకును పరిశీలించిన బీజేపీ బృందం

మార్కాపురం : స్థానిక తర్లుపాడు రోడ్డులోని పెద్దట్యాంకును బీజేపీ బృందం మంగళవారం పరిశీలించింది. ముందుగా అక్కడున్న ఫిల్టరేషన్ ప్లాంట్‌ను సందర్శించి శుభ్రం చేస్తున్న తీరును చూశారు. అంతేకాక దూపాడు నుంచి పైప్‌లైన్ ద్వారా వస్తున్న నీటిని ఏ విధంగా పంపింగ్ చేసి పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తరలిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు, కొరత ఏమైనా ఉందా అని విచారించారు. అనంతరం ప్రజారోగ్యశాఖ కార్యాలనికి వెళ్లి వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు శాసనాల సరోజిని, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మీ, బీజేపీ జిల్లా కార్యదర్శి మొర్రిబోయిన చిన్నయ్య, సతీష్, సుబ్బారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

14న ప్రాంతీయ విద్యాసదస్సు

గిద్దలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపం ఆవరణలో ఈ నెల 14న ఉదయం 10గంటలకు ప్రాంతీయ విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జోనల్ కన్వీనర్ టి.సుబ్బరాయుడు, ప్రాంతీయ విద్యాసదస్సు కోఆర్డినేటర్ ఎ.వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసదస్సుకు ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు చెన్నుపాటి మంజుల, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు షేక్ జిలాని, యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

పంట నమోదులో తప్పులు సరిచేసుకునేందుకు అవకాశం


గిద్దలూరు మండలంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో

కొనకనమిట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగుచేసిన పంటల నమోదులో ఏమైనా తప్పులు దొర్లితే ప్రతి రైతు సరిచేయించుకునే విలుందని ఏవో ప్రసన్నరంగలక్ష్మి అన్నారు. మండలంలోని రేగు మానిపల్లి, వెలిగండ్ల గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు 2024-25 సీజన్‌లో సాగుచేసిన రబీ పంటల నమోదు చేసుకొన్న రైతులు తమ వివరాల జాబితా రైతు సేవాకేంద్రాలలో ఉంటుందన్నారు. జాబితా సరిచూసుకొని తప్పులు ఉంటే సరిచేసే వీలుం దన్నారు. అదేవిధంగా పంటనమోదు చేయించు కొన్న రైతులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయిం చుకోవాలన్నారు. గ్రామాలలోని ప్రతి రైతు విశిష్టసం ఖ్య నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతు సేవాకేంద్రాలలో రైతులు తమపాసుపుస్తకం, ఆధార్ వెంటతెచ్చుకొని విలేజ్‌అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవా లని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు : రైతులు పండించిన పప్పుధాన్యాలను మంచిధర వచ్చేంతవరకు నిల్వ ఉంచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో రాజశ్రీ అన్నారు. మండలంలోని రెడ్డిచెర్ల, సూరవారిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతు లకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో రాజశ్రీ మాట్లాడుతూ పప్పుధాన్యాల నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పంపుగింజలను ఆరబెట్టి, ఆ గింజల్లో వేపగింజల పొడిని చల్లితే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సిద్దయ్య, హసీనా పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని తంబళ్ల పల్లి, పొదలకొండపల్లి గ్రామాలలో వ్యవ సాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలు స్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ఎం. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం నిలువలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్య క్రమంలో సాంకేతిక వ్యవసాయాధికారి మహబూబ్ బాష ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ, వ్యవసాయ, పట్టుపరిశ్రమశాఖ సహాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతులందరూ 11 అంకెలు గల ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నాగెళ్ల ముడుపు, ఉమారెడ్డిపల్లెలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగి పంటలను పరిశీలించారు. రబీలో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామన్నారు. ఎవరైనా అభ్యంత రాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దేవేంద్ర, వెంకట సుబ్బమ్మ, పుణ్యావతి, రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాలలో మండల వ్యసాయాధికారిణి కె.నీరజ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రబీ 2024-25లో ఈ-పంట ముసాయిదా జాబితాను సోషల్ ఆడిట్‌లో ప్రదర్శించారు. ఈ-పంట నమోదులో ఎలాంటి మార్పులు, చేర్పులు

సాగర్ కాలువలను కమ్మేసిన చిల్లచెట్లు

- చివరి భూములకు అందని నీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి మేజరు కాలువ పరిధిలో రామకృష్ణాపురం నుంచి శంకరాపురం వరకు ఉన్న సాగర్ కాలువలో చిల్లచెట్లు పెరిగిపోయాయి. మేజరు పరిధిలో తూర్పుకంభంపాడు మైనర్ కాలువలో దట్టంగా చిల్లచెట్లు పెరిగి కాలువ మూసుకు పోయింది. దీంతో చివరి భూములకు సాగర్ జలాలు అందక ఆ మేజరు, మైనర్ కాలువల పరిధిలో ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


చిల్లచెట్లతో మూసుకుపోయిన మైనర్ కాలువ

మోదేపల్లి మేజరు పరిధిలోని రామకృష్ణాపురం, నాయుడుపాలెం, శంకరాపురం మీదుగా మోదేపల్లి వెళ్ళే మేజరు కాలువ గత కొన్ని సంవత్సరాల నుంచి చెట్లతో మూసుకుపోయి అడవిని తలపిస్తుంది. ఈఏడాది చివరి భూములకు నీరురాక రైతులు సాగు చేసిన పంటలు ఎండు మొఖం పడుతున్న తరుణంలో కాలువలో పూడుకు పోయిన చిల్లచెట్లు పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మేజరు, మైనర్ కాలువల్లో ఉన్న చిల్ల చెట్లను తొలగించి సజావుగా సాగర్ జలాలు సరఫరా అయ్యే విధంగా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దాదాపు మోదేపల్లి మేజరులోనైతే మూడు కిలో మీటర్ల పొడవున ఉన్న మేజరు కాలువలపై దట్టంగా చిల్ల చెట్లు ఉండిపోయాయి. ఇప్పటికైనా ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించి చిల్ల చెట్లు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


చిల్లచెట్లతో మూసుకుపోయిన మోదేపల్లి మేజరు కాలువ

నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించటమే లక్ష్యంగా..

- ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వం
- 'వర్క్‌ఫ్రం హోం'పై వివరాలు సేకరిస్తున్న సచివాలయాల సిబ్బంది

దొనకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోం విధానాన్ని మరింత విస్తరించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు గ్రామాల్లో సచివాలయాల సిబ్బందితో గడపగడపకు సర్వే చేయిస్తుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలుచేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులోభాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి సచివాలయాల సిబ్బందితో అందులోపొందుపర్చిన ప్రశ్నల ఆధారంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలు, అవసరమైన మౌలిక వసతులు లాంటి అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పరుచుకునేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం.

గ్రామాల్లో 18 సంవత్సరాల వయస్సు దాటిన పురుషులు, మహిళల్లో ఎవరి పేరు అయితే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉంటుందో వారిని సర్వే చేస్తు న్నారు. తగిన విద్యార్హత ఉన్నవారు ఐటీ, ఐటీఈఎస్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనుబుల్డ్ సర్వీసెస్) ఇతర అనుబంధ సంస్థల్లో పనిచేయటానికి ఆసక్తిగా ఉన్నారా అనేది కూడా ఈ సర్వే ద్వారా వివరాలు సేకరిస్తు న్నారు. గ్రామాల్లోని నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అ మలుచేసే దిశగా యువతకు జీవనోపాధి కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహి స్తున్నట్లు సమాచారం. అందులోభాగంగానే గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం సర్వేను చేపట్టింది.

నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు, ఎంతవరకు చదువుకున్నారు, ఎటువంటి ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారు, ఇంటికి బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ ఉందా, ఇంట్లో ప్రత్యేక గది ఉందా, ఉంటే కొలతలు ఎంత, తదితర సమాచారాన్ని సర్వే చేస్తున్నారు. గ్రామాల్లో సచివాలయాల సిబ్బంది సర్వేను ముమ్మరంగా చేపడుతున్నారు. దీనివల్ల యువతకు స్వగ్రామంలోనే ఉద్యోగావకాశాలను కల్పించేందుకు అవకాశం ఉంటుందని, ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలు, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకునేందుకే కూటమి ప్రభుత్వం ఈ సర్వే చేపడుతున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే పట్ల గ్రామాల్లోని నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.


దొనకొండలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

బయోగ్యాస్ ప్లాంట్ ప్రతిపాదిత స్థలం పరిశీలన

పీసీపల్లి, మార్చి11(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండలంలో త్వరలో శంకుస్థాపన జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన భూమిని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వెంగళాయపల్లి సమీపంలోని సర్వేనెంబరు 652లో ఉన్న 475.57 ఎకరాల్లో బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసేందుకు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల పరిశీలించారు. త్వరలో ఆప్రాంతంలో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కనిగిరి ఆర్డీవో మంగళవారం రెవెన్యూ అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు. డీటీ ధర్మతేజ, సర్వేయర్లు భూమికి సంబంధించిన మ్యాప్‌లను ఆర్డీవోకు చూపించి వివరించారు. అనాధీనంగా ఉన్న భూమిని ప్రభుత్వానికి అప్పచెప్పేందుకు త్వరితగతిన ఫైల్స్‌ను సిద్ధం చేసి ఉంచాలని ఆయన అదేశించారు.


భూమి వివరాలను ఆర్డీవోకు వివరిస్తున్న డీటీ, సర్వేయర్లు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు

దొనకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, త్రాగటానికి సిట్టింగ్‌లు ఏర్పాటుచేసినా కఠిన చర్యలు తప్పవని దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యం షాపులు, కూల్‌డ్రింక్స్ షాపులు, బడ్డీకొట్లు, రోడ్ల పక్కన అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మద్యం త్రాగటానికి సిట్టింగ్‌లు ఏర్పాటుపై మంగళవారం దొనకొండలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనధికార మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వీటిపై ప్రతిరోజు దాడులు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

గత ఐదు నెలల్లో బెల్ట్‌షాపులపై దాడులు చేసి 64 మందిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. 722 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహణపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. దర్శి సర్కిల్‌లోని ఐదు మండలాల పరిధిలోని 23 మద్యం షాపుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎటువంటి అవకతవకలు లేకుండా వ్యాపార నిర్వాహణ జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ రఘు, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంఈవో-2ను విచారిస్తున్న ఒంగోలు ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు

ఎంఈవో-2పై విచారణ

కురిచేడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల విద్యాశాఖాధికారి-2 సుబ్బారావును మంగళవారం ఒంగోలు ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావు విచారించారు. సుబ్బారావుపై యూటీఎఫ్ మండలశాఖ ఫిర్యాదు చేసింది. ఈమేరకు డిప్యూటీ ఈవో విచారణ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఇద్దరు ఎంఈవోలు, యూటీఎఫ్ మండల, జిల్లా శాఖల బాధ్యుల సమక్షంలో విచారణ సాగింది. గతంలో ఎంఈవోలపై గుర్తు తెలియని వ్యక్తి కరపత్రాలు పంచిపెట్టాడు. ఆరోజు నుంచి ప్రారంభమైన వివాదం ఫిర్యాదుల వరకు వెళ్ళింది. నాడు నేడు అవినీతి, ఉపాధ్యాయులను వేధించడం తదితర అంశాలపై యూటీఎఫ్ శాఖ ఫిర్యాదు చేసింది. విచారణ నివేదికను డీఈవోకు అందజేయనున్నట్టు డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వరరావు తెలిపారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నేతలు

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డి గెలుపును కాంక్షిస్తు తిరుమల కొండకు వచ్చి మొక్కులు చెల్లిస్తామని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరుకున్నమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. అందులోభాగంగా కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తిరుమల వెళ్లి దైవదర్శనం చేసుకొన్నట్టు పేర్కొన్నారు. ఉగ్ర గెలుపు మొక్కును స్వామివారికి చెల్లించుకున్నట్టు చెప్పారు. ఆయనవెంట తెలుగురైతు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మీదేవి, ఏలూరి జయమ్మ, అంకబాబు ఉన్నారు.

కాగా, టీడీపీ ప్రవేశపెట్టిన సభ్యత్వం కార్డులతో కార్యకర్తల కుటుంబానికి భరోసా ఏర్పడుతుందని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాల మేరకు పట్టణంలోని 270బూత్ పరిధిలో టీడీపీ సభ్యత్వాల కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ దరిశి రమేష్, టీడీపీ పట్టణ మైనార్టిసెల్ అధ్యక్షుడు కావేరి రసూల్ పాల్గొన్నారు.

రేషన్‌షాపుపై కేసు నమోదు

దొనకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహనాయునిపాలెంలో గల రేషన్‌షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం దాడి చేశారు. వీఆర్వో వై.రంగయ్య, మధ్యవర్తుల సమక్షంలో రేషన్‌షాపులోని సరుకులను తనిఖీ చేశారు. 302 కేజీల బియ్యం, 13 ప్యాకెట్ల చెక్కర అదనంగా ఉన్నట్లు గుర్తించారు. జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమగ్ర నివేదిక అందజేసి రేషన్‌డీలర్‌పై 6ఏ కేసు నమోదుకు సిఫార్సు చేయటం జరుగుతుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వివరించారు. షాప్‌లోని సరుకులను సీజ్‌చేసి కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ఎండీయూ ఆపరేటర్‌కు సరుకులు అప్పగించినట్లు సమాచారం.

కందుల కొనుగోలు కేంద్రం తనిఖీ

కురిచేడు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2024వ సంవత్సరంలో కంది సాగుచేసి ఈపంట నమోదు చేసుకున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభమైందని తెలిపారు. కంది సాగు చేసిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవటం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధరకు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు, కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలి

ముండ్లమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలను రైతులు తప్పకుండా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం ఈదరలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసినట్లయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు, ఎరువులు వాడటం వల్ల దిగుబడులు తగ్గటమే కాక ఖర్చు అధికమవుతుందన్నారు. ప్రతిరైతు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు తీసుకొని సాగుచేస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ లలితకుమారి

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు

- ఉపాధి సిబ్బందికి ఏపీడీ లలితకుమారి హెచ్చరిక

తాళ్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన లక్ష్యాలను చేరుకోవటంలో అలసత్వం వహిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై(ఎఫ్ఏ) శాఖాపర చర్యలు తీసుకుంటామని డ్వామా ఏపీడీ లలితకుమారి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది ఉపాధి పనులు నిర్వహించటంలో అలసత్వంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో నిత్యం రెండువేల మందికి ఉపాధిపనులు కల్పించాల్సి ఉందన్నారు. అయితే, కేవలం ఆరువందల మంది కూలీలు మాత్రమే పనులకు రావటం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఉపయోగకరంగా ఉండే ఫాం ఫాండ్స్ గురించి వివరించి ఎక్కువ మంది రైతులు ఏర్పాటుచేసుకునేలా చూడాలనారు. కార్యక్రమంలో ఏపీవో బి.మురళి, ఈసీ గురుబాబు, టీఏ కోటేశ్వరరావు, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగుతులు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దారా హనుమంతరావు మంగళవారం తెలిపారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన 18 నుంచి 45ఏళ్ల లోపు వయస్సుగల మహిళలు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజులపాటు శిక్షణ పూర్తయిన తరువాత కుట్టుమిషన్‌లు అందజేస్తారన్నారు. ఈఅవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అసైన్డ్ భూములు పరులపాలు కాకుండా కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. మోత్రావులపాడు రెవిన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 167/3లో 91 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై కన్నువేసిన కొందరు అధికారులను మభ్యపెట్టి కైవసం చేసుకొనేందుకు పావులు కదుపుతున్నాడు. ఈవిషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంతో విలువైన ఆభూమి అన్యక్రాంతం కాకుండా ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థినికి సాయం

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులులేని అనాథ బాలికకు పామూరు మానవత సంస్థ తరుపున దాతల సహకారంతో రూ.10,500 మంగళవారం అందజేశారు. విరువూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈర్ల వెంకటస్వప్న చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. గొళ్లపల్లి గ్రామంలో పెద్దమ్మ దగ్గర సంరక్షణలో ఉంటున్నది. ఆబాలికకు మానవతా దృక్పథంతో రూ.10,500 చెక్కును బాలిక సంరక్షురాలు పెద్దమ్మకు అందజేశారు. కార్యక్రమంలో తోట రమేష్, వి.వెంకటేశ్వరరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, డి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా పామూరు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డిని మంగళవారం పామూరు వనితా క్లబ్ సభ్యులు విశ్వనాధుని శ్రీలక్ష్మి మంగళవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ క్రిష్ణవేణి, కౌసల్య, టి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనం

తాళ్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగు బహుళ ప్రయోజనమని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని శివరాంపురం, మాధవరం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరిగ సాగుతో తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో నికర ఆదాయం పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ ఎం.రాజశేఖర్, సుధీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో మంగళవారం పోలేరమ్మకు పాల పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అమ్మవారికి పాలపొంగళ్లను తయారుచేసి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, ఆపార్టీ మండల అధ్యక్షుడు జి.హుసేన్‌రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, మాజీ సర్పంచ్ జి.సుబ్బరాయుడు, కె.రామిరెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, జీవీ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద కందులను అమ్ముకోవాలి

కనిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కంది రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరనిచ్చి చేయూత అందిస్తుందని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం కందుల గిట్టుబాటు ధరపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కంది కొనుగోలు కేంద్రం వద్ద తమ కంది పంటని అమ్ముకొని ప్రభుత్వం కల్పించే వెసులుబాటును అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రభుత్వం కంది క్వింటా బస్తా ధర రూ.7,550 అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు జ్యోష్నా దేవి, అంజలీబాయి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని బలిజపాలెం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కొందరు సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి వర్క్ ఫ్రం హోం సర్వేలో పాల్గొని పలు సూచనలు చేశారు.


మాట్లాడుతున్న ఈఈ హైమావతి

విద్యుత్‌ను అక్రమంగా వాడితే చర్యలు

తాళ్లూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను అక్రమంగా వాడితే కఠిన చర్యలు తప్పవని ఆశాఖ విజిలెన్స్ ఈఈ హైమావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుగ్రామాల్లో 35 బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో 2950 గృహాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. 29 మంది విద్యుత్‌ను అక్రమంగా వాడుతున్నట్లు గుర్తించినట్టు తెలిపారు. వీరిపై కేసులు నమోదుచేసి రూ.రెండు లక్షల అపరాధ రుసుం విధించినట్టు చెప్పారు. విద్యుత్‌ను అక్రమంగా వినియోగించటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఈలు క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, చెన్నకేశవులు, హరిబాబు, మోహన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిలో మైలురాయి

దర్శి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో మరో ముందడుగు పడిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దొనకొండలో 5500 ఎకరాల్లో సోలార్ ఎనర్జీ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అసెంబ్లీలో ప్రకటించటం ఆనందదాయకమన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు జరిగితే వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని తెలిపారు. వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన మెగా సోలార్ ప్రాజెక్టును దర్శి నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించటం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

యువత పోరును జయప్రదం చేయాలి

దర్శి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న ఒంగోలులో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదొరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ నగదు అందించకపోవటంతో కళాశాలల యజమానులు వారిని బయటకు పంపుతున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు రూ.3 వేలు భృతి చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయటంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత హనుమంతరావు మృతి


హనుమంతరావు(ఫైల్)

ముండ్లమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లి గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు కిలారి హనుమంతరావు(70) గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌లు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు మాజీ జడ్పీటీసీ సభ్యులు కొక్కెర నాగరాజు, మాజీ ఎంపీటీసీ సుంకర రాఘవరెడ్డి, శంకరాపురం సర్పంచ్ కూరపాటి నారాయణస్వామి, రామలక్ష్మయ్య, కిలారి ఆంజనేయులు, సుబ్బారావు, నీటి సంఘం అధ్యక్షుడు ఉన్నం పరిపూర్ణయ్య తదితరులు ఉన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు


ముండ్లమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన బిజ్జం సుబ్బారెడ్డికి తాళ్ళూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఐటీసీలో ఉద్యోగం చేస్తున్న దారం నాగార్జునరెడ్డి సబ్సిడీపై ట్రాక్టర్లు, గొర్రెలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈక్రమంలో రూ.8 లక్షలు తీసుకొని నేటికి ఇవ్వకపోవటంతో బాధితుడు సుబ్బారెడ్డి ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాగార్జునరెడ్డిపై ఛీటింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మూడు నెలల్లోగా సబ్సిడీపై ట్రాక్టర్లు, గొర్లు ఇప్పిస్తానని నాగార్జునరెడ్డి చెప్పాడని బాధితుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పించలేదని తెలిపారు. తాను అప్పులుచేసి నగదు చెల్లించినట్టు చెప్పారు. అలాగే, ముండ్లమూరు తాళ్ళూరు, పొదిలి, కురిచేడు, దర్శి, త్రిపురాంతకం, పత్తిపాడు, అద్దంకి మండలాల్లోనూ వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని రైతుల వద్ద అడ్వాన్స్‌గా నగదు వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దళారుల మాటలు నమ్మొద్దు!

పామూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఏవో కె.రాధ రైతులకు సూచించారు. ప్రభుత్వ మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం, మోపాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా భూఆధార్, పంట నమోదు రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కందులను కళ్లాలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మోపాడు గ్రామ అధ్యక్షుడు ఎం.గిడ్డయ్యయాదవ్, మోపాడు ప్రాజెక్టు నీటి సంఘం సూపర్‌వైస్‌ఛైర్మన్ ఎం.నరసింహారావు, పచ్చవ బాబు, పాల్గొన్నారు.

అలాగే సీఎస్‌పురం మండలంలోని యమడుగుల, సీఎస్‌పురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుపై ఏవో బి.సంపత్‌కుమార్ గ్రామ సభ నిర్వహించారు. మండలంలో మొత్తం 3465 ఎకరాలలో 1340 మంది రైతులు పంట నమోదు చేసుకున్నట్టు చెప్పారు.


కల్లాల్లో కందులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు





పీఎఫ్ కోసం పడిగాపులు

- జూలై నుంచి నిలిచిన చెల్లింపులు
- 600 మంది ఉద్యోగులకు రూ.80 కోట్లు
- జడ్పీలో బిల్లులన్నీ క్లియర్.. సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్



జిల్లా పరిషత్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ సొమ్మును దారిమళ్లించి ఐదేళ్ల ఇబ్బంది పెట్టగా.. కూటమి ప్రభుత్వంలో చెల్లింపులు జరగక వారు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) చెల్లింపు లు నిలిచిపోయాయి. గత ఏడాది జూలై నుంచి చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందిన సుమారు 600 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.80 కోట్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. సంబంధిత బిల్లులన్నీ జిల్లా పరిషత్ నుంచి ఎప్పుడో క్లియర్ చేశారు. ఇక్కడ నుంచి వెళ్లిన బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. నెలల తరబడి పీఎఫ్ చెల్లింపులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో 10 వేల మంది పీఎఫ్ చందాదారులు ఉండగా వారికి సంబంధించి సుమారు రూ.300 కోట్ల పీఎఫ్ మూలధనం ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా 12 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాకు జమ చేస్తారు. ఒక వేళ ఉద్యోగికి ఇన్సూరెన్స్ లేకపోతే జీతంలో 6 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్ము ఉద్యోగి ఆర్థిక భద్రత కొరకు మాత్రమే ఉద్దేశించబడింది. ఉద్యోగి తన పీఎఫ్ ఖాతా లో ఉన్న సొమ్ముపై అవసరమైనప్పుడు రుణం పొందవచ్చు. దీంతో ఉద్యోగులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు వ్యాపారుల వద్ద వడ్డీరేట్లు భరించలేక పీఎఫ్ సొమ్మును వాడుకుంటుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూన్ వరకు పీఎఫ్ బకాయిలు అన్నింటినీ క్లియర్ చేసింది. జూలై తర్వాత వచ్చిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. జిల్లా పరిషత్‌లో ప్రతి నెలా సుమారు 100 మంది ఉద్యోగులు పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేస్తుంటారు. ప్రతి నెలా రూ.6 కోట్లకు తగ్గకుండా పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వం మారిన తర్వాత పాత చెల్లింపులు జరగడంతో చాలా మంది ఉద్యోగులు రుణం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎనిమిది నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

ఈ నెలలో చెల్లింపులు..

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చెందిన పీఎఫ్ బకాయిలు అన్నీ ఈ నెలలో క్లియర్ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం మోక్షం కల్పిస్తుందని అంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఈ నెలలో పీఎఫ్ చేతికి వస్తుందన్న ఆశతో ఉన్నారు.

అవకతవకలపై.. అలసత్వం

- రాయితీ యంత్రాల పంపిణీలో గోల్‌మాల్
- విచారణకు ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఆదేశం
- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఇటీవలే ఆడిట్ పూర్తి.. వివరాలు బహిర్గతంపై గోప్యత
- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు శూన్యం

రైతులకు సాంకేతిక సహకారం అందించి ఆధునిక వ్యవసాయంపై మళ్లించడం.. తద్వారా సాగులో నష్టాలను తగ్గించడం.. లాంటి లక్ష్యాలతో రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పరిక రాలను ప్రభుత్వం అందిస్తుంటోంది. అయితే గత వైసీపీ హయాంలో తొలుత వీటి గురించి పట్టించుకోకుండా చివరి రెండేళ్లలో యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. అయితే రైతుల పేరిట వైసీపీ నేతల అనుచరులకే పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. నాడు వ్యవసాయశాఖ ఈ ఆరోపణలు పట్టించుకోలేదు. అసలు రైతులే కాని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి అడ్డగోలుగా ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అవకతవకలపై విచారణకు ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ శాఖలో స్పందన లేదని రాయితీ యంత్రాల పరికరాల పంపిణీలో జరిగిన అవక తవకల వెలికితీతపై జరుగుతున్న తాత్సారంతో తేటతెల్లమవుతోంది. తూతూ మంత్రంగా జరిపిన ఆడిట్ నివేదిక లను కూడా బహిర్గత పరచకుండా గోప్యత పాటిస్తుం డటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో అనర్హులు లబ్ధి పొంది దర్జాగా అనుభ విస్తున్న వారిపై చర్యలు లేకపోగా వ్యవస్థలు చోద్యం చూడడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

ఈ అంశాలను తేల్చాలి..

- యూనిట్లకు ఎంపిక చేసిన గ్రూపులోని సభ్యులు ఎవరు.
- వారందరూ రైతులేనా.. ఆ ఫలాలు పొందడానికి అర్హులేనా.
- రాయితీ యంత్రాలు కేటాయించిన దగ్గర నుంచి ఎంత మంది రైతులకు అద్దెకిచ్చారు.వాటి ద్వారా వసూలైన అద్దె మొత్తాలెంత.
- యంత్రాలన్నీ రైతు సేవా కేంద్రాల్లోనే ఉంటున్నాయా లేక అమ్ముకున్నారా..
- రైతుల పేరిట తీసుకున్న వాటిలో కొన్ని యంత్రాలను ఏకంగా అమ్మేసుకున్నారు.. వీటిని గుర్తించాలి.

ఇళ్లల్లోనే 200 యూనిట్లు.. 450 అదృశ్యం

ప్రభుత్వ ఆదేశాలతో యంత్ర పరికరాల ఆడిట్‌ను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉండాల్సిన దాదాపు 200 యూనిట్ల యంత్ర పరికరాలు ఇప్పటికీ వైసీపీ నేతల అనుచరుల ఇళ్ల వద్దనే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం. మూడు జిల్లాల పరిధిలో మరో 450 వరకు పరికరాలు అదృశ్యమైనట్లు ఆడిట్‌లోనే వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇళ్ల వద్దకు వెళ్లి పరికరాల పై అధికారులు విచారణ నిర్వహించడంపై అనుమానాలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు రాయితీపై యంత్రాలను ప్రభుత్వాలు అందిస్తుంటాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా జారీ చేసిన యూనిట్లలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. తొలి మూడేళ్ల రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ ఊసెత్తని ప్రభుత్వం చివరి రెండేళ్లలో యూనిట్లు అందించడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఆ పరికరాలు అందుకున్నది రైతులంటే పప్పు లో కాలేసినట్లే. రైతులకు మేలు చేసే పేరిట ఈ రాయితీలను కూడా వైసీపీ నేతాగణం అనుచరులకే దోచి పెట్టిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. ఈ రాయితీ యంత్రాల యూనిట్లలో జరిగిన కిరికిరికి సంబంధించి విచారణకు గతేడాది జూలైలోనే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇప్పటి వరకు దానిపై పురోగతి ఏమిటనే దానికి వ్యవసాయశాఖ నుంచి సమాధానమే లేదు. యంత్రపరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలన్నది గత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లోనే ఉంది. ప్ర భుత్వం మారినా ఆ ఆదేశాలు అమలు కాకపోగా ఇళ్ల దగ్గరకు వెళ్లి అధికారులు ఆడిట్ నిర్వహించడం ఏమిటన్నది తెలియాలి. ఇతర రైతులకు పరికరాలను

(మిగతా 6వ పేజీలో)

నిరుద్యోగులకు తీపికబురు

వయో పరిమితి సడలింపుతో లబ్ధి

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఊరట • డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు రాసేవారికి ఉపయోగం



కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువత

గుంటూరు(విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇప్పటి వరకు ఉన్న వయోపరిమితిని సడలిస్తూ నూతన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షతిరేకం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగులకు, త్వరలో జరిగే గ్రూప్ పరీక్షలు రాసే వారికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పేరుతో ఐదేళ్ల కాలయాపన చేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లారు. ఒక్క సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఏ పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో వేలమంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు యూనిఫామ్ సర్వీస్ రిక్రూట్మెంట్లో రెండేళ్లు, నాన్ యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల్లో 34 నుంచి 42 వరకు వ యోపరిమితిని సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుద్యోగులకు వరమే..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏటా సగటున 25 నుంచి 30 వేల మంది వరకు ఉంటున్నారు. ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తి చేసిన వారు ఐటీ ఉద్యోగాల వైపువెళ్తున్నారు. సాధారణ డిగ్రీతోపాటు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ప్రభుత్వం భర్తీ చేయనున్న మెగాడీఎస్సీ కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేల మంది సన్నద్ధమవుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కొలిక్కి వచ్చింది. గ్రూప్ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. వయోపరిమితి స డలింపు నిరుద్యోగులకు వరమేనని యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

అభివృద్ధికి.. ఇన్‌చార్జి అధికారులు

- గుంటూరు జిల్లాకు కన్నబాబు
- బాపట్లకు కృతికా శుక్ల, పల్నాడుకు కరుణ
- జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా సాయిప్రసాదు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణతో సంక్షేమం వేగవంతం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. గుంటూరు జిల్లాకు సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబుని నియమించింది. బాపట్లకు కృతికాశుక్ల, పల్నాడుకు వీ కరుణని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడుని ఒక జోన్‌లో చేర్చి దానికి ఇన్‌చార్జి అధికారిగా స్పెషల్ సీఎస్ హోదాలో ఉన్న జీ సాయిప్రసాదుని నియమించింది. తొలుత జిల్లా ఇన్‌చార్జి అధికారులు ఆయా జిల్లాలకు వచ్చి కలెక్టర్లతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత జోనల్ ఇన్‌చార్జి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ వల్ల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వేగవంతంగా అందుతాయని అధికారవర్గాలు తెలిపాయి.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా శ్రీనివాసరావు


(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

డీఆర్‌డీఏ విభాగానికి ఇన్‌చార్జి పీడీగా కె. శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఈడీగా పనిచేస్తున్న ఆయనను నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ ఏపీడీగా నియమించిన ప్రభుత్వం, అదే విభాగానికి బాపట్ల జిల్లా పీడీగా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

రూ.లక్ష కోట్లు వచ్చేలా

అమరావతి నిర్మాణం

- గాడితప్పిన రాష్ట్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి
- అమరావతిని విచ్ఛిన్నం చేసిన గత వైసీపీ పాలకులు
- భారతీయుల కోసం ఎదురుచూస్తోన్న ప్రపంచ దేశాలు
- ఎస్ఆర్ఎం వర్సిటీలో సీఎం చంద్రబాబునాయుడు



ఎస్ఆర్ఎంలో సీవి రామన్ భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మంగళగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవల్‌మెంట్ అనే అంశంపై అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సు ముగింపు సభలో సీఎం ప్రసంగించారు. గత ఐదేళ్లపాటు గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నానన్నారు. 2019 తర్వాత కూడా రాజధాని అమరావతి నిర్మాణాన్ని యధారీతిన కొనసాగించి ఉంటే ఈపాటికి ఈప్రాంత రూపురేఖలన్నీ పూర్తిగా మారిపోయి ఉండేవన్నారు. అలా జరగకపోగా జరిగిన అభివృద్ధిని విచ్ఛిన్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని అంతటా సోలార్ ఎనర్జీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో నిజమైన పేదలను గుర్తించి వారికి అన్ని విధాలా చేయూత ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అలాగే, అన్నీ రంగాల్లో కొనసాగుతున్న పని విధానంలో కూడా మార్పులు రావాల్సి ఉందన్నారు. మగవారి కన్నా మహిళలే వివిధ రంగాలలో రాణిస్తున్నారని, జీతాల విషయంలో కూడా వారిదే పైచేయని చెప్పారు. వ్యవసాయ రంగంలో మరిన్ని ఆధునిక సాంకేతికత వినియోగించాలన్నారు.

జనాభాకు అనుగుణంగా సదుపాయాలు..

జనాభా పెరుగుదల ఆధారంగా మౌలిక సదుపాయాలను కల్పించడం కూడా ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. జనాభా పెరుగులకు అనుగుణంగా ఆహారోత్పత్తి, నీటి వసతిని పెంచాలన్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతమైందన్నారు. తెలుగువారు ప్రపంచంలోని అన్నీ దేశాలలో విస్తరించి కీలకరంగాల్లో అగ్రగాములుగా రాణిస్తున్నారన్నారు. జపాన్, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారతీయుల కోసమే ఎదురుచూస్తున్నాయన్నారు.

అంకుర కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం విస్తరణకు భూములతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అంకుర కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని ఎస్ఆర్ఎం యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు ఎస్ఆర్ఎంలో అకడమిక్ క్లస్టర్ (రూ.270కోట్లు), వేదవతి-2(రూ.160 కోట్లు),గంగా హాస్టల్-2(రూ.120 కోట్లు), అంతర్జాతీయ పరిశోధనా పార్కు (రూ.200 కోట్లు) నిర్మాణాలకు చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. అనంతరం సీవీ రామన్ బ్లాక్ (రూ.200 కోట్లు), గంగా హాస్టల్ బ్లాకు నెం.1(రూ.150 కోట్లు) భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రణాళికా శాఖ కార్యదర్శి అనంత్‌శంకర్, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వైస్‌చాన్సలర్ ఆచా ర్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, సదస్సు నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఆచార్య డి.నారాయణరావు, ప్రణాళికా శాఖ ఈడీ టీఆర్ అలపర్తి, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (బుధవారం)

సహరి : 5.01 (గురువారం)

కారం మిల్లులపై విజిలెన్స్

- రూ.17.43 లక్షల కారంపొడి స్వాధీనం
- మిర్చి, పసుపు, ధనియాలు అక్రమ నిల్వల గుర్తింపు



గుంటూరులో కారం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండానే కారం పొడి తయారు చేసి విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్న మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ దాడుల్లో రూ. 17,43,500 విలువ చేసే కారం పొడిని స్వాధీనం చేసుకు న్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గుంటూరులోని చిలకలూరిపేటరోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్ కారం మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లు యజమాని బండారు రవీంద్రకుమార్ ఎటువంటి బిల్లులు, రికార్డులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మిర్చి యార్డు దగ్గరలో ఉన్న మోహన్‌లాల్ మహేంద్రకుమార్ అండ్ కంపెనీ నుంచి బిల్లులు లేకుండా మిర్చి తీసుకువచ్చి కారం పొడి తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. 13,915 కేజీల చిల్లీ పౌడర్, రూ.3,14,250 విలువ చేసే 1815 కేజీల మిరపకాయలు, 75 కేజీల పసుపు, రూ.1,06,854 విలువ చేసే 1320 కేజీల ధనియాలు బిల్లులు లేకుండా కలిగి ఉన్నారని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారం పొడి నమూనాలను సేకరించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు హైదరాబాద్‌లోని లేబరేటరీకి పంపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలు నిర్దేశం

- గుంటూరు జిల్లాకు రూ.64.80 లక్షలుగా నిర్దేశం
- పల్నాడు రూ.29.70 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.7.62 కోట్లు..
- ఏఎంసీల సెక్రెటరీలు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రోజు వారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాని ఆ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత నిర్దేశించారు. మంగళవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజు వారీ వసూళ్లతోనే ఆర్థిక సంవత్సర లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఈ విషయంలో సెక్రెటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు కలిపి రోజువారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని రూ.64.80 లక్షలుగా కమిషనర్ నిర్ణయించారు. ఇందులో గుంటూరు ఏఎంసీకి రూ.44 లక్షలు, తెనాలి రూ.5 లక్షలు, పొన్నూరు రూ.5 లక్షలు, దుగ్గిరాలకు రూ.2.50 లక్షలు, తాడికొండ రూ.2 లక్షలు, మంగళగిరికి రూ.2 లక్షలు, ఫిరంగిపురానికి రూ.2 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.2.30 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించారు. పల్నాడు జిల్లాకు రోజు వారి లక్ష్యం రూ.29.70 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో చిలకలూరిపేటకు రూ.3.60 లక్షలు, సత్తెనపల్లికి రూ.2.30 లక్షలు, పిడుగురాళ్లకు రూ.2 లక్షలు, నరసరావుపేటకు రూ.2.10 లక్షలు, వినుకొండకు రూ.2.70 లక్షలు, క్రోసూరుకు రూ.1.95 లక్షలు, మాచర్లకు రూ.1.20 లక్షలు, రొంపిచర్లకు రూ.1.70 లక్షలు, ఈపూరుకు రూ.1.20 లక్షలు, రాజుపాలేనికి రూ.1.50 లక్షలు, దుర్గికి రూ.1.90 లక్షలు, గురజాలకు రూ.7.55 లక్షలు నిర్దేశించారు. బాపట్లలోని ఏఎంసీలన్నింటికి కలిపి రూ.30.27 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.22.65 కోట్లు వసూళ్ల జరిగాయి. ఈ దృష్ట్యా ఏఎంసీల సెక్రెటరీలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. 50 శాతం కంటే తక్కువగా మార్కెట్ ఫీజు వసూళ్లలో తాడికొండ, సత్తెనపల్లి, మాచర్ల, రొంపిచర్ల ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కెటింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలానే ఈపూరు, పిడుగురాళ్ల, కూచినపూడి, పర్చూరు, క్రోసూరు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, మంగళగిరిలో 50 నుంచి 70 శాతం మార్కెట్ ఫీజుల వసూళ్ల జరిగాయి. ఇక 70 నుంచి 90 శాతం తక్కువగా దుర్గి, అద్దంకి, వినుకొండ, బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, గురజాల, వేమూరు, చీరాల, రేపల్లె, ప్రత్తిపాడు, పొన్నూరు ఏఎంసీలున్నాయి. 90 నుంచి 100 శాతం వసూళ్ల చేసిన వాటిల్లో సంతమాగులూరు, దుగ్గిరాల ఉన్నాయి. 100 శాతం లక్ష్యాన్ని అధిగమించిన ఏఎంసీలు మూడు జిల్లాల్లో ఒక్కటి కూడా లేదని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, రామాంజనేయులు, ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరి చంద్రిక, మంగళగిరి ఏఎంసీ సెక్రెటరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన మార్కెటింగ్ సెక్రెటరీలు, మాట్లాడుతున్న కమిషనర్ విజయ సునీత



రైల్వే డివిజన్ మెంబర్ రాజేష్‌ను సత్కరిస్తున్న టీడీపీ కూటమి నాయకులు

చీరాల రైల్వే స్టేషన్‌లో అన్నిరైళ్లు ఆపాలి

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ విశేషంగా రాకపోకలు సాగిస్తున్న చీరాల రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆగే విధంగా కృషి చేయాలని పలువురు టీడీపీ కూటమి నాయకులు రాజేష్‌ను కోరారు. బాపట్లకు చెందిన పఠాన్ రాజేష్ ఇటీవల గుం టూరు రైల్వే డివిజన్ మెంబర్‌గా ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంగళవారం చీరాల ఎంజీసీ మార్కెట్ సమావేశం హాలులో రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూడూరి శివరామ కృష్ణ ప్రసా ద్, గుమ్మడి ఏసురత్నం, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, రమేష్, చంద్ర మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కట్టెల లోడు ట్రాక్టరును ఢీకొన్న కారు

ముగ్గురు వ్యక్తులకు గాయాలు



ప్రమాదం జరిగిన స్థలంలో రోడ్డుపై పడిపోయిన ట్రాక్టరు డ్రైవర్, చెల్లా చెదురుగా ఉన్న కట్టెలు

మార్టూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కట్టెల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక వస్తున్న కారు ఢీకొన్న ఘనటలో ముగ్గురు వ్యక్తులు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదం మంగళవారం జాతీయరహదారిపై ఒంగోలు వైపు జొన్నతాళి సెంటరు సమీపంలో జరిగింది. దాంతో ట్రాక్టర్ డ్రైవర్ దాసరి వెంకటేష్ రోడ్డుపై పడిపోయాడు. అలాగే కారు డ్రైవర్ బేతంశెట్టి హరికృష్ణ, మరో వ్యక్తి వెంకటేశ్వర్లులకు గాయాలయ్యాయి. ప్రమాద సమాచారాన్ని అందుకున్న హైవే అంబులెన్స్ వారు ఘటనా స్థలానికి వచ్చి గాయపడిన ముగ్గురినీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టరు డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులోని ఇద్దరు వ్యక్తులను 108 లో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారు మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిపోయారు. మండలంలోని వలపర్ల పంచాయతీలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన ట్రాక్టరు డ్రైవర్ కట్టెల లోడుతో మార్టూరు వైపు నుంచి ద్వారకపాడు వెళుతుండగా ఒంగోలుకు చెందిన కారు ముందు వెళుతున్న ట్రాక్టరును ఢీకొట్టింది. కారులోని ఇద్దరూ ఒంగోలుకు చెందిన వారు. ఈ ప్రమాదంలో కట్టెలు చెల్లా చెదురుగా పడిపోయాయి. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

దివ్యాంగులకు ఆర్థిక సహాయం

చినగంజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : గ్రూపుల్లో ఉన్న దివ్యాంగులకు చిరు వ్యాపారాలు చేసుకోవడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని గ్రామ సంఘాలు, మండల సమైక్య ద్వారా అందజేయటానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన దివ్యాంగుల సమైక్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో ఉన్నటువంటి దివ్యాంగులందరికీ రైల్వే పాస్ అందజేస్తామన్నారు. ఆధార్, సదరం సర్టిఫికెట్, పాసుపోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నెంబర్, డాక్టర్ లెటర్‌ను వెలుగు కార్యాలయంలో అందజేయాలన్నారు. చెవిటి మిషన్స్ కావలసిన దివ్యాంగులు కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మీ, మాధవి, అకౌంటెంట్ పద్మావతి, మండల వికలాంగుల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.విశ్రాంతమ్మ, సభ్యులు వేణుబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.

అవకతవకలపై.. అలసత్వం

(5వ పేజీ తరువాయి)

అద్దెకిచ్చిన దాఖలాలే లేవు. ఇలా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయడంలో గోప్యత పాటించడంతో పాటు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంలోనూ వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇష్టారీతిన వైసీపీ తన అనుయాయులకు దోచిపెట్టినా వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ యంత్రాల యూనిట్ల విషయంలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదు. సదరు యూనిట్ల కోసం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పటి ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

రైతులకు వ్యక్తిగతంగా రాయితీ యంత్రాలను 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చింది. గ్రూపులకు యంత్రపరికరాల యూనిట్లు ఇచ్చేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే రాయితీ పరికరాల జాబితా ట్రాక్టర్ లేకపోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దానిని తిరిగి చేర్చారు. ఆ తర్వాత రాయితీ విషయంలో అస్పష్టత, యంత్రాలను అందించే కంపెనీల ఎంపికలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి 15 లక్షల యంత్రాలను అందించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం ప్రభుత్వమే రాయితీ ఇవ్వగా, మిగిలిన పది శాతం ఆయా గ్రూపు సభ్యులే భరించాలి. సదరు యూనిట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచి అవసరమైన రైతులకు నామమాత్రపు అద్దెకు ఇవ్వాలి. ఇందుకు ఎంతమంది రైతులు వాటిని వాడుకున్నారనే అంశంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు కూడా నిర్వహించాలి. వసూలు చేసిన అద్దె విషయంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలన్నది నిబంధన విధించారు. మొత్తమ్మీద ప్రతిదశలోనూ అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం నడిపింది. చివరకు బాపట్ల జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాల పరిధిలో 270 చోట్ల మాత్రమే యూనిట్లను మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో 249కు 205 చోట్ల, పల్నాడు జిల్లాలో 421 కేంద్రాలకు 290 కేంద్రాల్లో రాయితీపై యంత్రపరికరాల యూనిట్లకు పంపిణీ చేసింది. అయితే ఆయా యూనిట్లలో దాదాపు సగం చోట్ల ట్రాక్టర్లు లేకుండానే మమ అనిపించారు. కనీసం వీటి ఎంపిక అయినా పారదర్శకంగా జరిగిందంటే దాదాపు 50 శాతం యూనిట్లు సేద్యంతో ఏ మాత్రం సంబంధం లేని వైసీపీ నేతల అనుచరగణం వద్దనే ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల వద్దే పరికరాలను ఉంచాలనే నిబంధనకు పాతరేసి సొంత ఆస్తిలాగా తమ ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులకు యంత్రాల అవసరమొస్తే వారి ఇళ్ల ముందు పడిగాపులు కాసే పరిస్థితి తీసుకొచ్చారు. రైతులపై కూడా పార్టీ ముద్ర వేసి రాయితీ యంత్రాల ఫలాలకు దూరం చేశారు.

సమస్యలతో సాయికాలనీవాసులు సతమతం

- వసతుల లేక ఇబ్బందులు
- తాగునీరు, రహదారి లేక అవస్థలు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని బుర్లవారి పాలెం పంచాయతీ సాయికాలనీ గ్రామస్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు. కాలనీలో సుమారు 500 కుటుంబాలకు పైగా రోజువారీ కూలీలు, నిరుపేదలు నివాసం ఉంటున్నారు. వీరికి తాగునీరు, రహదారులు వంటి కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కాలనీలో 4 ప్రధాన వీధులు ఉన్నాయి. అధికారులు ఒకచోట ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. యువకులు, పురుషులు మాత్రం వారి వాహనాల ద్వారా ప్లాంట్ వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వృద్ధులు, రోగాలతో బాధప డుతున్న మహిళలు కాలనీ శివారులో ఉన్న ప్లాంట్ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి లేక నానా యాతన పడుతున్నారు. ఇదిలావుండగా కాలనీలో ఉన్న ప్రధాన రహదారి కొంత కాలనీ పరిధిలో మరికొంత కొత్తపేట పరిధిలో ఉంది. ఈక్రమంలో దానిని ఆసరాగా చేసుకున్న రెండు ప్రాంతాల అధికారులు రహదారి మరమ్మతుల విషయంలో పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి ఎక్కువ భాగం గుంతలు పడి దారుణంగా మారింది. ప్రమాదకరంగా కూడా ఉంది. రాత్రయితే ప్రయాణించే వాహన చోదకులు తిప్పలు పడుతున్నారు. పైగా విద్యుత్ దీపాల సౌకర్యం కూడా లేదు. ఈ పరిస్థితిలో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే విద్యార్థినులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. తమగోడు అధికారులు పట్టించుకొని విద్యుత్ దీపాలు, తాగునీరుతో పాటు రహదారి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

రాత్రి వేళల్లో ప్రయాణం భయానకం



రహదారి గుంతల మయంగా ఉంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పైగా రహదారిలో విద్యుత్ సౌకర్యం లేదు. ఈక్రమంలో నిత్యం నిరుత్సాహంగా ఉంటుంది. చిన్నారులు రాత్రి వేళల్లో ప్రయాణమంటే భయపడుతున్నారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

- రామకృష్ణ, స్థానికుడు





అస్తవ్యస్తంగా ప్రధాన రహదారి

← ప్రమాదకరమైన సాయికాలనీ మలుపు

తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం



ఇంట్లో పిల్లలు ఉన్నవారు తాగునీటిని తెచ్చుకుంటున్నారు. నాకు నీరు తెచ్చుకునే శక్తి లేదు. అంత దూరం వెళ్లలేను. నాలాగే ఇక్కడ వృద్ధులు కొందరు మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. స్కూల్ సమీపంలో మరో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుంది.

- పద్మ, స్థానిక వృద్ధురాలు

సమన్వయంతో పనిచేయండి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్, వేదికపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ 70వ వార్షిక తిరునాళ్ల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శింగరకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై మంగళవారం శింగరకొండలో అన్ని శాఖల అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌఖర్యం జరగకుండా స్వామి వార్ల దర్శనం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి చిన్న సంఘటన జరిగినా వెంటనే స్పందించి మిగిలిన శాఖల అధికారులకు సమాచారం అందించాలన్నారు.

డీఎస్పీ మొయిన్ మాట్లాడుతూ విద్యుత్ ప్రభలపై అశ్లీల, అర్ధనగ్న ప్రదర్శనలను అనుమతించేది లేదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కు వగా విద్యుత్ వెలుతురు ఉండే విధంగా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుం డా వాహన చోదకులు పార్కింగ్ స్థలాలలో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు. సమావేశంలో ఆలయ ఈవో తిమ్మానాయుడు, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, సీఐ సుబ్బరాజు, ఈవోఆర్డీ ప్రసాదరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిరునాళ్ల సందర్భంగా రోడ్డు వెంబడి రెండువైపులా ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

శింగరకొండ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

14న ప్రధాన తిరునాళ్ల

అద్దంకి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 70వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధాన తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. బుధవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. అనంతరం జ్యోతి ప్రజల్వన చేసి తిరునాళ్ల ఉత్సవాలను పారంభించనున్నట్లు ఆలయ ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన, 9 గంటలకు జీవ ధ్వజ పూజ, ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు గజవాహన సేవ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. రెండవరోజు గురువారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారికి విశేష అభిషేకం, 108 మంది వేద విద్యార్థులతో వేద పఠనం, స్వస్తి, రాత్రి 7 గంటలకు ఉష్ట్ర వాహన సేవ ఉంటుంది. 14వ తేదీ శుక్రవారం ప్రధాన తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు ఉదయం 10 గంటలకు దేవస్థానం వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులచే మన్యుసూక్త పారాయణ, హోమం, రాత్రి 7 గంటలకు రథోత్సవం ఉంటుంది. స్వామి దివ్య దర్శనము 14 వ తేది ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ శనివారం మధ్యాహ్నం 1 గంట వరకు నిర్విరామంగా జరుగుతుందని ఈవో వివరించారు. శింగరకొండలో సందడి సందడిగా మారింది. దేవాలయంతో పాటు, పరిసర ప్రాంతం మొత్తం విద్యుత్‌దీపాల వెలుగులు ఉండేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అన్ని అన్నదాన సత్రాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 5 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు.

తాబేళ్ల మనుగడకు భంగం కల్గిస్తే చర్యలు



తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదులుతున్న అటవీశాఖాధికారి భీమయ్య

చినగంజాం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల మనుగడకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖాధికారి ఎల్.భీమయ్య హెచ్చరించారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడు చెట్లపాలెం తీర ప్రాంతంలో రాష్ట్ర అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ వారు నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి మంగళవారం ఆయన తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి వదిలారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో మొట్టమొదటి సారిగా 107 తాబేళ్ల పిల్లలను సముద్రం లోనికి వదలినట్లు తెలిపారు. కుంకుడుచెట్లపాలెం సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో 14 తల్లి తాబేళ్ల నుంచి 1400 గుడ్లను సేకరించినట్లు తెలిపారు. వాటిలో 115 గుడ్ల నుంచి 107 పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి వదలినట్లు తెలిపారు. సముద్రపు తాబేళ్ల జాతి అంతరించి పోయే జాబితాలో ఉందని, వాటిని కాపాడే ప్రయత్నం అటవీశాఖ చేస్తుందని తెలిపారు. సముద్ర తాబేళ్ల సమాచారం ఎదైనా తెలిస్తే మా సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రీ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల రక్షణ దళసభ్యులు కారాని శ్రీను, వాయల జాలయ్య, కే.వెంకటేష్, గ్రామస్తులు నగయ్య, గోపిరాజు పాల్గొన్నారు.

జోరుగా బర్లీ పొగాకు కొనుగోళ్లు

సంతృప్తిగానే ధరలు



మేదరమెట్లలో బారులుతీరిన పొగాకు చెక్కులతో ఉన్న వాహనాలు

మేదరమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు బర్లీ పొగాకు పండిస్తున్నారు. ముఖ్యంగా వినుకొండ, గిద్దలూరు, కొరిశపాడు. జే.పంగులూరు, మార్టూరు, దర్శి ప్రాంతాల్లో పండించిన బర్లీ (తెల్ల) పొగాకు మేదరమెట్ల చుట్టుపక్కల ఉన్న కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. కొరిశపాడులో జీపీఐ, మేదరమెట్లలో మద్ది లక్ష్మయ్య, మహలక్ష్మి (పోలిశెట్టి సోమసుందరం) గుండ్లపల్లిలో ఐటీసీ తదితర కంపెనీలు బర్లీ పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. ఈ కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 25 మిలియన్ల పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. గడిచిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం బర్లీ పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో రైతులు ధరలు తగ్గుతాయని మొదట్లో కొంత ఆందోళన చెందారు. గత సంవత్సరం బర్లీ పొగాకు గ్రేడ్ 1 ధర కేజీ 150 రూపాయలకు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం జీపీఐ, ఐటీసీ కంపెనీలు బర్లీ పొగాకు గ్రేడ్ 1 రకాన్ని 155 రూపాయలకు కొనుగోలు చేస్తున్నాయి. తక్కువ రకం (అడుగాకులు) 110 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరాసరిన 147, 148 చెందుతుందని వ్యాపార ప్రతినిధులు తెలిపారు. మేదరమెట్ల, కొరిశపాడు, గుండ్లాపల్లిలోని కొనుగోలు కేంద్రాల వద్ద పొగాకు చెక్కులు ఉన్న ట్రాక్టర్లు, నాలుగు చక్రాల ఆటోలు బారులు తీరుతున్నాయి. రైతులు కూడా ధరల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు ఇబ్బందికరంగా లేవంటున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయని బర్లీ సాగుదార్లు అంటున్నారు.

ఒకప్పుడు పొగాకు వ్యాపారానికి కేంద్రగా బాసిల్లిన మేదరమెట్లకు నేడు పూర్వ వైభవం వచ్చినట్లుగా కొందరు వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 70వ దశకంలో మేదరమెట్లలో పెద్ద పెద్ద పొగాకు కంపెనీలు, పొగాకు కొనుగోళ్ల గ్రేడింగ్‌లు నిర్వహించేవి. 80వ దశకం చివర్లో పొగాకు గూడెంలలో ఎక్కువ భాగం జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులుగా రూపాంతరం చెందాయి. అప్పట్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది మహిళలు పొగాకు కంపెనీలల్లో గ్రేడింగ్‌కు వచ్చేవారంటూ గ్రామస్థులు పాత స్మృతులను నెమరవేసుకుంటున్నారు.

ఇష్టపడి చదవండి

అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు



మేదరమెట్ల హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై మహమ్మద్ రఫీ

మేదరమెట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితే సులభంగా లక్ష్యాలను చేరుకోవచ్చని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం మేదరమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10 తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పుస్తకాలను సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రఫి అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ 10వ తరగతి మార్కులు ఉన్నత విద్యాభ్యాసానికి, భవిష్యత్‌లో ఉద్యోగాలకు సంబంధించి కూడా ఎంతో అవసరం అవుతాయన్నారు. ఇప్పుడు కష్టపడి పట్టుదలతో చదివితే భవిష్యత్‌లో చింతించే అవసరం ఉండదన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా విద్యాభ్యాసం సాగించాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు చదుకోవడానికి అనుకైన వాతావరణం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజయ్య, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద జనరిక్ మెడికల్ షాపుల కోసం రుణాలు మంజూరు చేస్తుందని, బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కులాలకు చెందిన వారు ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఆరకాస్తు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. 23 నుంచి 25 వరకు దరకాస్తుల పరిశీలిన, 26 నుంచి 30 వరకు బ్యాంకర్ల పరిశీలన ఉంటుందన్నారు.

ముమ్మరంగా శనగ నూర్పిళ్లు

- అరకొరగా దిగుబడులు
- తగ్గిన గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతులు

ఇంకొల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో విస్తారంగా సాగు చేసిన శనగ పంట నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఆశించిన మేరకు దిగుబడులు రాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శనగ ధర క్వింటా జేజే 11 రకం రూ.5700 మాత్రమే పలుకుతోంది. రెండు నెలల కిందట రూ.6,500పైన పలకగా శనగ చేతికి వచ్చే సమయానికి ధర తగ్గిపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లరకం శనగ ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు, ఎర్ర శనగ ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. గత ఏడాదిలో పండించిన శనగలు ఇంకా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్నాయని, ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా శనగను కొనాలని రైతులు కోరుతున్నారు.

నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


చిననందిపాడు ప్రధాన రోడ్డులో నేలకొరిగిన కరెంట్ స్తంభాలు


ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న కరెంట్ వైర్లు

- చిననందిపాడులో ప్రధాన రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

చిననందిపాడు (పర్చూరు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం చిననందిపాడులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎన్ని మార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అదిగో ఇదిగో చేస్తాం కాలయాపన చేస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు అంటున్నారు. నేలవాలి స్తంభాలు, జారిపోయిన వైర్ల ద్వారానే కరెంట్ సరఫరా అవుతుండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్తంభాలతో పశువులకు ప్రమాదం పొంచిఉందని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరుస విద్యుత్ ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతున్న క్రమంలో ప్రమాదం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ సీనానాయక్

జీవన జ్యోతి బీమా చెక్కు అందజేత

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఏల్చూరి సునీత అను మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె బల్లికురవ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవన జ్యోతి స్కీంలో చేరి ఉన్నారు. ఈ పథకం ద్వారా మృతురాలికి రూ.లక్షల బీమా నగదు మంజూరైంది. బ్యాంక్ మనేజర్ సీనానాయక్ బీమా చెక్కును సునీత భర్త ప్రసాద్‌కు మంగళవారం అందజేశారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో ఖాతాలు ఉన్న ప్రతి సభ్యుడు ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకంలో చేరాలని కోరారు. ఇది ప్రజలకు ఎంతో ఉపయెగమని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సుహితా గ్రేస్, బిందు మాధవి పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు, ఈబీసీ కులాలకు చెందిన వారికి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, అర్హత ఉన్న వారు ఈ నెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సచివాలయాలలో వివరాలను తెలుసుకొని వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని, కాపులకు, బీసీలలోని పలు కులాలకు ఈ రుణాలు అందిస్తారని ఆమె తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలను అందజేసిన సాఫ్ట్‌వేర్


వల్లాపల్లిలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగి

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : తాను చదివిన పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను అందజేయగం తనకు ఎంతో ఆనందరంగా ఉందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పరుసు సాల్మన్ అన్నారు. మంగళవారం వల్లాపల్లి సీఏయూపీ పాఠశాలలో అదే గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాల్మన్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, అవసరమైన ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ పరుసు సునీల్‌కుమార్, అంగన్ వీడీ కార్యకర్త అనుపమ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఘనత చాటుతున్న చీరాల క్రీడాకారులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు చీరాల ఘనతను ఉన్నతంగా చాటుతున్నారని ప్రముఖ వైద్యుడు డా.రామకృష్ణ, డా. బాబూరావు. డా.రమేష్ అన్నారు. ఈ నెలాఖరులో గోవాలో జరగనున్న జాతీయ స్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన సీనియర్ క్రీడాకారులు తుపాకుల నాగేశ్వరరావు, సుహాసిని, అంకాలు, సుమన్, కిరణ్మయిని ఇండోర్ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌మూర్తి, మోహన్‌రావు, కేదార్నాథ్, సత్యనారాయణ, నాగరాజు, నాగేశ్వరరావు, రాయుడు, దాసు పాల్గొన్నారు.

నిమ్మతోటను పరిశీలించిన జిల్లా అధికారులు


నిమ్మకాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి విజయలక్ష్మి, మేనేజర్ కిరణ్

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని ముప్పవరం పంచాయతీ పరిధిలోని నిమ్మతోటను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఏవీ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నిమ్మతోట సాగు చేసిన మహిళా రైతు ఇంటూరి గోవిందమ్మతో మాట్లాడారు. సాగుకు ఎంత ఖర్చు చేశారు, ఏఏ మందులను వినియోగిస్తున్నారు, నిమ్మతోట సాగుపై ఆసక్తికి గల కారణాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గోవిందమ్మను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ వీ కిరణ్, సంతోషం పాల్గొన్నారు.

భగవద్గీతపై పట్టుసాధించిన యామిని

ఆలయ కమిటీ అధ్వర్యంలో సన్మానం


యామినిని సన్మానిస్తున్న దత్తపీఠం మహిళా ప్రతినిధులు

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా మైసూరు దత్తపీఠం ఆధ్వర్యంలో భగవద్గీతపై ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల్లో ప్రతిభ సాధించిన వారికి గోల్డ్‌మెడల్‌ను అందజేస్తారు. అందులో భాగంగా ఈఏడాది నిర్వహించిన అన్‌లైన్ పోటీలో పర్చూరుకు చెందిన పోలిశెట్టి యామిని సత్తాచాటి గోల్డ్‌మెడల్‌ను కౌవసం చేసుకున్నారు. ఈసందర్భంగా మంగళవారం స్థానిక అష్టలక్ష్మి ఆలయంలో దత్తపీఠం మహిళా ప్రతినిధులు యామినిని ఘనంగా సన్మానించి అభినందించారు.

అవగాహనతోనే అధిక దిగుబడి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వేటపాలెం(చీరాల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో ఆధునికీకరణ పద్ధతులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, తద్వారా అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లరిపాలెం, బచ్చుల వారిపాలెంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, విధివిధానాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డా. టీ ప్రేమరంజితం, మనోజ్ పూరీ గోస్వామి, రైతులు పాల్గొన్నారు.

చీరాల మండలంలో

మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై వ్యవసాయాధికారి సుమతి అవగాహన కల్పించారు. సబ్సిడీపై ఎస్సీ ఎస్టీ, జనరల్ రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఏఏ షీబా, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

బల్లికురవ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఎంఈవో కార్యాలంలో పోషణ్ బీ పడాయిబీపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. సూపర్‌వైజర్ సలోమి కార్యకర్తలకు ఈ శిక్షణ గురించి వివరించారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంపై వారికి పలు సూచనలు చేశారు.

ఏరియా హాస్పిటల్ అభివృద్ధికి కృషి

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య


మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య, పక్కన ఆప్కో చైర్మన్ హేమలత, ఇతర నాయకులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని, ఈక్రమంలోనే ఏరియా హాస్పిటల్లో త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. చీరాల చుట్టు పక్కల నుంచి నిత్యం అధిక సంఖ్యలో ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అయితే అత్యవసర సేవలకు గుంటూరు, ఒంగోలు వెళుతున్న నేపథ్యంలో ఆ సేవలు కూడా సామాన్యులకు చీరాల్లోనే అందాలని మంత్రిని కోరడంతో సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్న క్వశ్చన్ అవర్‌లో తీర ప్రాంత ప్రజల చిరకాల కోరిక రామాపురం ఫిషింగ్ హార్బర్ స్థితిగతులపై ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంట ఆప్కో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, మాజీ సర్పంచ్ జంగిలి రాముడు ఉన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యానేరం

ఈఈ జాన్ థామస్

కారంచేడు(పర్చూరు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని బాపట్ల జిల్లా విద్యుత్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (ఈఈ) జాన్ థామస్ అన్నారు. కారంచేడు మండలంలో మంగళవారం విద్యుత్ తనిఖీలను ఆయన నిర్వహించారు. ఈ తనిఖీల్లో 87 మందిపై కేసులు నమోదు చేసి రూ.3,59,000వేల అపరాధ రుసుము విధించినట్లు ఈఈ తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు, వేటపాలెం, చీరాల డీఈఈలు కారంచేడు ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు గ్రామంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ గోరంట్ల అనిల్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

60 మంది రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల నగదు అందజేత

పంగులూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడి వారి ఆదేశాలు మేరకు మండలంలోని ప్రజల సహకారంతో 60 మందిని రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులుగా నమోదు చేసినట్లు తహసీల్దార్ పోపూరి సింగారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 60 మంది సభ్యులకు సంబంధించి ఒక్కొక్కరి దగ్గర రూ.1100 చొప్పున నగదును మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి ఇమ్మానియేల్‌కు తహసీల్దారు కార్యాలయంలో అందచేసినట్లు సింగారావు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన సభ్యులకు తహసీల్దారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట ముసాయిదా


మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

అద్దంకిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ-పంట ముసాయిదా జాబితాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రబీలో సాగుచేసిన అన్ని పంటల వివరాలను రైతు సేవా కేంద్రాలల్లో ప్రదర్శించామని, రైతులందరూ తప్పకుండా జాబితాలను తనిఖీ చేసుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేయించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ పొందే రైతులు విశిష్ట సంఖ్యను తప్పని సరిగా పొందాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సీత, రైతులు పాల్గొన్నారు.

పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలి

పంగులూరు : రైతులు తమ పొలాలకు భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాత వాటి ఆధారంగా సాగు చేస్తున్న పంటలకు ఎరువులను వినియోగించవచ్చునని వ్యవసాయ అధికారి డీ సుబ్బారెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని రేణంగివరం, కశ్యాపురంలో మొక్కజొన్న, పొగాకు, బీర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ భూసారపరీక్షలు చేయించుకుంటే పంటలకు సోకిన తెగుళ్లు, పురుగులు ఉధృతిని నివారించడానికి సరైన ఎరువులను వినియోగించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కె అధికారి కె శివాని, నాయకులు ధూళిపాళ్ల నారాయణస్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

శనగలు, మొక్కజొన్నకు కొనుగోలు కేంద్రాలు

మార్టూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల కోసం శనగలు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోద్దని సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని రాజుపాలెం, డేగరమూడి గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆయన రైతులతో మాట్లాడుతూ శనగలు, మొక్కజొన్నను అమ్ముకోవలసిన రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రూ.12.69లక్షల వ్యయంతో 75 యంత్ర పరికరాలను కేటాయించామన్నారు. అవసరమైన రైతులు సంప్రదించాలని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి అంజిరెడ్డి, విస్తరణాధికారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బాలల హక్కుల పరిరక్షన కమిషన్ సభ్యురాలు పద్మావతి


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

పర్చూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు శుచి, శుభ్రతతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షన కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. మంగళవారం పర్చూరులోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వసతి గృహంలో చీమలు పట్టిన ఆహార పదార్థాలను ఆమె గుర్తించి ఇలాంటివి మీ పిల్లలకు పెడతారా అని ప్రిన్సిపాల్ శ్రీనునాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడునెలలుగా ఈ వసతిగృహంపై ఫిర్యాదులు అందుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు అనుగుణంగా వసతి గృహం లేదని, చాలీచాలని వసతులతో ఇబ్బంది పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దండిస్తున్నట్లు అందిన ఫిర్యాదుమేరకు సంబంధిత ఉపాధ్యాయులను ప్రశ్నించారు. బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను ఆమె ఆదేశించారు. ఇలాంటి చర్యలు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా ఆమె భోజనం వడ్డించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎంఈవో పి.వెంకట్రామయ్య, సీడీపీవో సుభద్ర, ఏఎస్సై సురేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చీరాలలోని ఓ ప్రైవేటు స్కూల్‌ను కమిషన్ సభ్యురాలు పద్మావతి తనిఖీ చేశారు. హాల్‌టికెట్లు ఇవ్వడంలేదని అందిన ఫిర్యాదుపై ఆమె స్పందిస్తూ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పునరావృతం కావద్దని తెలిపారు. సమస్యలేమైనా ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు.

ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటిపన్ను వసూలును వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన యద్దనపూడి మండలంలోని యద్దనపూడి గ్రామంలో మరమ్మతులకు గురైన చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోఆర్‌డీ కృష్ణతో మాట్లాడారు. వెంటనే చెత్త సంపద కేంద్రానికి మరమ్మతులు చేయాలన్నారు. ఇంఇంటికీ వెళ్లి చెత్తసేకరణ చేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ వలేరు రేణుకమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుతో మాట్లాడారు. మండలంలోని అన్ని గామాలలో ఇంటిపన్ను వసూళ్లపై కృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరితంగా ఇంటి పన్నులు వసూలుచేయాలన్నారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి

వైసీపీ ఇన్‌చార్జి వెంకటేష్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేష్, జైసన్‌బాబు తదితరులు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నేడు బాపట్ల కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న వైఎస్సార్ ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం రామకృష్ణాపురం నియోజకవర్గ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మునిసిపల్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సీజ్

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న స్థావరంపై ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అక్కడున్న ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

నిందితుడికి రెండేళ్ల జైలు

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోను నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి, మరొకరు గాయపడడానికి కారకుడైన నిందితునికి చీరాల ఏఎస్‌జే కోర్టు న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్షను విధించారు. 2018 సంవత్సరంలో నిందితుడు ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ మరో ఆటోను ఢీకొట్టాడు. ఈక్రమంలో ఎదురు ఆటోలో ప్రయాణిస్తున్న వెల్లినేని వెంకట వినోద్ మృతి చెందగా, మరో ప్రయాణికుడు జోగేశ్వరరావు గాయపడ్డారు. ఈమేరకు అప్పటి రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి కేసు నమోదు చేసి అభియోగపత్రం దాఖలు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఒకరి మృతికి కారకుడైన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువడించింది.

పేదల సమస్యలు పరిష్కరించాలి

చీరాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో నిస్సహాయులుగా మగ్గుతున్న నిరుపేదల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎస్.బాబూరావు అన్నారు. స్థానిక సంస్థలపై ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునిసిపల్ పరిధిలోని 31వ వార్డు రోశయ్య కాలనీని వారు సందర్శించారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ జయరాజ్, భగవాన్ దాస్, రాంబాబు, ఏసుపాదం పాల్గొన్నారు.

కుటుంబాలకు పింఛనే ఆదరువు

- వృద్ధులు, వితంతు, దివ్యాంగులకు ఆ నగదే ఆధారం
- మండలంలో 7,512 మందికి లబ్ధి

అల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పింఛన్ నగదు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. సామాన్యంగా వృద్ధులు, వికలాంగులు ఎవరినైనా రూ.100అప్పు అడిగినా వారివైపు నిర్లక్ష్యంగా చూస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికి పింఛన్ ద్వారా ప్రతినెలా రూ.4వేలు ఇస్తూ వారిలో ఆత్మస్థైర్యంను నింపుతుంది. ఒకరిని అడిగే అవసరం లేకుండా తమ ఖర్చులకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇస్తున్నాడంటూ వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మండ లంలో మొత్తం పింఛన్లు 7,512 పింఛన్లు ఉన్నాయి. వీరికి ప్రతినెలా రూ.3,04,47,500కోట్లు పింపిణీ చేస్తున్నారు. ఇంతటి బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు భరోసాను కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు లబ్ధిదారులు.



పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

● కూటమి ప్రభుత్వ హయాంలోనే పెంపు..

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే రూ1000 ఉన్న పింఛను ఒక్కసారిగా రూ2 వేలు పెరిగింది. తిరిగి కూటమి అధికారం చేపట్టిన వెంటనే గేతేడాది ఏప్రిల్ నుంచి ఒక్కసారిగా రూ4వేలు పెంచుతూ పంపిణీ చేపట్టడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

పేదలకు అండగా..



గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే పింఛన్ రూ1000 పెంచారు. మరలా 2019లోనే రూ.2 వేలుకు పెంచారు. మరలా 2024లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.4 వేలు పెంపి పేదలకు అండగా నిలిచింది. ఏవిధంగా చూసినా టీడీపీ హయాంలోనే పింఛన్లు భారీస్థాయిలో పెంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాలకు భరోసాను కల్పించింది.

- అరగల రమణయ్య, సింగపేట, అల్లూరు మండలం

● రూ.4వేలతోనే కుటుంబపోషణ



15 ఏళ్ల క్రితమే భర్త విడిపోయా. అప్పటి నుంచి తల్లితో కలిసి జీవిస్తున్నా. రూ.4వేల పింఛన్‌తోనే తల్లిని పోషిస్తున్నా. ఆదరువు చూపిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- షేక్ ఆబిద, గాంధీ కాలనీ, అల్లూరు

పేదల సమస్యలు తెలుసు



కూటమి ప్రభుత్వంలోని పెద్దలకు పేదల సమస్యలు బాగా తెలుసు. అందుకే పేదలు పడుతున్న కష్టాలను కొంత మేర తీర్చాలనే సదుద్దేశంతో పింఛన్‌ను రూ.4వేలు పెంచారు. ప్రతినెలా ఒకటో తేదీ నిఖచ్చిగా ఇస్తున్నారు.

- షేక్ నజీర్ బాషా, మైనార్టీ నాయకుడు, అల్లూరు

న్యూస్ బాక్స్

ఈవో వైఖరిపై ఉభయకర్తల అసంతృప్తి

బిట్రగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో రాధాకృష్ణతీరుపై ఉభయకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణం, శేష వాహన సేవ ఉభయకర్తలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ ఉభయంలో మరొకరిని చేర్చడంపై ఆవేదన చెందారు. ఉభయకర్తలు పుట్టంరెడ్డి క్రిష్ణారెడ్డి, పుట్టంరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తాము 1960 నుంచి తాము ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నామని, అయితే, తమను అవమానించే విధంగా ఉభయానికి మరొకరి పేర్లను చేర్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారి

కలిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వరి సాగుచేసిన రైతులు రైతుసేవా కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం చినఅన్నలూరు, తెల్లపాడు, గంగిరెడ్డిపాలెం, రైతుసేవాకేంద్రాల్లోని రైతులకు ఈ విషయమై అవగాహన కల్పించారు.వరిసాగుచేసి ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకొని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతు ఖాతాల్లో ధాన్యం సొమ్మును జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌లు ప్రసాద్, రమేష్, మానస, రైతులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన



రక్తగ్రూప్ పరీక్షలను నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ మెడికల్ సిబ్బంది

కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వైద్యాధికారి రమ్య స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, తలసేమియా వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో రక్తలేమి లక్షణాలు కనిపిస్తే ఉపాధ్యాయులు తమకు సమాచారం ఇవ్వాలని వారికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. తలసేమియా, హీమోఫిలియా వ్యాధి ఉన్నవారిని గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. అనంతరం 140మందికి రక్తగ్రూప్ పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తలసేమియా డేకేర్ సెంటర్ కన్వీనర్ హరినారపరెడ్డి, జేవీవీ కార్యదర్శి హరినాథ్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఆరోగ్య కార్యకర్తలు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో పిఠాపురం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిద్దు తదితరులు

కావలి టౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు చలో పిఠాపురంకు తరలిరావాలని జనసేన నియోజకవర్గ నాయకులు సిద్దు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రిడ్జి కూడలిలో సిద్దు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ అభిమాన సంఘ నాయకులతో కలిసి ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవంను తొలిసారి అధికార భాగస్వామ్యంతో పండగ వాతావరణంలో ప్రతిష్టాత్మకంగా వేడుకలు జరుగుతాయన్నారు. ఈ నెల 13న రాత్రి 8-30గంటలకు బ్రిడ్జి సెంటర్‌లో ఉచిత బస్సు, భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిస్వామి, బోగోలు మండల ప్రధాన కార్యదర్శి చంటి, చేవూరు నాయబ్, మనోజ్, హరీష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే పనులకు రాలేం!

- ఆరువారాలుగా అందని ఉపాధి వేతనాలు ● ఆవేదనలో కూలీలు

వలేటివారిపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ పథకం పనులకు వెళ్తున్న కూలీలకు ఆరు వారాల నుంచి వేతనాలు అందడం లేదు. వీటికోసం కూలీలు ఎదురు చూస్తున్నారు. 21గ్రామ పంచాయతీల్లో సుమారు 2,500 మంది కిపైగానే కూలీలు పనులకు వెళ్తున్నారు. ఏరోజు కారోజు పనికి వెళ్తే కానీ పూట గడవని కూలీలకు 6-7వారాల నుంచి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. చిల్లర దుకాణాల్లో అప్పులకు సరుకులు తెచ్చుకొని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇన్ని వారాల నుంచి కూలీ డబ్బులు ఇవ్వకపోతే మాకు పూట గడిచేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే మేము పనుల కు రాలేమని వ్యవసాయ పనులకు వెళ్తామని చెబు తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు పడ్డాయా లేదా అని కూలీలు ప్రతిరోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేత నాలను విడుదల చేయాలని కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం..



ఉపాధి కూలీ డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. ప్రతిరోజూ ఉపాధి కూలీ డబ్బులు కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- సంపతి తిరుపతయ్య, ఉప్పలపాడు

పూట గడవటం లేదు



ఆరువారాల నుంచి ఉపాధి పనులకు వెళ్తున్నా. ఇప్పటి వరకూ పైసా కూడా కూలీ డబ్బులు చెల్లించలేదు. ఇలా అయితే మాకు పూట గడవడం కష్టంగా ఉంది. సరుకుల కోసం చిల్లర దుకాణంలో అప్పులు తెచ్చుకొని పూట గడుపుకుంటున్నాం.

- పమిడి కేశవులు ఉప్పలపాడు



ఉప్పలపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

- దినేష్‌కుమార్, ఏఈ కలిగిరి



కలిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అడిషనల్ లోడ్‌పై 50శాతం, పీఎం సూర్యఘర్ పథకానికి రూ.78వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ కో ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు.

? ప్రభుత్వం విద్యుత్ రాయితీలను అందిస్తుందా.

! గృహ అవసరాల వినియోగదారులకు 1కిలో వాట్ అడిషనల్‌లోడ్‌పై 50శాతం అంటే రూ.1000, పీఎం సూర్యఘర్ పథకానికి 3కిలోవాట్లకు రూ.78 వేల వరకు రాయితీ వస్తుంది.

? సూర్యఘర్ పథకానికి ఎన్ని దరఖాస్తులు అందాయి.

! మండలంలో ఈ పథకానికి 59మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 18 మందికి కనెక్షన్లు ఇచ్చాం.

? ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఈ పథకం అమలు అవుతుందా.

! ఎస్సీ ఎస్టీ కాలనీల్లో లబ్ధిదారులకు సంబంధించిన మొబైల్ నెంబరు, ఆధార్, ఎలక్ట్రిసిటీ బిల్‌కు అనుసంధానం చేయడం, ఇంటిపైకప్పుపై సౌర ఫలకలు బిగించేందుకు వివరాలు సేకరించాం.

? స్మార్ట్ మీటర్లు బిగించడం జరుగుతుందా.

! పట్టణంలో కమర్షియల్ కింద 489కనెక్షన్లలో ఇప్పటివరకు 218 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించడం పూర్తయ్యింది.

? వ్యవసాయానికి ఎన్నిగంటలు సరఫరా చేస్తున్నారు.

! వ్యవసాయానికి 9గంతలు నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. మరమ్మతుల పనులు ఉంటే తప్ప అన్ని వేళలో సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

స్థానికులకు 75శాతం ఉద్యోగాలివ్వాలి

- ఎంఎస్‌ఎంఈలపై మండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పనల అంశంపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మంగళవారం మండలిలో మాట్లాడారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలో కూడా స్థానిక నిరుద్యోగ యువతీయువకులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలనే నిబంధనలను కఠినంగా పారిశ్రామికవేత్తలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నైపుణ్యం పేరుతో బయటి నుంచి తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామాయపట్నం పోర్టు పనులు ఆలస్యమైతే పరిశ్రమల రాక కూడా ఆలస్యం అవటం, కొన్ని పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లటం లాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయని తెలిపారు. ఈ సమస్యతో వెనుకబడిన కందుకూరు ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని మాధవరావు చెప్పారు. ఈ పరిస్థితిరాకుండా రామాయపట్నం పోర్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

స్తంభించిన ట్రాఫిక్



ఉదయగిరి బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి ఓవర్‌బ్రిడ్జిపై మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో జేబీ నర్సింగ్ కళాశాలకు చెందిన బస్సు డీజిల్ ఆయిల్ అయిపోవడంతో వం తెనపై మధ్యలో నిలిచిపోయింది. అరగంట సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పరీక్షలకు, విద్యాలయాలకు వెళ్లే సమయం కావటంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు డ్రైవర్ ఆయిల్ అయిపోవస్తుందని చెపుతున్నా వారి యాజమాన్యం పట్టించుకోక పోవటంతో ఈ సమస్య నెలకొందని సమాచారం. ఆగిపోయిన బస్సుకు మరో డ్రైవర్ వచ్చి ఆయిల్ తెచ్చి ఇచ్చి తిరిగి దానిని అక్కడ నుంచి కదిలించారు. అనంతరం స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసలకు సుమారు అరగంట సమయం పట్టింది. దీంతో పరీక్షలు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

కందుకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించటమే లక్ష్యంగా నిర్వహిస్తున్న అదాలత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ కోరారు. స్థానిక తిరుమల ఫంక్షన్‌హాలులో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 12మంది వినియోగదా రులు తమ సమస్యలను తెలుపగా వాటిలో 9 సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించామన్నారు. మిగిలిన మూడు సమస్యలకు లైన్‌వ ర్క్‌తో అనుబంధమై ఉన్నందున 15రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ మల్లెల నాగేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

హంస వాహనపై శ్రీవారు

కావలి టౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరి మిట్టలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం హోమం, స్నపన ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ వారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ పెద్దలు అన్నవరం సత్యనారాయణ, తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హంస వాహనంపై శ్రీవారి చిద్విలాసం

ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుడ్లు తూకం వేస్తున్న ఆర్‌జేడీ జయలక్ష్మి, పీడీ సుశీలదేవి

వలేటివారిపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు, చుండి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆర్‌జేడీ ఎస్.జయలక్ష్మీ, పీడీ సుశీలదేవి సీడీపీఓ శర్మిష్టతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు చిన సైజు గుడ్లు సరఫరా అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రిజిస్టర్లు, గుడ్లు, బాలామృతం, స్టాక్‌ను పరిశీలించారు. గుడ్లు తూకం వేశారు. చిన్న సైజు గడ్లు సరఫరా అయితే వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత తదితరలు పాల్గొన్నారు.

యూనిక్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలి



మామిడితోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి షేక్ షహీల్

కందుకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇకముందు రైతులకోసం ప్రభుత్వం అమలుచేసే అన్నిరకాల పథకాలు అందాలు (అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్‌ఫుడ్ సబ్సిడీ) తదితర పథకాలు అందాలంటే ప్రతి రైతు విధిగా రైతు విశిష్టసంఖ్య (యూనిక్ నెంబరు)ను పొంది ఉండాలని మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. పొలంపిలుస్తోంది కార్యక్ర మంలో భాగంగా పలుకూరు, మహదేవపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మా ట్లాడారు. యూనిక్ నెంబరు లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతి రైతు గ్రామ సచివాలయంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి నెంబరును నమోదుచేయించు కోవాలని కోరారు. అలాగే అన్ని రైతుసేవాకేంద్రాల్లో ఆయా గ్రామాలలో సాగుచేసిన పంటలు, విస్తీర్ణం వివరాలు పొందుపరిచామని ఆ జాబితాను పరిశీలించి సాగుచేసిన పంటలు నమోదు కాకుంటే సరి చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానసహాయకులు ఐ.బ్రహ్మణి, మహదేవపు రం వ్యవసాయ సహాయకులు షేక్ నశీర్‌బాషా, పశువైద్యసహాకులు కేవీ చైతన్య, నార్నె రోశయ్య, స్వర్ణ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూనిక్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలని డివిజన్ వ్యవసాయ సహాయ సహాయకురాలు పి.అనసూయ తెలిపారు. కళవళ్లలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని శనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పోట్లూరు, చెమిడిదెపాడులో..

గుడ్లూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు, చెమిడిదెపాడు మంగళవా రం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవికుమార్ పాల్గొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులు, మెళకువలు పాటించాలన్నారు. ఇలా చేస్తే అధిక దిగుబడులు పొందుతారని రైతులకు సూచించారు. తెగుళ్లు ప్రారంభదశలోనే ఉన్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు, తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు, శైలజ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

● కలిగిరి(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు ఉంటాయని వింజమూరు ఉద్యాన అధికారి షేక్ షహీల్ తెలిపారు. పోలంపాడులోని మామిడితోటలను ఆయన సందర్శించి తామరపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తోటల్లో గుబురుగా మరియు అడ్డంగా పెరిగిన కొమ్మల్ని కత్తిరించి గాలి వెలుతురు తగిలేలా చూడాలన్నారు. చెట్టు క్రింద లోతుగా దున్ని ప్రతిచెట్టుకు నాలుగుకేజీల వేపపిండి చెట్టు పాదిలో వేసుకోవడంతో పాటు నీలిరంగు జిగురు అట్టలను మొక్కకు ఒకటి చొప్పున లేదా ఎకరాకు 40వరకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కొండలరావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో రవికుమార్

‘పది’ పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ ఆగేనా?

- లింగసముద్రం, పెదపవనిలో కేంద్రం ప్రారంభం నుంచి ఇదే తంతు
- సహకరిస్తున్న చీఫ్‌లు, ఇన్విజిలేటర్లు ● ఆందోళనలో ప్రతిభా విద్యార్థులు

లింగసముద్రం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 2007 నుంచి ప్రభుత్వం 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం ఏర్పాటు చేసిన మొదట్లోనే 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అప్పుడు మొదలైన ఈ మాస్ కాపీయింగ్ గత ఏడాది వరకు నిరాటంకంగా కొనసాగింది. అప్పటి నుండి ఈ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 95శాతం నుండి 100శా తం వరకు ఉంటోంది. అలాగే పెదపవనిలో కూడా ఏడేళ్ల కిందట పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ హైస్కూళ్లలో విద్యార్థులు ఫెయిల్ అయ్యారంటే ప్రతి ఒక్కరికీ ఆశ్చర్యం కలుగుతుంది. పాసైన విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ సీట్లు సాధించి నా వారిలో ఎక్కువశాతం సబ్జెక్టులు అర్థంకాక వెనక్కు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. మాస్ కాపీయింగ్‌కు ప్రధాన కారణం ఆయా కేంద్రాలకు వచ్చే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కొందరు ఇన్విజిలేటర్లు, ఎంఆర్‌సీలోని ఒకరిద్దరు సిబ్బంది కూడా ప్రధాన కారణం. పరీక్షా కేంద్రాల్లో తెలివైన విద్యార్థుల ఆన్సర్ షీట్లు మిగిలిన విద్యార్థులకు ఇప్పించడం, చివరి అరగంటలో ఇన్విజిలేటర్లు రాసుకోమని వదిలేయడంతో ఇలా జరుగుతోం దని ఆరోపణలున్నాయి. అలాగే విద్యార్థుల తలిదండ్రులు కూడా ఒకరకంగా ఈ విధానానికి కారణంగా చెప్పవచ్చు. దీంతో ఎలాగూ పాసవుతామనే ధీమాతో ఎక్కువ శాతం మంది విద్యార్థులు ఇళ్ల వద్ద పెద్దగా చదవడం మానేశారు.

కేంద్రంలోని పాఠశాలలివే..

● లింగసముద్రం పరీక్షా కేంద్రంలో లింగసముద్రం హైస్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రైవేటు స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, తిమ్మారెడ్డిపాలెం, మొగిలిచెర్ల హైస్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తారు. పెదపవని పరీక్షా కేంద్రంలో పెదపవని హైస్కూల్ విద్యార్థులు, స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు, స్థానిక ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కూడా 90శాతం నుంచి 100శాతం ఫలితాలు సాధిస్తుండడం గమనార్హం. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మాస్ కాపీ యింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రతిభ గల విద్యార్థుల తలిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



గ్లకోమా.. చూపు కోల్పోవద్దమ్మా!

కంటి లోపల సున్నితమైన భాగాలకు అవసరమైన ఆక్సిజన్, పోషక పదార్థాలను అందించేందుకు ఆక్సిజన్ హ్యూమర్ అనే ద్రవం కంటి లోపలికి ప్రవిస్తుంది. ఇది తిరిగి కంటి వెలుపల రక్తనాళాల ద్వారా గ్రహించబడుతుంది. అయితే ఈ ప్రసరణలో తలెత్తె సమస్యల వల్ల కంటిలో ఒత్తిడి పెరుగు తుంది. ఈ ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించి తగ్గించకపోతే కంటి నరాలు దెబ్బతిని చూపు తగ్గిపో తుంది. క్రమేణ పూర్తి అంధత్వం ఏర్పడుతుంది. ఇదే గ్లకోమా వ్యాధి.

నెల్లూరు (వైద్యం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్లకోమా.. కళ్లలో నీటికాసుల వ్యాధి. ఇది జిల్లా ప్రజల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇంద్రియాల్లో ప్రధానమైన కళ్లకు సంబంధించి నరాలను దెబ్బ తీ అంధులుగా మారుస్తోంది. జిల్లాలో 2.70 లక్షల మంది గ్లకోమా వ్యాధి గ్రస్తులు ఉన్నట్లు అంచనా. సాధారణంగా 40 ఏళ్ల పైబడ్డ వారికి వచ్చే ఈ వ్యాధి, విపరీతమైన ఒత్తిడి కారణంగా చిన్నారులను కూడా కబళిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ఏటా మార్చి 12వ తేదీని ప్రపంచ గ్లకోమా నివారణ దినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తీర్మానించింది. గ్లకోమా లేని సమాజం కోసం పాటు పడదాం అంటూ పిలుపునిచ్చింది.



వారోత్సవాల్లో గ్లకోమా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు శార్వాణి

100 మందిలో 10 మందికి...

ప్రతీ 100 మందిలో 10 మంది ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అవగాహన లోపంతో వ్యాధి ఎక్కువై కంటిచూపు తగ్గినప్పుడు మాత్రమే వైద్యులను ఆశ్రయిస్తుండడంతో పూర్తిస్థాయిలో వ్యాధిని నయం చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో గ్లకోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోంది. వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

- తరచూ కన్ను ఎర్రబడటం ● చూపు మసకబారడం
- బల్బు చుట్టూ ఇంద్ర ధనస్సు వలే కాంతి వలయాలు కనిపించడం
- చీకటిలో చూపు తగ్గిపోవడం
- తలకు పక్కనున్న వ్యక్తులను, వస్తువులను గమనించలేకపోవడం
- అధిక శాతం వ్యాధిగ్రస్తుల్లో ఎటువంటి లక్షణాలు లేకుండానే కంటి నరాలు తీవ్రస్థాయిలో దెబ్బతినే వరకు చూపు సాధారణంగానే ఉంటుంది.

ఎవరికి రావచ్చు

- పసి పిల్లలు సహా ఏ వయసు వారికైనా రావచ్చు.
- 40 సంవత్సరాలు పైబడిన వారికి వచ్చే అవకాశం ఎక్కువ
- కంటి చూపు వ్యాధులు, కంటి గాయాల వల్ల కూడా రావచ్చు.
- రక్త సంబంధీకుల్లో వ్యాధిగ్రస్తులుంటే మిగిలిన వారికీ వచ్చే అవకాశం.

- జిల్లాలో విస్తరిస్తున్న నీటికాసుల వ్యాధి
- ముదిరేదాకా మేల్కొనని బాధితులు
- ఇప్పటికే 2.70 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
- నిర్లక్ష్యం కారణంగా అంధులవుతున్న ఎంతోమంది
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల పరీక్షలు
- విస్తృత అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నేడు ప్రపంచ గ్లకోమా నివారణ దినం

అందుబాటులో ఆధునిక వైద్యం

ఒకప్పుడు గ్లకోమాను ప్రాథమిక దశలోనే గుర్తించినా నివారించలేని పరిస్థితి. ప్రస్తుతం సెలెక్టివ్ లేజర్ ట్రాబెక్కులో ప్లాస్టీ(ఎస్ఎల్‌టీ), అర్గాన్ లేజర్ ట్రాబెక్కులో ప్లాస్టీ (ఏఎల్‌టీ) వంటి ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధి 70 శాతం ఉంటే 30 శాతం చూపును కాపాడగలుగుతున్నారు. కంటి లోపల నీటి ప్రవాహాన్ని సాధారణ స్థితికి తీసుకు వచ్చే చికిత్సలూ ఉన్నాయి.

విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

గ్లకోమా వ్యాధిపై జిల్లా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాము. ఈ నెల 9 నుంచి 15 వరకు ప్రత్యేక గ్లకోమా వారోత్సవాలు జరుగుతున్నాయి. 40 ఏళ్ల పైబడ్డ వారు తప్పనిసరిగా గ్లకోమా పరీక్ష చేయించుకోవాలి. మధు మేహం, రక్తపోటు ఉన్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారుల్లో ఈ వ్యాధిని గుర్తించేలా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రత్యేక పరీక్షలు చేస్తు న్నాం. అన్ని గ్లకోమా పరీక్షలు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని కంటి విభా గంలో చేస్తున్నాం.

- డాక్టర్ శార్వాణి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రాజెక్టు అధికారి



ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స

గ్లకోమా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉంది. ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే చాలా మంది గ్లకోమా గురించి అవగాహన లేక పరీక్షలు చేయించుకోవటం లేదు. దీంతో కంటి నరాలు పూర్తిగా దెబ్బతిని కంటి చూపుకోల్పోయే అవకాశం ఉంది. కుటుంబంలో ఏవరైనా గ్లకోమా వ్యాధికి గురయితే కుటుంబ సభ్యులకు కూడా ఆ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. ఇలాంటి వారు తప్ప నిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ శిరీష, జీజీహెచ్ కంటి వైద్య నిపుణురాలు

ఇంటర్ పరీక్షలకు 28,323 మంది హాజరు

నెల్లూరు (విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 28,323 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 27,927 మందికి 27,100 మంది హాజరుకాగా 817 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1387 మందికి 164 మంది గైర్హాజరు కాగా 1223 మంది హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు 5 కేంద్రాలను పరిశీలించగా, డీవీఈవో 2, డీఈసీ 5, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 30 కేంద్రాలను పరిశీలించాయి.

విద్యార్థులతో వెట్టిచాకిరీపై గండిపాళెం గురుకులంలో విచారణ

ఉదయగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో మంగళవారం ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, తుమ్మలపెంట గురుకుల పాఠశాల ఉపాధ్యాయిని మాధవిలత విచారణ చేపట్టారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థులతో చపాతీలు చేయించిన విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు ఈ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు వంట మనుషులు, విద్యార్థులను విచారించారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అయితే ఈ విచారణ అంతా రహస్యంగా నిర్వహించారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (జడ్పీ), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019-24 సంవత్సరా ల మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంజూరైన గృహాల నిర్మాణం అసంపూర్తిగా ఉంటే పనుల కొనసాగింపునకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందజేస్తుందని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన జీవోను గృహనిర్మాణ శాఖ చీఫ్ సెక్రటరీ జారీ చేశార న్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు సాయం అందుతుందని వివరించారు. జిల్లాలో 75,344 మది లబ్ధిదారులు ఉన్నారని, వారికి రూ.1199.85కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నియోజ కవర్గాల వారీగా ఆత్మకూరులో 8467 మంది, కందుకూరులో 6159, కావలి లో 10779, కోవూరులో 8696, నెల్లూరు సిటీలో 6690, రూరల్‌లో 8400, సర్వేపల్లిలో 19267, ఉదయగిరిలో 6886 మంది లబ్ధిదారులకు అదనపు సాయం లభిస్తుందని, దీనిని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెట్టండి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వసూళ్లను మరింత వేగవంతం చేయాలని అధికారులను విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అధికారులంతా రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెట్టి వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నప్పటికీ ఇంకా బకాయిలు ఉంటున్నాయని, వెంటనే వాటిని వసూలు చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. గృహ వినియోగదారులు అదనపు లోడ్ ఉంటే 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చని, జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ అధికారి పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీఏ ఏపీడీగా శ్రీనివాసరావు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమిస్తూ సెర్ప్ సీఈవో వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను బాపట్లకు డీఆర్డీఏ ఇన్‌చార్జి ఏపీడీగా కూడా నియమించారు. శ్రీనివాసరావు ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ కార్పొరేషన్ ఈడీగా విజయవాడ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

కావలి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పొలం విషయమై తలెత్తిన వివాదంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కావలి మండలం తాళ్లపాళెం లో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... తాళ్లపాళెంకు చెందిన ప్రసాద్‌రెడ్డి తన బావ చలంచర్ల విజయ్‌కుమార్ రెడ్డికి చెందిన 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. అదే పొలం విషయమై గత 15 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుచ్చలపల్లి సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, విజయ్‌కుమార్ రెడ్డికి మధ్య వివాదం జరుగుతోంది. ఇరువర్గాలు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించి ఉన్నారు. ఈ క్రమంలో కౌలు రైతు ప్రసాద్ రెడ్డి యంత్రం ద్వారా వరి పైరు కోయిస్తుండగా సుధీర్ రెడ్డి కుమారుడు అభిషేక్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అడ్డుకుని వివాదానికి దిగారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రసాద్ రెడ్డి పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న సహచర రైతులు, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో ఆయన్ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు కావలి రూరల్ పోలీసులు తెలిపారు.

వందరోజులు దాటితే.. కూలీలకు బెంగ

జిల్లాలో ఖాళీగా 5,463 కుటుంబాలు

150 రోజులకు పెంపు హామీ ఏమైంది...

ఉపాధి పనిదినాల పెంపేదీ ?



ఉదయగిరిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలస ల నివారణతోపాటు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని మెట్టప్రాంతాలైన ఉదయగిరి, కలిగిరి, సీతా రామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, పొదలకూరు, కొండాపురం తదితర మండలాల్లో అధికశాతం కూలీలకు ఈ పనులే జీవనాధారం. ఇదంతా బాగానే ఉన్నా, అమలులో సాంకేతిక కారణాలు కొన్ని కుటుంబాలకు ఉపాధిని దూరం చేస్తున్నాయి. ఎందరి పేర్లున్నా కార్డుకు వందరోజులే పని కల్పిస్తుండటం అందుకు కారణం. ఒక కార్డులో నాలుగైదు పేర్లున్నా అందరికీ కలిసి వంద రోజులే పని కల్పిస్తుండటం, వంద రోజులు త్వరితగతిన పూర్తవుతుండడంతో వారంతా పని లేక ఖాళీగా ఉండాల్సి వస్తుంది. వీరంతా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఉపాధి హామీ పనులకు అర్హులు కారు. పనిదినాలను కనీసం 150 రోజులకు పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నా అమలుకు నోచుకోలేదు.

● 5,463 కుటుంబాలు పనికి దూరం

జిల్లాలో 3.46 లక్షల జాబ్ కార్డులు ఉండగా 5.81 లక్షల మంది కూలీలు ఉన్నారు.2.18లక్షల కుటుంబాల కుగాను 5,463 కుటుంబాలు వంద రోజులు పని పూర్తి చేసుకున్నాయి. వారంతా ఇప్పుడు పనికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముగిసినందున గ్రామాల్లోని కూలీలు ఉపాధి పనుల వైపు చూస్తు న్నారు. ఏటా వేసవిలో అమలు చేసే 20 నుంచి 30 శాతం భత్యం ఇవ్వడం ద్వారా కూలీలకు అదనపు వేతనం అందేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండుటెండలో వేసవిభత్యం అందించాలని, నీడ, నీటి సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలీలకు పని దినాలు పెంచడంతోపాటు పనుల వద్ద వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

17న మహా ధర్నా

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిం చాలని కోరుతూ ఏపీ పంచాయతీ ఎంప్లా యిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వ హించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావు, కేసీ పెంచలయ్య మంగళవారం ఓ ప్రకట నలో పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించా లని 30 ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. ప్రభుత్వం పట్టిం చుకోకపోవడంతో మహాధర్నాకు పిలు పునిచ్చామని తెలి పారు. ధర్నాలో పంచాయతీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు.

15న జనార్దనస్వామి మండలాభిషేకం

దుత్తలూరు (ఉదయగిరి), ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో గల శ్రీజనార్దనస్వామి మండలాభిషేకం ఈనెల 15న నిర్వహించను న్నట్లు ఆలయ చైర్మన్ మాదాల ఎస్.బాబురావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవకల ఆరాధన, అభిషేకం, స్వామి, అమ్మవార్ల మూల మంత్ర వేదహవన హోమం, పూర్ణాహుతి నివేదిన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సోమశిలలో 56.230 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 56.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

బీఈడీ పరీక్షలకు 86 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 86 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1212 మంది విద్యార్థులకు గాను 1126 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 70 మంది విద్యార్థులకు 57 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజర య్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7404 మంది విద్యార్థులకు 6972 మంది హాజరు కాగా 432 మంది గైర్హాజరయ్యారు. కాగా మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో సూళ్లూరుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ డీబార్ అయినట్లు తెలిపారు.

ఇక 3 రోజులే గడువు..

సర్వే పూర్తయ్యింది 83 శాతం

- మిగిలిన లక్ష్యం పూర్తికి కసరత్తు
- 15తో ముగియనున్న ఎంఎస్‌ఎంఈల సర్వే
- సర్వే, సపోర్టు యాప్‌లోకి సమాచారం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్)ల సర్వే శరవేగంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం సర్వే అండ్ సపోర్ట్ అనే యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించి, దాని ద్వారా సర్వే చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ సర్వే ద్వారా ఎంఎస్ఎంఈల సమాచారాన్ని ఒకే పోర్టల్‌లోకి నిక్షిప్తం చేస్తున్నారు. గతేడాది నవంబరు 29 నుంచి ప్రారంభమైన ఈ సర్వే మార్చి 15కి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు పెట్టింది. ఇప్పటివరకు 83 శాతం సర్వే పూర్తవగా, గడువు నాటికి మిగిలిన 17 శాతం సర్వే పూర్తి చేయనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులంతా ఈ సర్వేలో పాల్గొంటున్నారు. కలెక్టర్ ఆనంద్‌తోపాటు పరిశ్రమల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు, ఎంపీడీవోలు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. తొలుత ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహించాలని గడువు నిర్ణయించారు. ఒకటికి పూర్తికాకపోవడంతో మార్చి 15 వరకు గడువును పొడిగించారు.

● విద్యుత్ సర్వీసుల ఆధారంగా...

జిల్లాలో ఉన్న విద్యుత్ సర్వీసుల ఆధారంగా సర్వే చేపట్టారు. జిల్లాలో మొత్తం 82,395 ఎంఎస్ఎంఈల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 68,360లను సర్వే ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. మిగిలిన 14,035ల సర్వే చేయాల్సి ఉంది. ఐదు రోజుల్లో ఈ సర్వే పూర్తి చేయాలని ఇప్పటికే కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

● 'ర్యాంపు'తో పెరగనున్న సంఖ్య

ఇప్పటివరకు తయారీ, సేవారంగాల వరకు ఉన్న ఎంఎస్ఎంఈల పరిధి కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహకారంతో కొత్తగా తీసుకొచ్చిన ర్యాంపు (రైజింగ్ అండ్ ఎక్సెలరేటింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్) పథకం ద్వారా వ్యాపార సంస్థలు, దుకాణాలు ఎంఎస్ఎంఈల కిందకు రానున్నాయి. దీంతో వాటి సంఖ్య జిల్లాలో భారీగా పెరగనున్నది. చిన్న బడ్డీ కొట్టు నుంచి ఉత్పత్తి చేసే పరిశ్రమల వరకు ఎంఎస్ఎంఈ కిందకు రానున్నాయి. జిల్లా పరిశ్రమలశాఖ రికార్డుల్లో ఇప్పటివరకు 18,167 ఎంఎస్ఎంఈలు మాత్రమే ఉన్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ర్యాంపు పథకం ద్వారా వీటి సంఖ్య పెరగనున్నది. విద్యుత్ సర్వీసులు, కార్మికశాఖ ఇచ్చిన వివరాలు, జీఎస్టీ సంస్థ ఇచ్చిన వివరాల ద్వారా సర్వే చేశారు. వీటన్నింటి ఆధారంగా సర్వేలో భారీగా ఎంఎస్ఎంఈల సంఖ్య పెరిగింది.

ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలు	
తయారీ రంగం	: 4104
సర్వీసు యూనిట్స్	: 14,648
ట్రేడ్ యూనిట్స్	: 12,666
మూత పడినవి	: 23,352
నాన్ ఎంఎస్ఎంఈ యూనిట్లు	: 13,590
మొత్తం	: 68,360 యూనిట్స్

● ప్రయోజనాలు ఇవీ..

ఈ సర్వే ద్వారా పరిశ్రమల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనేక విధాలుగా సహాయ, సహకారాలు అందించనున్నది. ప్రధానంగా తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, విద్యుత్ బిల్లులో రాయితీ, పెండింగ్ బిల్లులు 45 రోజుల్లో ఇప్పించడం, ప్రభుత్వ టెండర్లలో స్థానిక పరిశ్రమలకు ప్రాధాన్యం, మార్కెట్‌లో డిమాండ్‌ను గుర్తించి, ఉత్పత్తి చేసేలా అవగాహన కల్పించ డంతో పాటు పలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర ఎగ్జిబి షన్లలో పాల్గొనేం దుకు అనుమ తులు మంజూరు చేయడం.. వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.



నెల్లూరు రూరల్ మండలంలో దుకాణదారుతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో, రూరల్ ఎంపీడీవో తదితరులు

ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

ఎంఎస్ఎంఈ సర్వేలో ప్రతి ఒక్కరూ వివరాలు నమోదు చేసుకో వాలి. కేంద్రం ర్యాంపు పథకం ద్వారా వ్యాపార దుకాణాలను సైతం ఎంఎస్ఎంఈల కిందకు తీసుకొచ్చింది. వ్యాపారులకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది. మార్చి 15 వరకు గడువు ఉంది. సర్వే సభ్యులకు సహకరించి, పూర్తి వివరాలు అందచేయాలి.

- మారుతీప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్


	కిలో
బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8285
వెండి కిలో ధర	రూ. 99,700
వెండి ఒక గ్రాము	రూ.100.70

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 12 మార్చి 2025




కేంద్ర పథకానికి రెండు హాస్టళ్ల ఎంపిక

నెల్లూరు (హరనాథపురం) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ పథకానికి జిల్లాలో రెండు హాస్టళ్లు ఎంపికైనట్లు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేక రులతో మాట్లాడుతూ ఆ జాబితాలో కందుకూరు, మనుబోలు బాలికల హాస్టళ్లు ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క హాస్టల్‌కు రూ.3.30కోట్లు మంజూరయ్యాయని ఆ నిధులతో హాస్టళ్ల ఆధునికీకరణ, భవనాలు, వంటశాలు, ప్రహరీతోపాటు విద్యార్థులకు అవసరమయ్యే మెరుగైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

దొరికితేనే దొంగలు!

ఫిబ్రవరి 22వ తేదీన వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. చెన్నై నుంచి నెల్లూరుకు ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల వెండిని గుర్తించారు. చెన్నైలో తక్కువ ధరకు కొనుగోలు చేసి నెల్లూరులో విక్రయిస్తున్నట్లు తేలింది. నగరంలోని ఓ ప్రముఖ జ్యూవెల్లరీ షాపు యజమానులు ఈ తప్పుడు పనికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వెండి విలువ రూ.40 లక్షల వరకూ ఉంటుందని అంచనా.

మార్చి 11వ తేదీన వెంకటాచలం టోల్‌ప్లాజా వద్దనే విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ కారులో 4.18 కేజీల బంగారం దొరికింది. ఈ బంగారాన్ని చెన్నైలో తక్కువ ధరకు బిల్లులు లేకుండా కొనుగోలు చేసి దానిని అక్రమంగా నెల్లూరులోని ఓ ప్రముఖ జ్యూవెల్లరీ షాపునకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బంగారం విలువ రూ.3.37 కోట్లుగా లెక్కించారు. నిబంధనల ప్రకారం ఈ బంగారాన్ని కొనుగోలు చేసి ఉంటే ప్రభుత్వానికి రూ.10 లక్షలపైగా జీఎస్టీ చెల్లించాలి.



- జిల్లాలో జోరుగా 'జీరో' వ్యాపారం
- అక్రమ మార్గంలో బంగారం, వెండి దిగుమతి
- చెన్నైలో తక్కువకు కొనుగోళ్లు.. ఇక్కడ మార్కెట్ ధరకు విక్రయం
- ఏటా రూ.కోట్ల పన్నులు ఎగనామం
- సమాచారం అందితేనే కదులుతున్న విజిలెన్స్
- మామూళ్ల మత్తే ఇందుకు కారణమా!?
- స్టేట్ ట్యాక్స్, జీఎస్టీ అధికారుల తీరుపై విమర్శలు

మూడు వారాల వ్యవధిలో నమోదైన కేసులివి. ఇక వెలుగులోకి రాని కేసులు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ఓ వైపు విజిలెన్స్ అధికారులు దాడులు చేసి ఆభరణాలు పట్టుకుంటున్నా అక్రమార్కుల్లో ఏమాత్రం జంకూ బెంకూ కనిపించడం లేదు. పోలీసులు కూడా సమాచారం అందితేనే దాడులు చేస్తున్నారు. నిత్యం చెన్నై నుంచి నెల్లూరుకు రూ.కోట్లు విలువైన బంగారం, వెండి ఆభరణాల రవాణా జరుగుతూనే ఉంది. జిల్లాలో నిత్యం రూ.కోట్లలో బంగారం వ్యాపారం జరుగుతోంది. అందులో బిల్లులతో అమ్మే బంగారం ఎంత ఉంటుందో.. బిల్లులు లేకుండా అమ్మే బంగారం కూడా అంతేస్థాయిలో ఉంటుందన్న ప్రచారముంది. దీనిమూలంగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం రోజుకు రూ.లక్షల్లో పక్కదారి పడుతున్నట్లు అర్థమవుతోంది.

● చెన్నై నుంచి రవాణా ఇలా..

జిల్లాలోని వ్యాపారులంతా దాదాపుగా చెన్నై నుంచే బంగారాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటుంటారు. ఇందులో బిల్లుల ద్వారా ఎంత బంగారం దిగుమతి అవుతుంటుందో బిల్లులు లేకుండా కూడా అంతే బంగారం తెప్పించుకుంటారు. బంగారం పుష్కలంగా లభ్యమయ్యే కువైట్ వంటి దేశాల నుంచి చెన్నైకు విమానాల ద్వారా బంగారం స్మగ్లింగ్ జరుగుతూ ఉంటుంది. అలా దిగుమతి అయిన బంగారాన్ని నమ్మకస్థులకు విక్రయిస్తుంటారు. జిల్లాలోని కొంతమంది ముఠాగా ఏర్పడి చెన్నై నుంచి అక్రమ మార్గంలో నెల్లూరుకు బంగారం దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో వాణిజ్య కేంద్రాలైన నెల్లూరు, కావలికి చెందిన కొంతమంది వ్యాపారులు అత్యాశకు పోయి బిల్లులు లేని ఈ దొంగ బంగారాన్ని తెచ్చుకుంటున్నారు. ఇక్కడ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆభరణాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. బిల్లులు లేకుండా కేజీ బంగారాన్ని కొనుగోలు చేస్తే సుమారు రూ.3 లక్షల వరకు మిగులుతుందని సమాచారం. ఒక వ్యాపారి ఒకసారి చెన్నై నుంచి కనీసం కేజీకి తగ్గకుండా ఆభరణాలు తెచ్చుకుంటారని తెలుస్తోంది. కొంతమంది బడా వ్యాపారులు ఒకేసారి రూ.2 కోట్లకుపైగా సరుకును కూడా కొనుగోలు చేస్తారని సమాచారం. ఇలా బిల్లులు లేకుండా జీరో దందా మూలంగా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది. ఎక్కువగా రైళ్లలోనే ఈ రవాణా జరుగుతోంది. కావలి, నెల్లూరుకు చెందిన కొంతమంది సామాన్య వ్యక్తుల్లా రైళ్లలో చెన్నైకు వెళతారు. అక్కడ బంగారం కొని తిరిగి సాయంత్రానికి రైళ్లలోనే వచ్చేస్తారు. అయితే, ఇటీవల రైళ్లలో తనిఖీలు ఎక్కువగా జరుగుతుండటంతో ఇప్పుడు జీరో వ్యాపారులు బస్సులు, కార్లు వంటి వాహనాలను ఎంచుకుని, రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులకు పక్కా సమాచారం అందినప్పుడే వీరి అక్రమ వ్యాపారం వెలుగులోకి వస్తోంది.





టోల్‌ప్లాజా వద్ద బంగారం ఉన్న కారును ఆపుతున్న విజిలెన్స్ బృందం

● పర్యవేక్షణ ఏదీ?

జిల్లాలో కొన్నేళ్ల నుంచి బంగారం జీరో బిజినెస్ జరుగుతుందన్నది బహిరంగ రహస్యం. పోలీసులే కాకుండా అనేక సార్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు, రైల్వే పోలీసులు పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అయినా దొంగ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. బంగారం దుకాణాల్లో కూడా చాలా వరకూ బిల్లులు లేకుండానే అమ్మకాలు జరుగుతుంటాయి. నెల్లూరు నగరంలోని చిన్న బజారు, పెద్ద బజారు ప్రాంతాలకు వెళితే చాలా దుకాణాల్లో బిల్లులు ఇవ్వరు. కొన్నిచోట్ల 'ఎస్టిమేషన్' పేరుతో ఉన్న బిల్లులు మాత్రం ఇస్తున్నారు. ఈ దుకాణాల్లో ఆకస్మికంగా దాడులు జరిపితే అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తాయి. కానీ స్టేట్ ట్యాక్స్, జీఎస్టీ అధికారులు ఎప్పుడూ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ప్రతి నెలా జిల్లాలో కొన్ని రూ.వందల కోట్ల బంగారం వ్యాపారం జరుగుతున్నా ఆ స్థాయిలో ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారా!? లేదా!? అన్నది పరిశీలిస్తే జీరో దందా బట్టబయలవుతుంది. కానీ జీరో బిజినెస్ చేసే వ్యాపారులు సిండికేట్‌గా మారి అధికారులు దాడులకు రాకుండా ప్రతి నెలా మామూళ్లు అందిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పట్టుబడిన బంగారాన్ని తూకం వేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఇక 3 రోజులే గడువు.. సర్వే పూర్తయ్యింది 83 శాతం

- మిగిలిన లక్ష్యం పూర్తికి కసరత్తు
- 15తో ముగియనున్న ఎంఎస్‌ఎంఈల సర్వే
- సర్వే, సపోర్టు యాప్‌లోకి సమాచారం

8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.24

సహరి (గురువారం) : 5.03

అధికారం చేతిలో ఉంది.. ఇక అడిగేవారు ఎవరుంటారని గత వైసీపీ హయాంలో అప్పటి పాలకులు పేట్రేగిపోయారు. ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేయడమేకాదు.. వాటికి పట్టాలు సృష్టించి కాసులు ఇచ్చిన వారికి పంపిణీ చేసేశారు. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు కూడా వారికి వత్తాసు పలకడంతో అనర్హులకూ ప్రభుత్వ భూములను కట్టబెట్టారు. ఈ వ్యవహారంపై అప్పట్లో ప్రజలు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ భూబాగోతంపై విచారించి, పేదలకు న్యాయం చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

వైసీపీ నేతల భూదాహం

- గత ప్రభుత్వంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- వాగు, వంక, కొండపోరంబోకు భూములకు పట్టాలు
- పన్ను చెల్లింపుదారులకూ భూ కేటాయింపులు
- మాజీ మంత్రి కాకాణి కనుసన్నల్లో రెవెన్యూ అధికారులు
- ఇప్పటికే ఇద్దరు తహసీల్దార్ల సస్పెన్షన్
- పూర్తిస్థాయిలో విచారణకు ప్రజల డిమాండ్

పొదలకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి కాకాని గోవర్ధన్‌రెడ్డి సొంత మండలమైన పొదలకూరులో వైసీపీ నేతలు గత ఐదేళ్లలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారు. కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో అడ్డగోలుగా ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించి రూ.కోట్లు వెనకేసుకున్నారు. 2019, ఆగస్టు నుంచి 2021, ఆగస్టు వరకు పొదలకూరు తహసీల్దారుగా పనిచేసిన స్వాతి పలు భూ అక్రమాలకు పాల్పడి, విచారణలో నిగ్గు తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. 2023, జూన్ నుంచి 2024 జూన్ వరకు వివిధ భూ కుంభకోణాలు జరిగాయి. ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారి సహకారంతో ప్రభుత్వ భూములను సబ్ డివిజన్ చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపి ప్రైవేటు వ్యక్తుల పేర్లు నమోదు చేశారు. ఈ క్రమంలో కొందరికి డీకే పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపారు. సాక్షాత్తు రెవెన్యూ అధికారులే ధనాశతో ప్రభుత్వ భూములను ప్రైవేటుపరం చేశారు.

● ఎన్‌ఆర్‌ఐలకూ ధారాదత్తం

సర్వే నెంబరు 561, 562, 559, 330, 292 నెంబర్లలో గతంలో ఎస్సీ, ఎస్టీలకు పీవోటీ చట్టం ప్రకారం ప్రభుత్వం పట్టాలను అందజేసి ఉన్నా, ప్రస్తుత భూపంపిణీలో ఎన్‌ఆర్‌ఐ (నాన్ రెసిడెంట్ ఇండియన్)లకు భూ పంపిణీలో పేర్లను చేర్చి వారి పేరున పట్టాలు మంజూరు చేశారు. అలాగే 554-2, 554-3, 537-7, 544-2, 545-3, 545-4, 330, 535, 333-4, 363, 389-3 కాకుండా స్థానికేతరులైన వారికి పీవోటీ చట్టానికి విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన భూములను భూస్వాములకు ధారాదత్తం చేశారు. అలాగే బత్తులపల్లి గ్రామ పరిధిలో సర్వే నెం.249-1-1, 252, 151-1250-2లలో సుమారు ఎ25.00 సెంట్లు భూమి ఎప్పటి నుంచో వాటిని గ్రామంలోని ఇతర భూములకు వెళ్లేందుకు దారులుగా ఉన్నాయి. ఆ భూములను సైతం పట్టాలను పంపిణీ చేశారు. భూములను యథా స్థితిలో ఉంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో చాలామంది స్థానికేతరులకు, గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు అర్హులు కాకున్నా అసైన్‌మెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ మొత్తంలో భూమిని పంపిణీ చేసివున్నారు. ఉట్లపాలెం, కొత్తకం బాలపల్లి గ్రామ సర్వే నెంబరు 93, 112, 113, 115, 115-4లో సుమారు ఎ.52.00 సెంట్లు భూమిలో సుమారు రూ.33.00 సెంట్ల భూమిలో కండలేరు జలాశయ ముంపు ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే ప్రస్తుతం భూపంపిణీలోని మిగిలిన గ్రామ కంఠం భూమిని వైసీపీ కార్యకర్తలకు పట్టాల పంపిణీకి సిద్ధం చేవారు.

నేదురుపల్లి మజరా యర్రబల్లి గ్రామ సర్వే నెంబరు 814లో కొండ అయినా పట్టాను కేటాయించారు. సర్వే నెంబరు 159లో ఎ.16.34 సెంట్లు సాగుకు పనికిరాని భూమిని ఇద్దరు పన్ను చెల్లింపుదారులకు పట్టాలను కేటాయించారు. మరుపూరులో నివాసం లేనివారికి ధనికులకు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు నకిలీ ఆధార్, రేషన్ కార్డులను సృష్టించి, తమకు ఇష్టం వచ్చినట్లు పట్టా భూములిచ్చారు. ఏఆర్‌పీ జాబితాలో పేర్లు లేకున్నా మరుపూరులో దొంగ పట్టాలు సుమారు 60 వరకు ముడుపులు తీసుకుని పట్టా కాగితం ఇచ్చి ఉన్నారనే అభియోగాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మరుపూరులో నిబంధనలకు విరుద్ధంగా భూమి సాగు చేసుకుంటున్న వైసీపీ నేత

లోపభూయిష్టంగా భూ పంపిణీ

మండలంలోని వావింటపర్తి, మరుపూరు, ప్రభగిరిపట్నం గ్రామాల్లో ఎక్కువగా భూఆక్రమణలు జరిగాయి. గత ప్రభుత్వం మండలంలో చేపట్టిన భూపంపిణీ లోపభూయిష్టంగా, తప్పులతడకగా ఉంది. అంతేగాక ఒకే వర్గానికి పూర్తి ప్రాధాన్యతను ఇచ్చిందనే విమర్శలు ఉన్నాయి. ధనార్జనే ధ్యేయంగా అర్హులకు అన్యాయం చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా కొండ, వాగు, మేత పోరంబోకు భూములను ధారాదత్తం చేశారు. ప్రభగిరిపట్నం గ్రామ సర్వే నెం.117, 58లలోని 60 ఎకరాల్లో ఉన్న కొండను సాగులో ఉన్నట్లు చూపుతూ చేతివాటం ప్రదర్శించారు. అలాగే వావింటపర్తిలో సర్వే నెంబరు 234లో ఎ11.38సెంట్లు కాలువ (వాగు), సర్వే నెం.219లో ఎ7.50సెంట్లు మేత బీడు (మేత పోరంబోకు), సర్వే నెం.215లో ఎ.21.25 సెంట్లు మేత బీడు (మేతపోరంబోకు), తరతరాల నుంచి వదిలి వేసిన భూములను సైతం సాగులో ఉన్నట్లు చూపుతూ వాటిలో కూడా భూపంపిణీ చేశారు.

రామావతారంలో హనుమంతుడిపై ప్రసన్నుడు







ఉదయం సూర్యప్రభ, రాత్రి హంస వాహనంపై కొలువదీరిన శ్రీరంగనాథుడు

● హనుమంతుడిపై ప్రసన్నుడు..

బిట్రగుంట : బిలకూట క్షేత్రంలో మంగళవారం రాత్రి శ్రీవారు రామావతారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి హనుమంతుడిపై కొలువుదీరి విహరించారు. భక్తులు గోవింద నామస్మరణలు చేస్తూ స్వామివారికి కాయా కర్పూర హారతి ఇచ్చి దర్శించుకున్నారు. నారద మహాముని విగ్రహం వద్ద ప్రత్యేక పూలాలంకరణ, బిలకూటక్షేత్రం విద్యుద్దీపాలతో శోభిల్లింది. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి టీడీపీ నేతలతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.ఆలయ ఈవో రాధాకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సూర్య, హంసలపై రంగనాథుడి విహారం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు కనువిందు చేశారు. ఈ సందర్భంగా విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. రాత్రి హంస వాహనంపై కొలువుదీరిన స్వామివారి భక్తులను కటాక్షిస్తూ విహరించారు. ఉత్సవాలు సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి చర్చకు ఆహ్వానం

కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలను ఎన్నికల సంఘం చర్చకు ఆహ్వానించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి పరిష్కారం లభించని సమస్యలపై భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు కోరిందని, ఈ మేరకు ఈసీ మంగళవారం రాజకీయ పార్టీలకు వ్యక్తిగతంగా ఒక లేఖను పంపిందని తెలిపారు. పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో చర్చించేందుకు కూడా అవకాశం ఇచ్చిందన్నారు. పార్టీ సభ్యులతో పరస్పర అనుకూల సమయానికి సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రక్రియను చట్టబద్ధమైన మార్గంలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గత వారం జరిగిన ఈసీఐ సమా వేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని సీఈఓలు, డీఈఓలు, ఈఆర్‌ఓలకు రాజకీయ పార్టీలతో తరచుగా సమావేశాలు నిర్వహించాలని సూచించారని తెలిపారు. ఈ సమావేశాల్లో అందిన సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన వ్యవస్థలో పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికను ఈ నెల 31 నాటికి ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. ఈ వికేంద్రీకృత చర్చా విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.